






# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


# భోగాపురానికి ముహూర్తం ఫిక్స్





- ఆగస్టు 1న ప్రధాని చేతులమీదుగా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రారంభం
- చరిత్రలో నిలిచిపోయేలా కార్యక్రమం జరగాలి
- విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారం.. కొత్త అవకాశాలనూ తీసుకొస్తుంది
- పోర్టులు, హైవేలు, పరిశ్రమలు, ఎయిర్‌పోర్టు, టూరిజం ప్రాజెక్టులతో ఉత్తరాంధ్ర అన్‌స్టాపబుల్
- ఏపీ సంస్కృతి, కళలను చాటేలా అత్యంత కళాత్మకంగా ప్రతి విభాగం ఉండాలి
- సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

2

భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా ఆగస్టు 1న ప్రారంభం కానుంది. ఈ మేరకు షెడ్యూల్ ఖరారు అయింది. 2014లో నాటి తెలుగుదేశం ప్రభుత్వంలో మొదలైన ఎయిర్‌పోర్టు పనులను కూటమి ప్రభుత్వం వేగవంతం చేసి రెండేళ్ల కాలంలో పూర్తి చేసింది. ఎయిర్‌పోర్టు ప్రారంభ కార్యక్ర మంపై సీఎం చంద్రబాబు శనివారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఉత్తరాంధ్రకు మణిహారంగా మారుతుందని, ఉత్తరాంధ్ర ఇక అన్‌స్టాపబుల్ అని వ్యాఖ్యానించారు. ప్రధాని చేతుల మీదుగా జరిగే ప్రారంభోత్సవం చరిత్రలో నిలిచి పోయేలా నిర్వహించాలని ఆదేశించారు.

# ‘మిషన్ ఆగమన్’ సక్సెస్

- నింగిలోకి దూసుకెళ్లిన విక్రమ్-1
- స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన
- దేశంలోనే తొలి ప్రైవేట్ ఆర్బిటాల్
- షార్‌లో దేవాన్ష్‌తో కలిసి వీక్షించిన లోకేష్
- అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు

6

‘మిషన్ ఆగమన్’ ద్వారా భారత అంతరిక్ష రంగంలో మరో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ప్రైవేటు సంస్థ అయిన ప్రముఖ స్పేస్ టెక్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన భారతదేశపు తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ క్లాస్ రాకెట్ విక్రమ్-1ను తిరుపతి జిల్లా శ్రీహరికోట సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం(షార్) ఒకటో ప్రయోగ వేదిక నుంచి విజయవంతంగా ప్రయోగించారు. ఈ ప్రయోగ కార్యక్రమాన్ని షార్‌లోని ఇస్రో లాంచ్ వ్యూ గ్యాలరీ నుంచి మంత్రి నారా లోకేష్ తనయుడు దేవాన్ష్‌తో కలిసి వీక్షించారు. దేశంలోనే తొలి ప్రైవేట్ రాకెట్‌గా ఆర్బిటాల్ విక్రమ్-1ను అభివృద్ధి చేశారు. ‘విక్రమ్-1’ రాకెట్ తొలి ప్రయోగం విజయవంతంపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. స్కైరూట్ ఏరోస్పేస్, ఇస్రో, ఇన్-స్పేస్, ఎన్ఎస్ఐఎల్‌లకు ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు.

# కాలుష్య రహిత రాష్ట్రం లక్ష్యం



అక్టోబర్ 2 నాటికి చెత్త రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. స్వచ్ఛాం ధ్ర-స్వర్ణాంధ్రతో పరిశుభ్రమైన, సంపన్నమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణ మే లక్ష్యమని స్పషం చేశారు. ఇంటి నుంచే చెత్త రాకుండా నెట్ జీరో విధానాన్ని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కృష్ణా జిల్లా గుడివాడలో నిర్వహించిన 18వ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలోని 120 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో రూ.15,274 కోట్ల విలువైన ప్రజారోగ్య, మున్సిపల్ ఇంజినీరింగ్ పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ అవార్డులు అందజేశారు. గుడివాడ దివంగత ఎన్టీఆర్ తొలిసారి ప్రజాక్షేత్రంలో నిలబడిన ప్రాంతమని గుర్తు చేశారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి కోసం రాష్ట్రంలో 8 ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. గుంటూరు ఘటనపై స్పంది స్తూ తప్పు చేసిన వ్యక్తి ఏ పార్టీకి చెందిన వారైనా వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు.

- మీ ఊరిని పరిశుభ్రంగా ఉంచే బాధ్యత మీదే
- పేదల పక్షాన ఆలోచించే మనసు ప్రజా ప్రభుత్వానిది
- 2024లో రాజకీయ చెత్తను ప్రజలే శుభ్రం చేశారు
- బూతులు తిట్టిన వారి నోళ్లను ఓట్లతో కడిగారు
- భావ ప్రకటన పేరుతో అసభ్య పోస్టులు సహించం
- తప్పు చేస్తే ఏ పార్టీ వారినైనా వదిలిపెట్టేది లేదు
- గుడివాడ స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రలో సీఎం చంద్రబాబు
- రూ.15,274 కోట్లతో పట్టణాభివృద్ధి పనులకు శ్రీకారం

3

# పవన్‌కళ్యాణ్‌కు లోకేష్ పరామర్శ



8

ఇటీవల ముంబయిలో కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని డిశ్చార్జి అయి హైదరాబాద్ నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను హైదరాబాద్‌లో ఆయన నివాసంలో మంత్రి లోకేష్ పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



# గుంటూరు ఘటనపై సీఎం సీరియస్

- బాధ్యులపై కఠిన చర్యలకు ఆదేశం
- చట్టం ముందు అందరూ సమానమే
- మహిళల భద్రతకు అండగా ఉంటాం
- తప్పు చేస్తే ఎవరికైనా శిక్ష తప్పదని హెచ్చరిక


8



# భోగాపురానికి ముహూర్తం ఫిక్స్

- ఆగస్టు 1న ప్రధానితో ఎయిర్‌పోర్ట్ ప్రారంభం
- చరిత్రలో నిలిచిపోయేలా కార్యక్రమం జరగాలి
- విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారం.. కొత్త అవకాశాలనూ తీసుకొస్తుంది
- పోర్టులు, హైవేలు, పరిశ్రమలు, ఎయిర్‌పోర్టు, టూరిజం ప్రాజెక్టులతో ఉత్తరాంధ్ర అన్‌స్టాపబుల్
- ఏపీ సంస్కృతి, కళలను చాటేలా అత్యంత కళాత్మకంగా ప్రతి విభాగం ఉండాలి
- సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు





అమరావతి (చైతన్యరథం): భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రధాని నరేంద్ర మోదీ చేతులమీదుగా ఆగస్టు 1న ప్రారంభించనున్నారు. ఈ మేరకు ప్రధాని షెడ్యూల్ ఖరారు అయింది. 2014లో నాటి తెలుగుదేశం ప్రభుత్వంలో మొదలైన భోగాపురం ఎయిర్‌పోర్టు పనులను కూటమి ప్రభుత్వం వేగవంతం చేసి రెండేళ్ల కాలంలో పూర్తి చేసింది. సర్వాంగ సుందరంగా తయారైన భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వ హించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ఎయిర్ పోర్టు ప్రారంభ కార్యక్రమంపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష చేశారు. సమీక్షకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, సీఎస్ సాయిప్రసాద్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాతో పాటు ఉన్నతాధికారులు, మంత్రులు సత్యకుమార్, అచ్చె న్నాయుడు, అనితతో పాటు పలువురు పాల్గొన్నారు. సమీక్షకు హాజరైన ఏవియేషన్ శాఖ అధికారులు, ఎయిర్‌పోర్టు నిర్మించిన జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు భోగాపురం ఎయిర్పోర్టులో నిర్మాణ వివరాలు, వసతులు, సౌకర్యాలను వివరించారు. ఎయిర్‌పోర్టు కార్యకలాపాలు ప్రారంభించడానికి అవసరమైన 8 కీలక అను మతులు ఇప్పటికే పొందినట్లు వివరించిన అధికారులు వివరించారు.

### ఉత్తరాంధ్ర ఇక అన్‌స్టాపబుల్

ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ భోగాపురం ఇంటర్నే షనల్ ఎయిర్‌పోర్ట్ ఉత్తరాంధ్రకు మణిహారంగా మారుతుందని, కొత్త ఎయిర్‌పోర్టు ఆ ప్రాంత స్థితిగతులను, సామాన్యుల జీవితా లను మార్చేస్తుందని వ్యాఖ్యానించారు. ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రలో కొత్త అవకాశాలను తీసుకువస్తుందని తెలిపారు. ఎకనమిక్ యాక్టివిటీ ఉరకలు పెడుతుంది. రాకపోకలు మొదలయ్యాక ఆ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మారుతాయి. సామాన్యులు కూడా అనేక రకాలుగా లబ్ధి పొందుతారు. రవాణా మాత్రమే కాకుండా టూరిజం, పారిశ్రామికపరంగా కూడా ఈ ప్రాంత అభివృద్ధికి ఈ ఎయిర్‌పోర్టు ఉపయోగపడుతుంది. విశాఖ ఎకనమిక్ రీజియన్‌లో ఈ ఎయిర్‌పోర్టు కీలక పాత్ర పోషిస్తుంది. హైదరాబాద్‌లో వచ్చిన శంషాబాద్ ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్టు ఆ ప్రాంతంలో ఎటువంటి మార్పులు తెచ్చిందో నేడు భోగాపురం తో ఆ ప్రాంతంలోనూ అటువంటి మార్పులే తెస్తుంది. ఎకనమిక్ యాక్టివిటీ పెరిగి అన్ని వర్గాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయి. సంపద సృష్టికి అవకాశం ఏర్పడుతుంది. సాగునీటి ప్రాజెక్టులు, హైవేలు, పోర్టులు, ఎయిర్‌పోర్టులతో ఉత్తరాంధ్ర అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతుంది. రానున్నరోజుల్లో ఉత్తరాం ధ్ర అన్‌స్టాపబుల్ అని వ్యాఖ్యానించారు.

### ప్రతి పౌరుడు, ప్రతి కుటుంబం సెలబ్రేట్ చేసుకోవాలి

ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, కళలను చాటేలా అత్యంత కళాత్మకంగా ఎయిర్‌పోర్టులో ప్రతి విభాగాన్ని తీర్చిదిద్దాలి. ప్రధాని చేతుల మీదు జరిగే ప్రారంభోత్సవం చరిత్రలో నిలిచిపోవాలి. గిరిజన సంస్కృతి, హస్తకళలు గుర్తు చేసేలా స్వాగత కార్యక్రమం ఉండా లి. భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభాన్ని ఉత్తరాంధ్రలోని ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడు సెలబ్రేట్ చేసుకోవాల్సిన శుభ సంద ర్భం. ప్రతి పౌరుడూ ఎయిర్ పోర్టును చూసి గర్వించే పరిస్థితి రావాలి. ఉత్తరాంధ్రలో దీన్ని పండుగలా చేసేలా ప్రజలను, విద్యా ర్థులను, యువతను భాగస్వాములను చేయాలని సీఎం చంద్ర బాబు ఆదేశించారు.







# కాలుష్య రహిత రాష్ట్రం లక్ష్యం

- అక్టోబర్ 2 నాటికి చెత్త రహితంగా తీర్చిదిద్దుతాం
- మీ ఊరిని పరిశుభ్రంగా ఉంచే బాధ్యత మీదే
- పేదల పక్షాన ఆలోచించే మనసు ప్రజా ప్రభుత్వానిది
- 2024లో రాజకీయ చెత్తను ప్రజలే శుభ్రం చేశారు
- బూతులు తిట్టిన వారి నోళ్లను ఓట్లతో కడిగారు
- భావ ప్రకటన పేరుతో అసభ్య పోస్టులు సహించం
- తప్పు చేస్తే ఏ పార్టీ వారినైనా వదిలిపెట్టేది లేదు
- గుడివాడ స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రలో సీఎం చంద్రబాబు
- రూ.15,274 కోట్లతో పట్టణాభివృద్ధి పనులకు శ్రీకారం




గుడివాడ(చైతన్యరథం): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రతో పరిశుభ్రమైన, సంపన్నమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఇంటి నుంచే చెత్త రాకుండా నెట్ జీరో విధానాన్ని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్బన్ న్యూట్రల్ జీవన విధానం అవలంబించాలని, ఇంటిపై పడే వర్షపు నీటిని భూగర్భజలాలుగా మార్చుకునే చర్యలు తీసుకోవాలని సూచించారు. కృష్ణా జిల్లా గుడివాడలో నిర్వహించిన 18వ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలోని 120 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో రూ.15,274 కోట్ల విలువైన ప్రజారోగ్య, మున్సిపల్ ఇంజినీరింగ్ పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. ప్రజా వేదిక సమీపంలో ఆన్‌లైన్ వర్క్స్ మానిటరింగ్ సిస్టమ్‌ను పరిశీలించారు. మెప్మా మహిళా సంఘాలు తయారు చేసి ప్రదర్శించిన ఉత్పత్తులను తిలకించారు. నెల్లూరు, కొండపల్లి, బేతంచర్ల, కమలాపురం, బద్వేల్, ఏలేశ్వ రం, నర్సీపట్నం, పెద్దాపురంలో ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ ప్లాంట్లను సీఎం ప్రారంభించారు. ఉయ్యూరు, కుప్పం, నిడుదవోలు, బాపిరాజు, మదనపల్లి, విజయనగరం, మంగళగిరి -తాడేపల్లి కార్పొరేషన్, గ్రేటర్ విశాఖ, నెల్లూరు కార్పొరేషన్లకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ అవార్డులు అందజేశారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్‌పై కాఫీ టేబుల్ బుక్‌ను ఆవిష్కరించారు.

### స్వచ్ఛ రాజకీయ లక్ష్యంతో ఎన్టీఆర్ పార్టీ స్థాపన

రాష్ట్రంలో ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటున్నానని, ఈసారి 18వ కార్యక్రమాన్ని గుడివాడలో నిర్వహిస్తున్నామని తెలిపారు. గుడివాడ దివంగత ఎన్టీఆర్ తొలిసారి ప్రజాక్షేత్రంలో నిలబడిన ప్రాంతమని గుర్తు చేశారు. స్వచ్ఛమైన రాజకీయాలు, స్వచ్ఛమైన ప్రజాప్రతినిధులు, స్వాభిమానం అనే లక్ష్యాలతో ఎన్టీఆర్ పార్టీని స్థాపించారని చెప్పా రు. గతంలో స్వార్థ రాజకీయాలే ఉన్న పరిస్థితిని మార్చి అభివృద్ధి, సంక్షేమానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి, ఉపాధి, ఉద్యోగాల కల్పన, సంపద సృష్టే లక్ష్యంగా పాలన అందిస్తోందని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా శాంతిభద్రతలు, సంక్షేమం, ఆదాయ వృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పారు.

### పరిశుభ్రమంటే ప్రజారోగ్యం మెరుగుపడటం

'పరిశుభ్రత అంటే కేవలం రోడ్లు ఊడ్చడం మాత్రమే కాదని, పర్యావరణం, ప్రజారోగ్యం మెరుగు పడటమే అసలు లక్ష్యం. గత పాలనలో చెత్తతో నిండిపోయిన ప్రాంతాలను ఇప్పుడు పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నాం. ప్రతిఒక్కరూ తమ జన్మస్థలాన్ని చెత్త రహితంగా ఉంచే బాధ్యత తీసుకోవాలని పిలుపునిస్తున్నా. ప్రభు త్వానికి ప్రజలు సహకరిస్తేనే స్వచ్ఛత లక్ష్యం సాధ్యం. పచ్చదనం, పరిశుభ్రతతోనే స్వర్ణాంధ్ర నిర్మాణం పూర్తి అవుతంది. తెలుగు జాతి భవిష్యత్తును రక్షించే బాధ్యత తాను తీసుకున్నానని, పూర్తి పారదర్శకంగా సుపరిపాలన అందిస్తున్నాం. ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతిని సహించబోం. ప్రజా రాజధాని అమరావతిని కాపాడేం దుకు ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. గతంలో జన్మభూమి కార్యక్రమానికి ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారు స్పందించిన స్ఫూర్తి కొనసాగాలని ఆకాంక్షిస్తున్నా. సీవరేజ్

(తరువాయి 4లో..)



చైతన్యరథం





# కాలుష్య రహిత రాష్ట్రం లక్ష్యం

(3వ పేజీ తరువాయి.. )

ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, చెరువుల పునరుద్ధరణ, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధి ద్వారా సురక్షితమైన తాగునీరు, మెరుగైన పారిశుధ్య వ్యవస్థను తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

## అక్టోబర్ 2 నాటికి చెత్త రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం

ఇంటింటికీ చెత్త సేకరణ కోసం 126 ఎలక్ట్రిక్ ఆటోలను ప్రారంభించామని, త్వరలో మరో 1104 ఈ-ఆటోలు అందుబా టులోకి వస్తాయని తెలిపారు. రూ.528 కోట్లతో వ్యర్థాల నిర్వహ ణ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నామని, చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి కోసం రాష్ట్రంలో 8 ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ప్రతి ఇంట్లో వ్యర్థాల వర్గీకరణ ప్రారంభించాలని ప్రజలను కోరిన సీఎం, స్వచ్ఛ రథం ద్వారా వ్యర్థాల సేకరణ చేస్తూ రూ.16 కోట్ల విలువైన నిత్యావసర సరుకులు అందించామని తెలిపారు. గత పాలకులు రోడ్లపై పేరుకుపోయేలా వదిలేసిన చెత్త కారణంగా భూగర్భజలాలు కలుషితమయ్యాయని, వారు వదిలేసిన 140 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించామని చెప్పారు. అక్టోబర్ 2 నాటికి రాష్ట్రాన్ని చెత్త రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛ పథం, ఆపరేషన్ క్లీన్ స్వీప్ వంటి కార్యక్రమాలు చేపట్టా మని వెల్లడించారు.

## పట్టి సీమను అడ్డుకునేందుకు ప్రయత్నించారు

'12 ఏళ్ల క్రితం కృష్ణా డెల్టాకు నీటి ప్రవాహాలు తగ్గిపోవడంతో దేశానికి అన్నపూర్ణగా పేరొందిన ఈ ప్రాంతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. అందుకే 12 నెలల్లో పట్టిసీమ ప్రాజెక్టును పూర్తి చేసి గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించాం. ఈసారి 48 శాతం వర్షపాతం లోటు ఉన్నప్పటికీ, ఎగువ నుంచి ప్రకాశం బ్యారేజీకి నీరు రాకున్నా పట్టిసీమ ద్వారా డెల్టాకు నీరు అంది స్తున్నాం. ఇప్పటివరకు 450 టీఎంసీల నీటిని తరలించి దాదాపు రూ.50 వేల కోట్ల సంపదను సృష్టించాం. ఈ ప్రాజెక్టును అడ్డు కునేందుకు చాలామంది ప్రయత్నించినా వెనక్కి తగ్గలేదు. పోల వరం పూర్తయిన తర్వాత గ్రావిటీ ద్వారా డెల్టాకు నీరు అందిస్తాం. వంశధార నుంచి పెన్నా వరకు నదుల అనుసంధానం చేసి రాష్ట్రంలో కరువు సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు.



## అక్వా, వ్యవసాయ రంగాలకు పూర్తి మద్దతు

నీరు లేకుంటే అక్వా పరిశ్రమ ఉండదని, ప్రస్తుతం రొయ్యల ధరలు, మేత ధరల పెరుగుదల వంటి సమస్యలపై ఇప్పటికే కేంద్రంతో చర్చించామని తెలిపారు. ఈ ప్రాంత అక్వా పరిశ్రమను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడతామని, రూ.1.50 యూనిట్ చొప్పున విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. కాలుష్య నియంత్రణతోనే దిగుబడి, నాణ్యత పెరుగుతుందని, ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని రైతులకు సూచించారు. ప్రపం చవ్యాప్తంగా ఆహార పదార్థాల నాణ్యత పరీక్షలు కఠినమవుతున్న నేపథ్యంలో ప్రకృతి సేద్యంపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. పీఎం కిసాన్ కింద రైతుల ఖాతాల్లో ఏటా రూ.20 వేల వరకు జమ అవుతున్నాయని, పొగాకు రైతులను కూడా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఈ నెల 22 నుంచి తల్లికి వందనం

ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ నెల 22 నుంచి 24 తేదీల మధ్య "తల్లికి వందనం" పథకం కింద తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేస్తామని చెప్పారు. ప్రభుత్వం వద్ద డబ్బు లేకపోయినా పేదల పక్షాన నిలిచే మనసుందని పేర్కొన్నారు. అంగన్వాడీ సిబ్బంది, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం లో పనిచేసే వారికి కూడా ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. తల్లికి వందనం కింద 67,47,197 మంది విద్యార్థులకు సంబంధించి రూ.10,122 కోట్లను తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు వెల్లడించారు.

## తప్పు ఎవరు చేసినా వదిలిపెట్టం

గత పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. ప్రజలు సంతోషంగా జీవించే పరిస్థితి లేకుండా చేశారు. 2024 ఎన్నికల్లో ప్రజలు రాజకీయ చెత్తను శుభ్రం చేశారు. బూతులు తిట్టిన వారి నోళ్లను ఓట్లతో కడిగేశారని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో క్రిమినల్ ధోరణులు కొనసాగుతున్నాయని, కుట్రలు, కుతంత్రాలు, సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టులతో ప్రజలను వేధిస్తున్నా రని మండిపడ్డారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కుటుంబసభ్యు లపై చేసిన పోస్టులను ప్రశ్నిస్తే భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో సమర్థించుకోవడం సరికాదన్నారు. ప్రజల జీవితాలకు ఆటంకం కలిగించే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. శ్రీకాకుళంలో గొర్రెల కాపరిని బైక్‌తో ఢీకొట్టి చంపిన ఘటనలో బాధిత కుటుం బాన్ని ఆదుకోకుండా సాక్ష్యాలను తారుమారు చేసే ప్రయత్నాలు జరిగాయని పేర్కొన్నారు. గుంటూరులో ఇద్దరి మధ్య జరిగిన తగా దాలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త..ఒక మహిళ పట్ల దుర్మార్గంగా ప్రవర్తించిన ఘటనపై వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేసి అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులను కూడా బదిలీ చేసినట్టు తెలిపా రు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకునేందుకు వీల్లేదని, తప్పు చేసిన వ్యక్తి ఏ పార్టీకి చెందిన వారైనా ప్రభుత్వం ఒకే విధంగా వ్యవహరిస్తుందని, తప్పు చేసిన వారు ఎవరైనా వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు.

## అమరావతి, గుడివాడ బస్టాండ్ అభివృద్ధికి విరాళాలు

ఈ సమావేశంలో గుడివాడ స్థానికులు రాజధాని అమరావతితో పాటు.. గుడివాడ బస్టాండ్ అభివృద్ధికి విరాళాలు ప్రకటించారు. గుడివాడ బస్ స్టాండ్ అభివృద్ధి కోసం అన్నే నరసింహారావు, పుష్ప లీలావతి దంపతులు రూ.3 కోట్లను విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేశారు. అలాగే సాయి శ్వేత అనే గృహిణి అమరావతి అభివృద్ధికి తన చేతికున్న బంగారు గాజులను విరాళంగా ప్రకటించి అందజేశారు. ఆమె తనయుడు గణేష్ తాను దాచుకున్న కిడ్డీ బ్యాంక్ డబ్బులను సైతం అందజే శారు. అమరావతి, గుడివాడ అభివృద్ధికి విరాళాలు ఇచ్చి స్ఫూర్తిగా నిలిచారని సీఎం వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పి.నారాయణ, కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, ఎంపీ బాలశౌరి, స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తదితర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.









# గుడివాడలో సీఎం చంద్రబాబుకు ఘనస్వాగతం





గుడివాడ(చైతన్యరథం): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం చంద్రబాబుకు గుడివాడలో కూటమి నేతలు, అధికారులు ఘనస్వాగతం పలికారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో పాల్గొన్న అనంతరం సీఎం చంద్రబాబు కేకేఆర్ గౌతమ్ స్కూల్‌ను సందర్శించారు. తమ పాఠశాలకు వచ్చిన ముఖ్యమంత్రికి విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రాంగణంలో బల్క్ వేస్ట్ జనరేటర్లను పరిశీలించారు. డైనింగ్ హాల్, వంటశాల, ఆహార తయారీ విభాగం, డంపింగ్ ప్రాంతాలను పరిశీలించారు. పాఠశాల సిబ్బంది తమ సంస్థలో అమలు చేస్తున్న వ్యర్థాల నిర్వహణ విధానాన్ని సీఎంకు వివరించారు. బల్క్ వేస్ట్ జనరేటర్ మార్గదర్శకాలను పూర్తిగా అమలు చేయాలని, పర్యావరణహిత వ్యర్థాల నిర్వహణను ఆదర్శంగా తీసుకోవాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. అనంతరం స్కూల్ యాజమాన్యానికి బల్క్ వేస్ట్ జనరేటర్ ధృవపత్రాన్ని సీఎం అందజేశారు.





















# 'మిషన్ ఆగమన్' సక్సెస్

- నింగిలోకి దూసుకెళ్లిన విక్రమ్-1
- స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన
- దేశంలోనే తొలి ప్రైవేట్ ఆర్బిటాల్
- షార్‌లో దేవాన్ష్‌తో కలిసి వీక్షించిన లోకేష్
- అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు

శ్రీహరికోట(చైతన్యరథం): 'మిషన్ ఆగమన్' ద్వారా భారత అంతరిక్ష రంగంలో మరో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ప్రైవేటు సంస్థ అయిన ప్రముఖ స్పేస్ టెక్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన భారతదేశపు తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ క్లాస్ రాకెట్ 'విక్రమ్-1'ను శనివారం ఉదయం 11.30 గంటలకు తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం(షార్) ఒకటో ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి పంపారు. మిషన్ ఆగమన్ పేరిట చేపట్టిన తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ రాకెట్ ప్రయోగ కార్యక్రమాన్ని షార్‌లోని ఇస్రో లాంచ్ వ్యూ గ్యాలరీ నుంచి మంత్రి నారా లోకేష్ తనయుడు దేవాన్ష్‌తో కలిసి వీక్షించారు. దేశంలోనే తొలి ప్రైవేట్ రాకెట్ గా ఆర్బిటాల్ విక్రమ్-1ను అభివృద్ధి చేశారు. స్కైరూట్ అభివృద్ధి చేసిన ప్రొపల్షన్ సిస్టమ్స్, త్రీడీ ప్రింటెడ్ ఇంజన్లు, ఘన ఇంధన రాకెట్ బూస్టర్లు అమర్చారు. సుమారు 350 కిలోల బరువున్న నాలుగు చిన్న ఉపగ్రహాలను 450 కి.మీ ఎత్తులోని భూ నిమ్న కక్ష్యలోకి ప్రవేశపెట్టేలా విక్రమ్-1ను డిజైన్ చేశారు. విక్రమ్-1 ద్వారా గ్రహాస్పేస్, కాస్మోసర్వ్, డీక్యూబ్డ్ సంస్థలకు చెందిన టెక్నాల జీ డెమాన్‌స్ట్రేషన్ పేలోడ్లతో పాటు స్కైరూట్‌కు చెందిన 'స్కోప్' ఉపగ్రహాలను రోదసిలోకి తీసుకెళ్లారు. వీటితో పాటు కాస్మోస్ డైమండ్స్‌కు చెందిన కాస్మిక్ బ్లూమ్ అనే కళాకృతిని, మరో మైక్రో-ఆర్ట్ పీస్‌ను పంపారు. అంతరిక్ష ప్రయోగాల్లో ఖర్చు ను తగ్గించడంతో పాటు ఉపగ్రహాలను వేగంగా కక్ష్యలోకి చేర్చేందుకు వీలుగా విక్రమ్-1 రాకెట్‌ను రూపొందించారు. ఈ కార్యక్రమంలో స్కైరూట్ ఏరోస్పేస్ కో-ఫౌండర్, సీఈవో పవన్ కుమార్ చందన, ఇస్రో చైర్మన్ కె.నారాయణ పాల్గొన్నారు.

## ఒక నూతన యుగానికి నాంది: సీఎం చంద్రబాబు

'విక్రమ్-1' రాకెట్ తొలి ప్రయోగం విజయవంతంపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. స్కైరూట్ ఏరోస్పేస్, ఇస్రో, ఇన్-స్పేస్, ఎన్ఎస్ఐఎల్‌లకు ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపా రు. విక్రమ్-1 తొలి ప్రయోగంలోనే విజయవంతంగా కక్ష్య లోకి చేరడంతో భారత్ మరో చారిత్రక మైలురాయిని అధిగమించిందన్నారు. ప్రపంచంలోని అత్యుత్తమ దేశాలతో పోటీపడే స్థాయికి భారత ప్రైవేటు అంతరిక్ష రంగం ఎదిగిందని ఈ విజయం నిరూపించిందని వెల్లడించారు. ఇది భారత అంతరిక్ష రంగంలో ఒక నూతన యుగానికి నాంది అని పేర్కొన్నారు. శాస్త్రీయ సంస్థల సామర్థ్యం, భారతీయ పారిశ్రామికవేత్తల సృజనాత్మకత కలిసినప్పుడు ఆవిష్కరణలకు కొత్త హద్దులు ఏర్పడతాయని ఈ ఘన విజయం చాటిచెప్పిందని తెలిపారు. స్కైరూట్ ఏరోస్పేస్, ఇస్రో, ఇన్-స్పేస్, ఎన్ఎస్ఐఎల్ సహా ఈ విజయాన్ని సాకారం చేసిన వేలాది మంది శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు, భాగస్వామ్యులందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ విజయం ప్రతి భారతీయుడు గర్వపడే క్షణమన్నారు. భావితరాల యువ శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలకు గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. నక్షత్రాల వైపుగా భారత్ సాగిస్తున్న ప్రస్థానం మరిన్ని విజయాలతో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



## భారత అంతరిక్ష రంగంలో మైలురాయి

భారతీయ అంతరిక్ష స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన చిన్న ఉపగ్రహ ప్రయోగ వాహనం విక్రమ్-1 శనివారం మధ్యాహ్నం 12:05:30 గంటలకు ఇస్రోకు చెందిన సతీష్ ధావన్ స్పేస్ సెంటర్, శ్రీహరికోట నుంచి విజయవంతంగా ప్రయోగించ బడిం ది. ఈ ప్రయోగం భారత అంతరిక్ష కార్యక్రమంలో ఒక చారిత్రాత్మ క మైలురాయిగా నిలిచింది. భారత భూభాగం నుంచి ఒక ప్రైవేట్ భారతీయ సంస్థ తొలిసారిగా కక్ష్యలోకి రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించడం ఇదే మొదటిసారి. 2020లో కేంద్ర ప్రభుత్వం అంతరిక్ష రంగంలో సంస్కరణలను ప్రకటించి, ప్రైవేట్ సంస్థలకు అంతరిక్ష కార్యకలాపాల్లో పాల్గొనే అవకాశాన్ని కల్పించింది. అనంతరం అమలులోకి వచ్చిన భారత అంతరిక్ష విధానం వల్ల ప్రయోగ వాహనాలు, ఉపగ్రహాలు, అంతరిక్ష అను వర్తనాల అభివృద్ధిలో నిమగ్నమైన స్టార్టప్‌ల వృద్ధి వేగవంతమైంది. ఈ నేపథ్యంలో, భారత భూభాగం నుంచి తొలి ప్రయత్నంలోనే కక్ష్యలోకి విజయ వంతంగా ప్రయోగించిన తొలి ప్రైవేట్ సంస్థగా స్కైరూట్ ఏరోస్పేస్ చరిత్ర సృష్టించింది. విక్రమ్-1 రాకెట్‌లో అనేక పేలోడ్‌లు ఉన్నాయి. వాటిలో స్కోప్, గ్రహా అనే రెండు ఉపగ్రహాలను భూమికి సమీప కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపె ట్టారు. మిగిలిన పేలోడ్‌లు పై దశలో కక్ష్యలో వివిధ శాస్త్రీయ ప్రయోగాలు నిర్వహించేందుకు ఉపయోగించబడు తున్నాయి. స్కైరూట్ ఏరోస్పేస్ గతంలో 2022 నవంబర్ 18న శ్రీహరికోట నుంచి విక్రమ్-ఎస్ అనే పరీక్షా రాకెట్‌ను ఉపకక్ష్య (సబ్ ఆర్బిటా ల్) ప్రయోగంగా విజయవంతంగా ప్రయోగించింది. ఆ తర్వాత అభి వృద్ధి చేసిన విక్రమ్-1 నాలుగు దశల రాకెట్. ఇందులో మూడు ఘన ఇంధన దశలు, ఒక ద్రవ ఇంధన దశ ఉన్నాయి. ఈ రాకెట్ చిన్న ఉపగ్రహాలను భూమికి సమీప కక్ష్యలో ప్రవే శపెట్టగలదు. ఈ ప్రయోగం కోసం ఇస్రో, ఇన్-స్పేస్ సంస్థలు పూర్తి సహకారం అందించాయి.















# తప్పు చేస్తే ఎవరైనా ఒకటే..

- తనకు పార్టీ అతిపెద్ద కుటుంబం
- కార్యకర్తల సంక్షేమానికి చర్యలు
- నెక్స్ట్ లెవల్‌కు సంక్షేమ కార్యక్రమాలు
- 'మై హెల్త్' యాప్‌ను ప్రారంభించనున్నాం
- పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం
- గుడివాడలో 48వ కార్యకర్తల సమావేశం

గుడివాడ(చైతన్యరథం): తప్పు చేస్తే ఎవరైనా ఒకటే..చర్యలు తప్పవని టీడీపీ శ్రేణులకు పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబా బు స్పష్టం చేశారు. ఒక వ్యక్తి చేసిన తప్పు మొత్తం పార్టీకి చుట్టు కుంటుందని వ్యాఖ్యానించారు. అలా తప్పు చేసే వైసీపీ 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయిందన్నారు. గుడివాడ నియోజకవర్గ పార్టీ శ్రేణులతో శనివారం 48వ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. 'జై తెలుగుదేశం' నినాదంతో ప్రసంగాన్ని మొదలు పెట్టారు. గుడివాడలో ఒకప్పటికీ, ఇప్పటికీ చాలా మార్పు వచ్చిం ది..ఇకపై గుడివాడలో శాశ్వతంగా టీడీపీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. పరిధులు లేని పిచ్చితో గొడ్డలి పార్టీ ఉందం టూ మండిపడ్డారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేస్తే విజయం శాశ్వతంగా ఉంటుందని, 360 డిగ్రీల్లో ఆలోచించి పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. 2004లో పార్టీ శ్రేణులు సమన్వ యంతో పనిచేసి ఉంటే రాష్ట్ర పరిస్థితులు మరోలా ఉండేవని వ్యాఖ్యానించారు. కార్యకర్తలు అలిగినప్పుడే పార్టీ ఓడిపోయింద న్నారు. తనకు అతి పెద్ద కుటుంబం టీడీపీ కుటుంబమేనని పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం ప్రజలు, మధ్యాహ్నం కార్య కర్తలతో మాట్లాడుతున్నానని తెలిపారు. 2024 ఎన్నికల కంటే మెరుగైన మెజారిటీ రానున్నరోజుల్లో వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వారానికి మూడుగంటలు నియోజకవర్గాల వారీగా డేటా, ప్రభుత్వ నివేదికలను పరిశీలిస్తున్నానని చెప్పారు. రానున్న రోజుల్లో సంక్షేమ కార్యక్రమాలను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళతామని తెలిపారు. మరో రెండు, మూడురోజుల్లో 'మై హెల్త్' యాప్‌ను ప్రారంభించనున్నట్లు చెప్పారు. విద్య, ఉపాధి, స్కిల్ డెవలప్ మెంట్‌కు సంబంధించి మరిన్ని కార్యక్రమాలు రాబోతున్నాయని వెల్లడించారు. కార్యకర్తల అభివృద్ధికి ఈక్విటీ, రుణాల ఏర్పాటు వంటి చర్యలు చేపడతామని తెలిపారు. పార్టీ కార్యకర్తల సంక్షే మం, అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చివరగా 'జై కార్యకర్త' నినాదంతో ప్రసంగాన్ని ముగించారు.







## శ్రీసిటీలో లోకేష్‌కు ఘనస్వాగతం

*శ్రీహరికోట షార్ నుంచి 'మిషన్ ఆగమన్' భారతదేశపు తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ క్లాస్ రాకెట్ 'విక్రమ్-1' ప్రయోగాన్ని వీక్షించేం దుకు వచ్చిన మంత్రి లోకేష్‌కు శ్రీసిటీలో టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గం శ్రీహరికోటకు లోకేష్ వెళ్లారు.*











చైతన్యరథం

# గుంటూరు ఘటనపై సీఎం సీరియస్

## బాధ్యులపై కఠిన చర్యలకు ఆదేశం

- చట్టం ముందు అందరూ సమానమే
- మహిళల భద్రతకు అండగా ఉంటాం
- తప్పు చేస్తే ఎవరైనా వదిలేది లేదని హెచ్చరిక



అమరావతి (చైతన్యరథం): గుంటూరు కృష్ణబాబు కాలనీలో మహిళపై దాడి ఘటనను ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొం టూ మహిళలను అవమానించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ఘటనపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఎక్స్ వేదికగా అధికారులను ఆదేశించారు. నింది తుడిపై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేశారని, ఘటనకు సంబంధం ఉన్న వ్యక్తిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు వెల్లడిం చారు. చట్టం ముందు అందరూ సమానమేనని, రాజకీయ పార్టీల పేరు చెప్పుకుని తప్పులు చేయాలనుకునే వారికి ఎలాంటి రక్షణ ఉండదని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి మహిళకు గౌర వం, భద్రత కల్పించే విషయంలో ప్రభుత్వం అండగా నిలు స్తుందని స్పష్టం చేశారు.

**మహిళలను అవమానిస్తే సహించేది లేదు: నారా లోకేష్**

గుంటూరు ఘటనపై మంత్రి నారా లోకేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. రాజకీయ పలుకుబడి ఎవరినీ కాపాడదని చెప్పుకొచ్చారు. వెంటనే కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిందితుడిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మంత్రి స్పందించారు. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. ఈ ఘటనలో ప్రమేయం ఉన్న నాయకుడిపై సస్పెన్ష న్ వేటు వేసినట్లు తెలిపారు. పార్టీ పదవులన్నింటి నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని ఆదేశించారు. మహిళలను అవమానిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలకు తమ ప్రభుత్వం జీరో టాలరెన్స్ విధానం అమలు చేస్తుందని స్పష్టం చేశారు. మహిళలను అవమానించిన వారికి చట్టప్రకారం కఠిన శిక్ష తప్పదని హెచ్చరించారు. చట్టం ముందు ఎవరైనా సమాన మేనని పేర్కొన్నారు.

# పార్లమెంట్ చర్చల్లో 'నేషన్ ఫస్ట్' భావన

- రాష్ట్ర ప్రయోజనాల సాధనకు ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలి
- వర్షాకాల పార్లమెంట్ అనుసరణపై జనసేన ఎంపీలకు పవన్ దిశానిర్దేశం



హైదరాబాద్ (చైతన్య రథం): పార్లమెంట్ చర్చల్లో జాతీయ దృక్పథంతో రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా, నేషన్ ఫస్ట్ అనే భావన స్పష్టంగా ప్రతిఫలించాలని జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అవసరమైన అంశాలను బలంగా వినిపించాలని స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం హైదరాబాద్‌లో జనసేన పార్టీ ఎంపీలతో నిర్వహించిన సమావేశంలో పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో చర్చకు రానున్న బిల్లులు, వాటిపై పార్టీ వైఖరి, అనుసరించాల్సిన వ్యూహాలపై పవన్ కళ్యాణ్ సమగ్రంగా చర్చించారు. సమావేశాల్లో ప్రస్తావించాల్సిన అంశాలపై మార్గనిర్దేశం చేశారు. పార్లమెంటు వేదికగా రాష్ట్రానికి ప్రయోజనం కలిగించే ప్రతి అంశంపై జనసేన పార్టీ తరపున గళం వినిపించాలని సూచించారు. ముఖ్యంగా కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న ప్రాజెక్టులకు మరిన్ని నిధులు కేటాయించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించే ప్రయత్నాలు చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నిర్మాణ దశలో ఉన్న రైల్వే ప్రాజెక్టుల పురోగతి, పెండింగ్ ప్రాజెక్టులకు ఆమోదం, నిధుల కేటాయింపు, కొత్త రైల్వే లైన్ల నిర్మాణం, రైల్వే ఓవర్ బ్రిడ్జిల ఏర్పాటు, దక్షిణ కోస్తా రైల్వే జోన్ అభివృద్ధి వంటి అంశాలపై ఎంపీలతో చర్చించారు. రాష్ట్రానికి గరిష్ట ప్రయోజనాలు చేకూరేలా ప్రతి అంశంపై సమగ్ర అవగాహనతో మాట్లాడాలని ఎంపీలకు పవన్ సూచించారు. వర్షాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్న నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలువంటి కీలక బిల్లులపై పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలను వివరించారు. ప్రతి అంశంలోనూ ప్రజల ఆకాంక్షలు, జాతీయ ప్రయోజనాలు, రాష్ట్ర అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణాత్మక చర్చలు జరపాలని సూచించారు. దేశ ప్రయోజనాలు, రాష్ట్ర అభివృద్ధి, ప్రజల ఆకాంక్షల సాధనే జనసేన పార్టీ లక్ష్యమని, అదే దిశగా పార్లమెంటు సమావేశాల్లో పార్టీ ఎంపీలు చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. సమావేశంలో పార్టీ లోక్‌సభ సభ్యులు వల్లభనేని బాలశౌరి, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేష్ పాల్గొన్నారు.

## గోదావరిలో వేటకెళ్లి ఐదుగురు మృతి కుటుంబాలకు సహాయం అందించాలి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం

*అమరావతి (చైతన్యరథం): పోలవరం జిల్లా ఎటపాక మండలం గొల్లగూడెం వద్ద గోదావరి నదిలో ఐదుగురు మృతిచెందిన ఘట నపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు గల్లంతయ్యారన్న విషయాన్ని అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గొమ్ముకొత్తగూడెంనకు చెందిన తుర్రం భారతి, ఊకే సుశీల, ఊకే లక్ష్మి, బాసిబోయిన బాలరాజు, ఊకే రమేష్ వేటకు వెళ్లి మృత్యు వాత పడినట్లు అధికారులు వివరించారు. సంఘటనపై విచారం వ్యక్తం చేసిన సీఎం మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారు.*

## ఐదుగురు మృతి ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ విచారం

*పోలవరం (చైతన్య రథం): పోలవరం జిల్లా ఏటపాక మండల పరిధిలోని గొల్లగూడెం వద్ద గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లిన ఐదుగురు మృతిచెందిన ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు. దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పోలవరం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులకి దిశానిర్దేశం చేశారు.*

## ఏపీలో గోల్ఫ్ టూరిజం అభివృద్ధిపై కపిల్ దేవ్‌తో మంత్రి దుర్గేష్ చర్చలు



*న్యూఢిల్లీ: (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గోల్ఫ్ టూరిజం అభివృద్ధి, పర్యాటక రంగాన్ని బలోపేతం చేసే అంశాలపై రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ నోయిడా (ఢిల్లీ)లో క్రికెట్, గోల్ఫ్ క్రీడాకారుడు, పీజీటీఐ అధ్యక్షుడు కపిల్ దేవ్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలో గోల్ఫ్ టూరిజం విస్తరణకు ఉన్న అవకాశాలపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా విశాఖపట్నం, అమరావతి ప్రాంతాలలో గోల్ఫ్ పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు గల సాధ్యాసాధ్యాలను మంత్రి దుర్గేష్ .. కపిల్‌దేవ్‌కు వివరించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన క్షేత్రస్థాయి పరిశీలన కోసం ఏపీలో పర్యటించాల్సిందిగా కపిల్‌దేవ్‌ను మంత్రి దుర్గేష్ అధికారికంగా ఆహ్వానించారు.*

# పవన్‌కళ్యాణ్‌కు లోకేష్ పరామర్శ





హైదరాబాద్(చైతన్యరథం): ఇటీవల ముంబయిలో కుడి భుజా నికి శస్త్రచికిత్స చేయించుకుని డిశ్చార్జి అయి హైదరాబాద్ నివా సంలో విశ్రాంతి తీసుకుంటున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. శనివారం పవన్‌కళ్యాణ్ నివాసానికి వచ్చిన లోకేష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసు కోవా లని సూచించారు. భుజానికి అయిన గాయం, తలెత్తిన సమస్య లు, శస్త్రచికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు.




కృష్ణాజిల్లా గుడివాడలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం కేకేఆర్ గౌతమ్ స్కూల్‌ను సీఎం సందర్శించారు. తమ పాఠశాలకు వచ్చిన ముఖ్యమంత్రికి విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రాంగణంలో బల్క్ వేస్ట్ జనరేటర్లను పరిశీలించారు. డైనింగ్ హాల్, వంటశాల, ఆహార తయారీ విభాగం, డంపింగ్ ప్రాంతాలను పరిశీలించారు. పాఠశాల సిబ్బంది తమ సంస్థలో అమలు చేస్తోన్న వ్యర్థాల నిర్వహణ విధానాన్ని ముఖ్యమంత్రికి వివరించారు. బల్క్ వేస్ట్ జనరేటర్ మార్గదర్శకాలను పూర్తిగా అమలు చేయాలని, పర్యావరణహిత వ్యర్థాల నిర్వహణను ఆదర్శంగా తీసుకోవాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. అనంతరం స్కూల్ యాజమాన్యానికి బల్క్ వేస్ట్ జనరేటర్ ధృవపత్రాన్ని సీఎం అందజేశారు.











రాష్ట్ర విభజన గాయాలు, రాజధాని లేమి, అప్పులభారం వంటి సవాళ్ల నడుమ నుంచి ఏపీ పెట్టుబడుల గమ్యస్థానంగా దూసుకెళ్తోంది. నీతి ఆయోగ్ తొలిసారి విడుదల చేసిన 'ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీనెస్ ఇండెక్స్-2026'లో ఏపీకి 'ఫ్రంట్‌రన్నర్' హోదా దక్కింది. 17 పెద్ద రాష్ట్రాల్లో ఏపీ ఆరో స్థానంలో నిలిచి 48.7 స్కోరు సాధించింది. గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడువంటి పారిశ్రామిక దిగ్గజాల సరసన.. పురుటి నొప్పులనుంచి పునర్నిర్మాణ దశకు పయనిస్తున్న నవ్యాంధ్ర నిలబడటం మామూలు విషయమేమీ కాదు. కూటమి ప్రభుత్వం 17 నెలల్లోనే 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు, 20 లక్షల ఉద్యోగాలు సాధించింది. అయితే ఈ ఘనతను జీర్ణించుకోలేని ప్రతిపక్ష శిబిరం 'ర్యాంకు పడిపోయింద'ంటూ తప్పుడు పోలికలతో వక్రీకరణలకు దిగడం.. రాష్ట్రాభివృద్ధిపై ఆ పార్టీకున్న కపట ప్రేమకు నిదర్శనం కాకపోదు. నిజానికి.. ఇది కొత్త సూచీ కావడంతో పోల్చడానికి పాత ర్యాంకులే లేవు. మరో విషయం.. ఈ నివేదికలో వైఫల్య డేటా మొత్తం 2019-24 వైసీపీ పాలనకు సంబంధించినదే. ఆర్థిక క్రమశిక్షణలో 9.9, అప్పుల స్థిరత్వంలో 4.2 మార్కులు మాత్రమే వచ్చాయని నివేదిక వెల్లడించడానికి.. వైసీపీ పాలనలోని వైఫల్యాలే కారణం. డిజిటల్ లావాదేవీలు, విద్యుత్ సరఫరా, స్టెమ్ నమోదుల్లో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని గణాంకాలు చూపిస్తోన్న దృశ్యం.. ఎవరి పాలనా ఘనతో రాష్ట్ర ప్రజలకు ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.



# నిందల మాటున.. దాచిన నిజాలు!



## నిపుణుల నిర్మాణం నుంచి నిరంతర విద్యుత్ వరకూ..

**స్టెమ్ విద్యలో దేశంలోనే నంబర్ వన్.. ఏపీ యువశక్తికి నిదర్శనం:** నీతి ఆయోగ్ 'ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీనెస్ ఇండెక్స్-2026'లో వెలుగుచూసిన అత్యంత ఆసక్తికరమైన అంశం- ఉన్నత విద్యలో స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్) కోర్సుల నమోదులో 48 శాతంతో ఆంధ్రప్రదేశ్.. దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవడం. గుజరాత్, తమిళనాడు, కర్ణాటకవంటి పారిశ్రామిక దిగ్గజ రాష్ట్రాలను వెనక్కి నెట్టి ఏపీ ఈ విభాగంలో అగ్రస్థానంలో నిలవడం- సెమీకండక్టర్లు, డ్రోన్లు, ఏరోస్పేస్‌వంటి భవిష్యత్ పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్య శక్తి ఇక్కడ పుష్కలంగా ఉందన్న భరోసా ఇచ్చేదే.

**డిజిటల్ లావాదేవీల్లో దేశానికే మార్గదర్శి:** తలసరి డిజిటల్ లావాదేవీల్లో దాదాపు 18 లావాదేవీలతో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో నిలవగా, పెద్ద రాష్ట్రాల సగటు కేవలం 4.8 మాత్రమే. అంటే జాతీయ సగటుకంటే దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ. గ్రామీణ ప్రాంతాల్లోనూ యూపీఐ, డిజిటల్ చెల్లింపులు వేగంగా విస్తరించడం వ్యాపార లావాదేవీలు పారదర్శకంగా సాగే వాతావరణాన్ని సూచిస్తోంది.

**నిరంతర విద్యుత్తుతో పారిశ్రామిక భరోసా:** రోజుకు సగటున 23.71 గంటల నిరంతర విద్యుత్ సరఫరాను ఏపీ అందిస్తోంది. విద్యుత్ పంపిణీ నష్టాలు కూడా పెద్ద రాష్ట్రాల సగటు 18 శాతంతో పోలిస్తే ఏపీలో కేవలం 14 శాతానికే పరిమితమయ్యాయి. నిరంతర, సమర్థమైన విద్యుత్ వ్యవస్థ- పరిశ్రమల నిర్ణయాల్లో అత్యంత కీలకమైన అంశం.

**ఖనిజ సంపద, పునరుత్పాదక ఇంధనంలోనూ ముందంజ:** దేశ నాన్-మెటాలిక్ ఖనిజ ఉత్పత్తి విలువలో ఏపీ వాటా పది శాతంగా నమోదైంది. పునరుత్పాదక ఇంధన సామర్థ్యంలో ఏపీ దేశంలో ఐదోస్థానంలో నిలవడం గమనార్హం. ఇప్పటికే ప్రకటించిన రూ.7.5 లక్షల కోట్ల ఇంధన పెట్టుబడుల ప్రణాళికతో, ఈ స్థానాన్ని మరింత మెరుగుపరచుకునే అవకాశం రాష్ట్రానికి ఉంది.

**సమగ్ర పురోగతికి నిదర్శనం:** నైపుణ్యం కలిగిన మానవ వనరులు, డిజిటల్ మౌలిక వసతులు, నమ్మకమైన విద్యుత్ సరఫరా, ఖనిజ సంపద, పునరుత్పాదక ఇంధన సామర్థ్యం- ఈ ఐదు రంగాల్లో ఏపీ చూపిన పనితీరు యాదృచ్ఛికం కాదు, నిరంతర విధాన అమలు ఫలితమే. రాజకీయ కుట్రదారులు కేవలం మొత్తం ర్యాంకును మాత్రమే ఎత్తిచూపుతూ, ఇలాంటి లోతైన సానుకూల గణాంకాలను విస్మరించడం.. నివేదికను వక్రబుద్ధితో అధ్యయనం చేశారనడానికి తార్కాణం.

రాష్ట్ర విభజన గాయాలు, రాజధాని లేమి, గత పాలన మిగిల్చిన అప్పుల భారం వంటి ప్రతికూలతల నడుమ నుంచి ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల గమ్యస్థానంగా పరుగులు తీస్తోందనడానికి తాజా తార్కాణం -నీతి ఆయోగ్ తొలిసారిగా విడుదల చేసిన 'ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీనెస్ ఇండెక్స్ 2026'. క్రిసిల్ నాలెడ్జ్ పార్టనర్‌గా రూపొందిన ప్రతిష్ఠాత్మక సూచీలో దేశంలోని 28 రాష్ట్రాలు, ఎనిమిది కేంద్రపాలిత ప్రాంతాలను మౌలిక వసతులు, వ్యాపార వాతావరణం, వనరులు, ప్రభుత్వ విధానాలు, నియంత్రణ సౌలభ్యం, ఆర్థిక ఆరోగ్యం, సంస్థాగత వాతావరణం, పర్యావరణ స్థిరత్వం అనే ఎనిమిది పిల్లర్ల ప్రాతిపదికన, 84 సూచికలతో సమగ్రంగా మదింపు చేశారు. దేశవ్యాప్తంగా 1,850కి పైగా వ్యాపార సంస్థల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం -నివేదిక విశ్వసనీయతకు నిలువుటద్దం. ఇందులో ఆంధ్రప్రదేశ్ 48.7 స్కోరుతో.. 17 పెద్ద రాష్ట్రాల విభాగంలో ఆరోస్థానం కైవసం చేసుకుని 'ఫ్రంట్‌రన్నర్' హోదాను సగర్వంగా సాధించింది. గుజరాత్ (56.6), మహారాష్ట్ర (53.7), తమిళనాడు (53.3), ఒడిశా (52.4), మధ్యప్రదేశ్ (48.9) వంటి దశాబ్దాల పారిశ్రామిక చరిత్రగల దిగ్గజాల సరసన -పదేళ్లుగా పునర్నిర్మాణ ప్రసవవేదన అనుభవిస్తున్న నవ్యాంధ్ర సగర్వంగా నిలబడటం మామూలు విషయం కాదు.

కర్ణాటక వంటి ఐటీ అగ్రగామి రాష్ట్రంతో సమానంగా స్కోరు సాధించడం మరో విశేషం. కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టాక 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నినాదంతో ముఖ్యమంత్రి చంద్రబాబు సాగిస్తున్న పెట్టుబడుల యజ్ఞం -17 నెలల్లోనే 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు, 20 లక్షల ఉద్యోగాల కల్పన రూపంలో ఫలించడం మొదలైంది. దావోస్ వేదికగా ప్రపంచ ఆర్థిక సదస్సులో, విశాఖ వేదికగా సీఐఐ భాగస్వామ్య సదస్సులో రాష్ట్రం ఆకర్షించిన అంతర్జాతీయ దృష్టి ఇప్పుడు నీతి ఆయోగ్ గణాంకాల్లో ప్రతిఫలించిందనడంలో అతిశయోక్తి లేదు. అయితే -ఈ ఘనతను జీర్ణించుకోలేని ప్రతిపక్ష శిబిరంనుంచి వెలువడే పత్రికలు, నివేదికలోని పాజిటివ్ అంశాలన్నింటినీ ఏరిపారేసి, అంకెలను తలకిందులుగా చూపిస్తూ 'ర్యాంకు పడిపోయింద'ంటూ సాగిస్తున్న వక్రీకరణల రచ్చ విస్మయం కలిగిస్తోంది. వాస్తవాల వెలుగులో ఆ మాయాజాలాన్ని పరిశీలిస్తే -అసలు రంగు బట్టబయలవుతుంది!

మొట్టమొదటి వక్రీకరణ -'నంబర్ వన్ నుంచి ఎనిమిదో స్థానానికి పడిపోయింది' అనే దుర్మార్గ ప్రచారం. ఇది అంకెల గారడీతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమే తప్ప మరొకటి కాదు. 'ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీనెస్ ఇండెక్స్' అనేది నీతి ఆయోగ్ ఈ ఏడాదే తొలిసారిగా ప్రవేశపెట్టిన సరికొత్త సూచీ. దీనికి గత ఏడాది ర్యాంకులే లేనప్పుడు -'పడిపోవడం' ఎక్కడినుంచి వచ్చిందో సూడో మేధావులే చెప్పాలి? గత ప్రభుత్వ హయాంలో వచ్చిన 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని వాస్తవానికి కేంద్రం 2021లోనే రద్దు చేసింది. అయినా.. నారింజలను ఆపిల్ పండ్లతో పోల్చి 'దిగుబడి తగ్గింది' అనడం ఎంత హాస్యాస్పదమో -'అచ్చేసిన' పత్రికలో వచ్చిన అభూత పోలికా అంతే!

అంతేకాదు, ఈ నివేదిక వెనుక దాగిన కాలరేఖను గమనిస్తే అసలు నిజం మరింత స్పష్టమవుతుంది. దీనికి సంబంధించిన డేటాను నీతి ఆయోగ్ 2024 నవంబర్ నుంచి నీల్సన్ సర్వే ఏజెన్సీ ద్వారా సేకరించింది -అంటే ఇది పూర్తిగా 2019-24 మధ్య సాగిన వైసీపీ పాలనా కాలానికి సంబంధించిన మదింపు. ఆ కాలంలో రాష్ట్రానికి పట్టిన గతి ఏంటో ఈ సూచీలోని ఉప-సూచికలే చెబుతున్నాయి: ఆర్థిక క్రమశిక్షణలో కేవలం 9.9/100, అప్పుల స్థిరత్వంలో కేవలం 4.2/100, ప్రభుత్వ విధానంలో కేవలం 41/100 మార్కులు దక్కాయి. కాగ్, ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం- 2014-19లో టీడీపీ ఆర్‌బీఐ ద్వారా తెచ్చిన అప్పు రూ.1,83,000 కోట్లు కాగా, 2019-24లో వైసీపీ అప్పు ఏకంగా రూ.4,38,000 కోట్లకు చేరింది; కార్పొరేషన్ల ద్వారా టీడీపీ తెచ్చిన అప్పు రూ.47 కోట్లు మాత్రమే అయితే, వైసీపీ హయాంలో ఇది రూ.2,48,000 కోట్లకు ఎగబాకింది. మొత్తం రుణభారం జీఎస్‌డీపీలో 35 శాతానికి చేరిందని 15వ ఆర్థిక సంఘమే హెచ్చరించింది.

ఆ ఐదేళ్ల పాలనా కాలంలో పెట్టుబడుల విశ్వాసం ఏ స్థాయిలో దెబ్బతిన్నదో గుర్తుచేసుకుంటే వర్తమాన విజయం మరింత విలువైనదిగా కనిపించక పోదు. మూడు రాజధానుల ప్రకటనతో అమరావతి నిర్మాణం స్తంభించిపోగా, రివర్స్ టెండరింగ్ పేరిట సాగిన సమీక్షలు ఒప్పందాలపై అనిశ్చితిని పెంచాయి. రాయలసీమకు చెందిన అమరరాజా సంస్థ అధినేత జయదేవ్ గల్ల వంటి పారిశ్రామికవేత్తలు సైతం రాష్ట్రం విడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడటం, సోలార్ రంగంలో అంతర్జాతీయ సంస్థ ఒప్పందాల రద్దు ప్రతిపాదన విదేశీ ప్రభుత్వాల స్థాయిలో ఫిర్యాదులకు దారితీయడం- ఇవన్నీ ఆనాటి విధాన అస్థిరతకు నిదర్శనాలు. ఆ వారసత్వ భారాన్ని నెత్తినెత్తుకునే -కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాల సమతూకం సాధిస్తూ ముందడుగు వేస్తోందన్నది ప్రపంచం మొత్తం కళ్లప్పగించి చూస్తోన్న కఠిన సత్యం.

వక్రీకరణల మాటున దాచేసిన నివేదికలోని అసలు వాస్తవాలేమిటో చూస్తే.. -తలసరి డిజిటల్ లావాదేవీల్లో దాదాపు 18 లావాదేవీలతో ఏపీ దేశంలోనే అగ్రస్థానం (పెద్ద రాష్ట్రాల సగటు 4.8 మాత్రమే); రోజుకు సగటున 23.71 గంటల నిరంతర విద్యుత్ సరఫరా; పెద్ద రాష్ట్రాల సగటు (18 శాతం) కన్నా తక్కువగా 14 శాతానికే పరిమితమైన విద్యుత్ పంపిణీ నష్టాలు; దేశ నాన్-మెటాలిక్ ఖనిజ ఉత్పత్తి విలువలో పది శాతం వాటా; పునరుత్పాదక ఇంధన సామర్థ్యంలో దేశంలో ఐదో స్థానం; ఉన్నత విద్యలో స్టెమ్ నమోదుల్లో 48 శాతంతో దేశంలోనే ప్రథమ స్థానం! వీటన్నింటినీ దాచిపెట్టి -ఎనిమిది పిల్లర్లలో ఇంకా మెరుగుపడాల్సిన అంశాలను మాత్రమే భూతద్దంలో చూపడం.. కుటిల రాజకీయ వైఖరికి సాక్షి కాకపోదు!

నిజమే -గుజరాత్ (56.6) స్థాయికి చేరాలంటే ఏపీ ఇంకా ఎనిమిది పాయింట్ల దూరం ప్రయాణించాలి. ప్రోత్సాహకాల పంపిణీని వేగవంతం చేయడం, ఆర్థిక క్రమశిక్షణను పరిపుష్టం చేయడం, వ్యాపార వాతావరణ పిల్లర్‌లో స్కోరు పెంచుకోవడం వంటి సవాళ్లు ముందున్న మాటా వాస్తవమే. కానీ వాటిని గుర్తించి దిద్దుబాటు చర్యలు చేపట్టడానికే ఈ సూచీని 'రిఫార్మ్ టూల్'గా నీతి ఆయోగ్ రూపొందించిందన్న గ్రహింపు కుట్ర రాజకీయాలకు పాల్పడే రాక్షస మస్తిష్కాలకు తట్టకపోవడం.. రాష్ట్ర రాజకీయం చేసుకున్న దౌర్భాగ్యం! రియల్ టైమ్ అనుమతులతో 'ఈజ్'నుంచి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' దశకు పాలనను తీసుకెళ్లింది కూటమి ప్రభుత్వమే. డ్రోన్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, స్పేస్, సెమీకండక్టర్, రక్షణ కారిడార్ల నిర్మాణంతో భవిష్యత్ పరిశ్రమలకు పునాదులు పరుస్తోందీ కూటమి సర్కారే. నీతి ఆయోగ్ ప్రత్యేకంగా రూపొందించిన 'ఎనర్జీ ట్రాన్సిషన్ బ్లూప్రింట్' ద్వారా రూ.7.5 లక్షల కోట్ల ఇంధన పెట్టుబడులతో ఏపీని దేశ టాప్-3 పునరుత్పాదక ఇంధన హబ్‌గా తీర్చిదిద్దే బృహత్ ప్రణాళిక సిద్ధమవుతోందీ 'ప్రజా ప్రభుత్వ' పాలనలోనే. అర్థ ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు, 50 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో, దశాబ్దకాలంలో ట్రిలియన్ డాలర్ల స్వప్నంతో రాష్ట్రం సాగిస్తున్న ప్రస్థానంలో ఈ 'ఫ్రంట్‌రన్నర్' హోదా తొలి మజిలీ మాత్రమే. -ఐదేళ్ల వైసీపీ పాలనలో తీవ్ర విధ్వంసానికి గురై, పెట్టుబడిదారులు ముఖం చాటేసిన రాష్ట్రం.. కేవలం రెండేళ్లలో తిరిగి లేచి నిలబడి, పారిశ్రామిక దిగ్గజ రాష్ట్రాల సరసన 'ఫ్రంట్‌రన్నర్'గా నిలవడం సాధారణ విషయమేమీ కాదు. అయినా.. పచ్చ కామెర్ల కళ్లకు 'ప్రగతి వెలుగు' కనిపించకపోవడం ఆశ్చర్యకరమైన విషయమేమీ కాదు. ప్రగతి ప్రస్థానంపై బురద జల్లడమే ప్రవృత్తిగా పెట్టుకున్న రాజకీయ నిరాశావాదులకు.. వాస్తవాలను గ్రహించే శక్తి ఉంటుందనుకోవడం మన భ్రమ!

**తొలి సూచీలోనే ఏపీకి 'ఫ్రంట్‌రన్నర్' ఘనత..**

**వక్రీకరణలతో ప్రతిపక్షం మాయా రాజకీయం**

**ఐదేళ్ల విధ్వంసాన్ని దాటి.. రెండేళ్లలో పెట్టుబడుల పరుగు**

**అంకెలు చెబుతున్న సత్యం.. అపోహలు సృష్టిస్తున్న అసత్యం**

**ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీనెస్ ఇండెక్స్-2026 వాస్తవ విశ్లేషణ**

**పచ్చకామెర్ల కళ్లకు కానరాని కఠోర సత్యాలు..**

-మహాదేవ

చైతన్యరథం

# ఆర్థిక శక్తిగా.. పర్యాటకం!

- ఏడీటీవోఐ చాప్టర్ ఛైర్మన్ల సదస్సులో మంత్రి కందుల దుర్గేష్
- ఏడు ప్రధాన పర్యాటక హబ్‌ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- టూర్ ఆపరేటర్ల కోసం 7 అంశాల కార్యాచరణ ప్రణాళిక ప్రతిపాదన
- హోమ్‌స్టేలు, ఎకో-లాడ్జ్‌లు, కారవాన్ టూరిజంపై ప్రభుత్వం ఫోకస్




న్యూఢిల్లీ (చైతన్య రథం): భారతదేశ దేశీయ పర్యాటక రంగ అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అత్యంత కీలకమైన భూమిక పోషిస్తోందని, పర్యాటక రంగాన్ని ఒక వ్యూహాత్మక ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. శనివారం న్యూఢిల్లీలోని చాణక్యపురి 'హోటల్ జింజర్' వేదికగా అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన "ఆల్ ఇండియా చాప్టర్ ఛైర్మన్ల సమావేశం-2026"కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. "స్వదేశీ పర్యటన్ -సశక్త్ భారత్" అనే ప్రధాన ఇతివృత్తంతో.. ఆంధ్రప్రదేశ్ మరియు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలపై ప్రత్యేక ఫోకస్‌తో జరిగిన సదస్సులో మంత్రి దుర్గేష్ కీలక ప్రసంగం చేశారు. "పర్యాటకరంగ సేవల్లో 30 ఏళ్లు పూర్తి చేసుకున్న ఏడీటీవోఐ సంస్థకు అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా 2,400 మందికి పైగా సభ్యులతో విస్తరించిన ఈ జాతీయ నెట్‌వర్క్, భారతీయ పర్యాటక రంగాన్ని ముందుకు నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల దూరదృష్టితో కూడిన నాయకత్వంలో, రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పర్యాటకరంగానికి పారిశ్రామిక హోదా కల్పించామని, పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. విశాఖపట్నం, అరకు లోయ, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోట, తిరుపతిలను ఏడు ప్రధాన పర్యాటక హబ్‌లుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆధ్యాత్మికం, తీరప్రాంతం (కోస్టల్), పర్యావరణం (ఎకో), బౌద్ధ వారసత్వం, గ్రామీణ సంస్కృతి కలగలిసిన అరుదైన పర్యాటక అనుభూతి ఆంధ్రప్రదేశ్ సొంతమని పేర్కొన్నారు. తిరుపతి, శ్రీశైలంవంటి దివ్యక్షేత్రాల నుండి అరకు లోయ అందాలు, గండికోట గ్రాండ్ కాన్యన్, బెలుం గుహల వరకు ఎన్నో అద్భుతాలు రాష్ట్రంలో ఉన్నాయన్నారు.

### టూర్ ఆపరేటర్లే అసలైన సారథులు: మంత్రి దుర్గేష్

"ప్రభుత్వాలు మౌలిక వసతులను కల్పిస్తాయి. కానీ టూర్ ఆపరేటర్లు మాత్రమే పర్యాటక ప్రదేశాలను సందర్శకులకు చేరువ చేసి అద్భుతమైన ప్రయాణ అనుభూతులుగా మారుస్తారు" అని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13, 14 తేదీల్లో జరిగిన 'ఆంధ్రప్రదేశ్ ఏడీటీవోఐ నేషనల్ ట్రావెల్ మార్ట్' విజయవంతం కావడాన్ని గుర్తు చేస్తూ, ఇప్పుడు ఆ భాగస్వామ్యాన్ని వాస్తవ బుకింగ్‌లు, నూతన ప్యాకేజీలుగా మార్చాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. పర్యాటక వృద్ధి కేవలం పర్యాటకుల సంఖ్య పెంచడానికే పరిమితం కాకూడదని, స్థానిక గైడ్‌లు, రవాణాదారులు, హోమ్‌స్టే నిర్వాహకులు, చేనేత కార్మికులు, మహిళా ఉపాధి గ్రూపులకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని స్పష్టం చేశారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుతూనే స్థానిక సంస్కృతిని పెంపొందించడమే తమ ప్రభుత్వ విధానమన్నారు.

ఈ సందర్భంగా ఏడీటీవోఐ సంస్థకు మంత్రి దుర్గేష్ 7 కార్యాచరణ అంశాలు ప్రతిపాదించారు. ప్రతి ప్రధాన ఏడీటీవోఐ చాప్టర్ ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి కనీసం రెండు ప్రత్యేక పర్యాటక సర్క్యూట్‌లను ప్రమోట్ చేయాలని కోరారు. విభిన్న వర్గాల పర్యాటకుల కోసం ఉమ్మడిగా 3, 5, 7 రోజుల ప్యాకేజీలను రూపొందించాలని తెలిపారు. టూర్ ఆపరేటర్ల కోసం త్వరలోనే ప్రత్యేక ఫామిలియరైజేషన్ టూర్లను ఏర్పాటు చేస్తామన్నారు. పర్యాటక సేవల మెరుగుదలకు క్రమబద్ధమైన ఫీడ్‌బ్యాక్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. టూర్ ఆపరేటర్ల డిజిటల్ నెట్‌వర్క్, క్యాటలాగ్‌లలో ఏపీ పర్యాటకానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రముఖ పండుగలు, సంస్కృతుల ఆధారంగా సంయుక్తంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. స్థానిక పర్యాటక సేవా నిర్వాహకులకు సామర్థ్యం పెంపొందించేలా అవసరమైన శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. పర్యాటక రంగం కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా గ్రామాలు, తీరప్రాంతాలు, గిరిజన ప్రాంతాల వరకు విస్తరించి మహిళలకు, యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని, స్థానిక వంటకాలు మరియు చేతివృత్తులకు ప్రాచుర్యం తెస్తుందని మంత్రి దుర్గేష్ నొక్కి చెప్పారు. అమరావతి, నాగార్జునకొండ, తొట్లకొండ, బొజ్జన్నకొండవంటి బౌద్ధ వారసత్వ ప్రదేశాలతో పాటు విజయవాడ, శ్రీకాళహస్తి క్షేత్రాలను, కోనసీమ గ్రామీణ పర్యాటకాన్ని, మారేడుమిల్లి, కోరింగవంటి పర్యావరణ పర్యాటక కేంద్రాల ప్రాధాన్యతను మంత్రి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన కలంకారీ కళలు, కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, ఉప్పాడ-ధర్మవరం చేనేత వస్త్రాలు మరియు అరకు కాఫీ వంటి విశిష్ట ఉత్పత్తులను టూరిజం ప్యాకేజీలలో భాగం చేయాలని కోరారు. పర్యాటకులు ఏపీని కేవలం చూడటమే కాదు... ఇక్కడి సంస్కృతిని అనుభూతిచెందేలా చేయాలన్నారు. పర్యాటకులు ఎక్కువ రోజులు బస చేసేలా, ఎక్కువ ఖర్చు పెట్టేలా సరికొత్త హోమ్‌స్టేలు, ఎకో-లాడ్జ్‌లు, కారవాన్ టూరిజం మరియు అడ్వెంచర్ టూరిజంవంటి మౌలిక వసతులను వేగంగా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు.

"ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం ఇప్పుడు సరికొత్త అవకాశాలతో, అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులతో పర్యాటకులను ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉంది. దేశవ్యాప్తంగా ఉన్న చాప్టర్ ఛైర్మన్లు అందరూ ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలి. రాష్ట్రాన్ని సందర్శించండి. సరికొత్త ప్యాకేజీలను రూపొందించండి, ప్రమోట్ చేయండి. మీకు ప్రభుత్వపక్షాన పూర్తి సహకారం, రాయితీలు అందిస్తాం" అని మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు. వాణిజ్యపరంగా లాభదాయకమైనవిగా, పర్యావరణ పరిరక్షణకు కట్టుబడేవిగా, సంస్కృతిని పెంపొందించేవిగా మరియు స్థానిక సమాజానికి మేలు చేసేవిగా ఉండే అద్భుతమైన ప్రయాణ అనుభూతులను మనం ఉమ్మడిగా సృష్టిద్దామన్నారు. అందరం కలిసి దేశీయ పర్యాటక రంగాన్ని బలోపేతం చేద్దాం, స్థానిక వర్గాలకు ఆర్థిక సాధికారత కల్పిద్దాం. తద్వారా జాతీయ సంకల్పమైన "స్వదేశీ పర్యటన్ -సశక్త్-భారత్" సాకారంలో మన వంతు భాగస్వామ్యం అందిద్దామని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. సమావేశంలో పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఏడీటీవోఐ జాతీయ అధ్యక్షుడు వేద్ ఖన్నా, సంస్థ ముఖ్య ప్రతినిధులు, దేశంలోని వివిధ రాష్ట్రాల చాప్టర్ల ఛైర్మన్లు, పర్యాటక, హోటల్ రంగ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పంచాయతీరాజ్, అటవీ శాఖలపై చర్చ

హైదరాబాద్ (చైతన్య రథం): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శనివారం శాఖాపరమైన చర్చలు చేపట్టారు. శస్త్ర చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు విశ్రాంతిలో ఉన్న పవన్ కళ్యాణ్ తన శాఖలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. ఇందులో భాగంగా పంచాయతీరాజ్, అటవీ శాఖల ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండేతో శనివారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. పంచాయతీరాజ్ శాఖలో నిర్దేశించిన పనుల పురోగతిపై చర్చించారు. వర్షాకాలంలో గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు పారిశుధ్య చర్యలు చేపట్టాలని, రక్షిత మంచినీరు సరఫరాపై దృష్టి సారించాలని ఆదేశించారు.

## ఐదు రోజులు వర్ష సూచన

**రేపు, ఎల్లుండి పలు జిల్లాల్లో పిడుగులతో వానలు - అప్రమత్తంగా ఉండాలని ఏపీఎస్‌డీఎంఏ సూచన**

అమరావతి (చైతన్య రథం): దక్షిణ ఒడిశా, దాని పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న ఐదు రోజులు మేఘావృతమైన వాతావరణంతో పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. కోస్తాంధ్రలో గంటకు 40-50 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రానున్న రెండు రోజుల వాతావరణ పరిస్థితిని ఏపీఎస్‌డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ ఈ విధంగా వివరించారు:

ఆదివారం శ్రీకాకుళం, విజయనగరం, పోలవరం, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, కడప జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. సోమవారం విజయనగరం, మన్యం, పోలవరం, విశాఖ, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. శనివారం సాయంత్రం 5 గంటలనాటికి రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో నమోదైన వర్షపాతం వివరాలను వెల్లడించారు. కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో అత్యధికంగా 36.2 మిమీ,



పోలవరం జిల్లా ఎర్రంపేటలో 35.7 మిమీ, కోనసీమ జిల్లా గంగవరంలో 29.7 మిమీ, పోలవరం జిల్లా బుట్టాయిగూడెంలో 27.2 మిమీ, కాకినాడ జిల్లా రాయభూపాలపట్నంలో 27.2 మిమీ చొప్పున వర్షపాతం నమోదైంది. ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల కింద, భారీ హోర్డింగ్‌ల వద్ద నిలబడొద్దని ఏపీఎస్‌డీఎంఏ సూచించింది. వర్షపు గాలులవల్ల ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటిని గమనిస్తూ వీలైనంత దూరంగా ఉండాలని పేర్కొంది. సముద్రం అలజడిగా ఉండి, అలలు ఉధృతంగా ఉన్నప్పుడు చిన్న బోట్లు ఉపయోగించే మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# 'సీఎస్‌ఆర్' ఫలాలతో అభివృద్ధి

## రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి సవిత

- సీఎం చంద్రబాబు కృషితో రాయలసీమకు పరిశ్రమల రాక
- పరిశ్రమల స్థాపనతో వెల్లువెత్తుతున్న సీఎస్ఆర్ ఫలాలు
- గ్రామాల్లో అభివృద్ధి పనులకు మార్గం సుగమం
- గత పాలకులకు సీఎస్ఆర్ అంటే తెలియదు
- కియా వెళ్లగొట్టడానికి జగన్ కుట్ర: మంత్రి సవిత
- రొద్దంలో రూ.6 కోట్లతో పీహెచ్సీ భవనానికి శంకుస్థాపన

రొద్దం/ శ్రీసత్యసాయి (చైతన్య రథం): పెద్దఎత్తున పరిశ్రమల స్థాపనతో సీఎస్ఆర్ ఫండ్స్ వెల్లువెత్తుతున్నాయని, ఆ నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన సాధ్యమవుతోందని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి మంత్రి ఎస్.సవిత తెలిపారు. పరిశ్రమలంటేనే సీబీఎన్ అని, సీబీఎన్ అంటే పరిశ్రమలన్నారు. గత పాలకులు పరిశ్రమలు వెళ్లగొట్టారని, వాళ్లకు సీఎస్ఆర్ ఫండ్స్ అంటే ఏమిటో కూడా తెలియదని ఎద్దేవా చేశారు. పెనుకొండ నియోజకవర్గంలో సీఎస్ఆర్ నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నామని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండల కేంద్రంలో రూ.6 కోట్లతో నిర్మిస్తున్న ప్రాథమిక ఆసుపత్రి భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో ఎంపీ బీకే పార్థసారథి, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి సవిత మాట్లాడుతూ.. రొద్దంలో పీహెచ్సీ నిర్మాణానికి రూ.6 కోట్ల సీఎస్ఆర్ నిధులు అందజేసిన బెల్ ఎలక్ట్రానిక్ పరిశ్రమ డెరెక్టర్ రజినీశ్ శర్మకు, సంస్థ ప్రతినిధి సంజయ్ అగర్వాల్‌కు ధన్యవాదాలు తెలిపారు. పాలసముద్రం చెరువు అభివృద్ధికి కూడా



సహకరించాలని కోరారు. పెనుకొండలో రూ.12 కోట్ల సీఎస్ఆర్ ఫండ్స్‌తో ఐటీఐ కళాశాల నిర్మిస్తున్నామన్నారు. జిల్లాలో విస్తృతంగా పరిశ్రమల స్థాపనతో సీఎస్ఆర్ ఫండ్స్ వెల్లువెత్తుతున్నాయన్నారు. దీనివల్ల గ్రామాల్లో మౌలిక సదుపాయాలను, అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు.

### వాళ్లకు సీఎస్ఆర్ అంటే తెలిసా..?

రాయలసీమను పారిశ్రామిక హబ్‌గా సీఎం చంద్రబాబు అభివృద్ధి చేస్తున్నారని మంత్రి సవిత కొనియాడారు. రాయలసీమలోని అన్ని జిల్లాల్లోనూ విస్తృతంగా పరిశ్రమలు నెలకొల్పుతున్నారన్నారు. స్టీల్ ప్లాంట్, దాల్మియా సిమెంట్ పరిశ్రమ విస్తరణ, రాయల్ ఇన్ ఫీల్డ్ ద్విచక్ర వాహనాల తయారీ పరిశ్రమ, యుద్ధవిమానాల తయారీ పరిశ్రమ, కియా కార్ల పరిశ్రమ సహా సోలార్, డ్రోన్ల తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ పరిశ్రమల స్థాపనతో ఆదాయం, ఉపాధి అవకాశాలతోపాటు సీఎస్ఆర్ ఫండ్స్ అనే ఫలాలు కూడా అందుతున్నాయన్నారు. పరిశ్రమలు అందజేసే సీఎస్ఆర్ నిధులతో ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. గత పాలకులకు సీఎస్ఆర్ ఫండ్స్ వినియోగించుకునే అవగాహన కూడా లేదన్నారు. వైసీపీ నాయకులకు సీఎస్ఆర్ ఫండ్స్ అంటే ఏమిటో తెలియదు... దోచుకోవడం దాచుకోవడం తప్ప వారికేం తెలుసు..? అంటూ మంత్రి సవిత ఎద్దేవా చేశారు.

### కియాపై జగన్ కుట్ర

పెనుకొండ సమీపంలో ఏర్పాటు చేసిన కియా కార్ల పరిశ్రమతో వేలాది మందికి ఉపాధి లభిస్తోందని మంత్రి సవిత తెలిపారు. ఎంతో శ్రమ కోర్చి కియా పరిశ్రమను సీఎం చంద్రబాబు తీసుకొచ్చారన్నారు. నూతన పరిశ్రమలు ఏర్పాటు చేయలేని అసమర్థ జగన్... కియా పరిశ్రమను వెళ్లగొడతానని కుట్ర పన్నారన్నారు. కాని, ఆయన వల్ల కాలేదన్నారు. ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా, యువతకు ఉపాధి కల్పించాలని, పారిశ్రామికంగా రాష్ట్రాన్ని నిలబెట్టాలని సీఎం చంద్రబాబునాయుడు పెద్ద ఎత్తున రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడానికి కృషి చేస్తున్నారని మంత్రి సవిత కొనియాడారు.

### 22న తల్లికి వందనం నిధుల విడుదల

సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధిని, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తోందని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగా 22న 'తల్లికి వందనం' నిధులు జమ చేయనున్నట్లు తెలిపారు. ఇంటిలో ఎందరు చదువుకున్న బిడ్డలుంటే, అందరికీ తల్లికి వందనం అమలు చేస్తున్నామన్నారు. రొద్దం పెద్ద చెరువు అభివృద్ధికి రూ.3.50 కోట్లు మంజూరయ్యాయన్నారు. పెనుకొండ నియోజక వర్గంలో అయిదు అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు మంజూరయ్యాయన్నారు. సీఎస్ఆర్ ఫండ్స్ తో ఈ భవనాలను నిర్మించనున్నామన్నారు. అంతకుముందు రొద్దం మండల కేంద్రంలో పీహెచ్సీ భవన నిర్మాణ పనుల ప్రారంభానికి విచ్చేసిన మంత్రి సవితకు, ఇతర ప్రజాప్రతినిధులకు కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు ఘన స్వాగత పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దప్పేపల్లెలో 150మంది టీడీపీ గూటికి

**పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి మండిపల్లి**



రాయచోటి (చైతన్య రథం): లక్కిరెడ్డిపల్లె మండలం దప్పేపల్లె గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, మాజీ జడ్పీటీసీ అంబా బత్తిన రెడ్డయ్య ఆధ్వర్యంలో సుమారు 150మంది నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రజాహిత పాలనకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కొత్తగా పార్టీలో చేరినవారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేస్తూ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. మంత్రి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలితంగానే అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా తెలుగుదేశం వైపు అడుగులు వేస్తున్నారని అన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు బలిశెట్టి హరిప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు మదన్ మోహన్, ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కొత్తగా పార్టీలో చేరిన వారిని అభినందించారు.

## ఆరోగ్యాంధ్ర.. కూటమి లక్ష్యం

**-పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి దినచర్యలో భాగం కావాలి: మంత్రి కొలుసు**

ఏలూరు/ ఆగిరిపల్లి (చైతన్య రథం): ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం గ్రామం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి హాజరయ్యారు. "బల్క్ వేస్ట్ జనరేటర్స్ నమోదు, ఘనవ్యర్థాలు నిర్వహణ నియమాలు, పరిశుభ్రతపట్ల అవగాహన" థీమ్‌తో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొలుసు విద్యార్థినీ విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. పరిశుభ్రతలో భాగంగా చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులతో దగ్గరుంచి ఆచరింపచేశారు. విద్యార్థులతో మంత్రి కాసేపు ముచ్చటించారు. మొక్కలునాటి, అనంతరం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర -2047 సంకల్పంలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో రాష్ట్రస్థాయి అధికారులు, జిల్లా కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎన్జీఓలు, కార్పొరేట్ సంస్థలు, విద్యార్థులు, యువత, సేవా సంస్థలు, స్వచ్ఛందంగా పాల్గొనాలని సీఎం చంద్రబాబు ఇచ్చిన పిలుపు మంచి ఫలితాలు ఇస్తోందన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఏదోక జిల్లాలో పాల్గొని, అందరికీ స్ఫూర్తిని నింపుతున్నారన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే వ్యాధులు సోకుతాయని, ప్రజలు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా ఆర్థికంగా బలహీనులవుతారని హెచ్చరించారు. వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నాయన్నారు. "స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర" కార్యక్రమం కేవలం పరిశుభ్రత కార్యక్రమమే కాదని, ఇది ప్రతి పౌరుడు బాధ్యతగా పాల్గొని రాష్ట్రాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా, అభివృద్ధి దిశగా నడిపించే ప్రజా



ఉద్యమమన్నారు. పరిశుభ్రమైన గ్రామాలు, పట్టణాలు మన ఆరోగ్యానికి, పర్యావరణానికి, భావి తరాలకు అమూల్యమైన సంపద అన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యతగా చెబుతూ.. మనఇల్లు, మనవీధి, కార్యాలయం, పాఠశాల, ఎక్కడైనా పరిశుభ్రతను పాటించడం ద్వారా ఏపీని ఆదర్శంగా తీర్చిదిద్దగలమన్నారు. ప్రజలు సహకారంతో చెత్తను తడి, పొడి వ్యర్థాలుగా వేరు చేయడం, ప్లాస్టిక్, క్యారీ బ్యాగులను వినియోగాన్ని తగ్గించడం, పచ్చదనాన్ని పెంపొందించడం, పరిశుభ్రతపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను విజయవంతంగా చేస్తే, మంచి ఫలితాలు వస్తాయన్నారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు ప్రజలు భాగస్వామ్యం తోడైతేనే ఈ లక్ష్యం సాకారం అవుతుందన్నారు. మనమంతా కలిసి పనిచేస్తేనే పరిశుభ్రమైన, సుస్థిరమైన, అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించగలమని పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడు ఉద్యమంలో భాగస్వామి కావాలని, పరిశుభ్రతను మన జీవన విధానంగా మార్చుకోవాలని మంత్రి కొలుసు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, నాన్ టీచింగు సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## బస్సు ప్రమాద క్షతగాత్రులకు మంత్రి డోలా పరామర్శ

ప్రకాశం /ఒంగోలు (చైతన్య రథం): బస్సు ప్రమాదంలో గాయపడి ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో కలిసి శనివారం పరామర్శించారు. శనివారం ఉదయం కొండపి - అనకర్లపూడి సమీపంలో ఆర్టీసీ బస్సు ప్రమాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న మంత్రి బస్సు ప్రమాదంపై కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని, ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు. అనంతరం ఒంగోలు రిమ్స్ ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి డాక్టర్లతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి డోలా మాట్లాడుతూ.... "బస్సు ప్రమాదం దురదృష్టకరం. అదృష్టవశాత్తు ప్రయాణికులు చిన్న చిన్న గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నాం. ఘటనపై సీఎం చంద్రబాబు, రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో మాట్లాడాం. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతాం. క్షతగాత్రులు పూర్తిగా కోలుకునే వరకు వైద్యం అందిస్తాం" అని వెల్లడించారు.



## గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు

# కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

- ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రజలంతా భాగస్వాములు కావాలి
- పీ-4తో పేదరికం లేని సమాజానికి ముఖ్యమంత్రి కృషి
- త్వరలోనే వెలుగొండతో ఉమ్మడి ప్రకాశం సస్యశ్యామలం
- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఉద్ఘాటన
- తూర్పు చౌటపాలెంలో స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణాంధ్రకు హాజరు

ప్రకాశం /దర్శి (చైతన్య రథం): గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. శనివారం ప్రకాశం జిల్లా దర్శి మండలం తూర్పు చౌటపాలెంలో దర్శి టీడీపీ ఇంఛార్జి గొట్టిపాటి లక్ష్మితో కలసి స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. స్వయంగా చెత్త ఊడ్చి రోడ్లు శుభ్రం చేశారు. అనంతరం స్వచ్ఛతపై ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎంపీ యూపీ పాఠశాల, అంగన్వాడీ



కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులు, చిన్నారులతో మంత్రి ముచ్చటించారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి డోలా మాట్లాడుతూ... గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. మన ఇల్లు, మన వీధి, మన గ్రామమనే నినాదంతో ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రజలంతా భాగస్వాములు కావాలని, గతంలో ఎన్నడూలేని విధంగా కూటమి పాలనలో గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నామని వివరించారు. "సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తున్నాం. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం, స్త్రీశక్తి వంటి పథకాలు అమలు చేస్తున్నాం. ఈ నెలలోనే తల్లికి వందనం నిధులు ఇవ్వబోతున్నాం. ప్రధాని మోదీ సహకారం, సీఎం చంద్రబాబు నాయుడు కృషి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తోడ్పాటుతో రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నాం. రాష్ట్రానికి పెట్టుబడుల సాధనలో మంత్రి లోకేష్ కీలకపాత్ర పోషిస్తున్నారు. వైసీపీ హయాంలో వెలిగొండ పూర్తి కాకుండానే జాతికి అంకితం చేసి ప్రజలను మోసం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యుద్ధ ప్రాతిపదికన వెలుగొండ పనులు పూర్తి చేస్తున్నాం, త్వరలోనే వెలిగొండ నీళ్లు ఇచ్చి ఉమ్మడి ప్రకాశం జిల్లాను సస్యశ్యామలం చేస్తాం" అని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు.

# జగనన్న రీసర్వేలో రికార్డుల తారుమారు

- 22 సెంట్ల భూమి మాయమైందంటూ బాధితులు గగ్గోలు
- ఇళ్ల స్థలం వివాదంలో తమ్ముడిపై అన్న కుటుంబం దాడి
- అంబాపురంలో.. ప్రైవేట్ స్థలాన్ని నిషేధిత జాబితాలో చేర్చిన వైనం
- ఆస్తి కోసం కన్నతండ్రినే వీధుల పాలు చేసిన కొడుకులు..
- అర్జీలు స్వీకరించిన గండి బాబ్జీ, పీతల సుజాత
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామంటూ బాధితులకు హామీ





మంగళగిరి (చైతన్య రథం): తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమానికి వివిధ జిల్లాలనుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. భూ వివాదాలు, కుటుంబ కలహాలు, రెవెన్యూ అధికారుల అవినీతి, మహిళలపై వేధింపులు, ఆచూకీ తెలియని కుమార్తె వ్యవహారం వంటి పలు అంశాలపై బాధితులు నేతల దృష్టికి తీసుకెళ్లారు. కొందరు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణ సమస్యలపై విన్నవించగా, మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు అందజేశారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న కొందరు ఆర్థిక సాయం కోసం అభ్యర్థించారు. ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ ఛైర్మన్ గండి బాబ్జీ, ఏపీ మహిళా సహకార ఆర్థిక సంస్థ చైర్‌పర్సన్ పీతల సుజాత అర్జీలను స్వీకరించి.. సమస్యలు తగురీతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**సొంత అన్న దాడి -కడుపులో పొడిచిన అల్లుడు:**

ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం అమ్మిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన నాగరాజు అర్జీ ఇస్తూ, హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న తాను గ్రామంలో సొంత ఇళ్ల స్థలంలో ఇల్లు కట్టుకోవాలనే ఉద్దేశంతో గత నెల 20వ తేదీన బావమరిది, చెల్లితో కలిసి స్థలం శుభ్రం చేయడానికి వెళ్లగా, తన సొంత అన్న, వదిన, మేనల్లుడు అక్కడికి వచ్చి స్థలంపై హక్కు తమదేనంటూ బూతులు తిడుతూ గొడవకు దిగారని ఫిర్యాదు చేశారు. కర్రలు, రోకలిబండ, రాళ్లతో దాడికి తెగబడి, మేనల్లుడు తనను కర్రతో కొట్టి కడుపులో పొడిచాడని, అడ్డుకోబోయిన బావమరిదిని కూడా కర్రతో కొట్టారని తెలిపారు. స్థానికులు జోక్యం చేసుకోవడంతో ప్రాణాపాయం తప్పిందని, గ్రామ పెద్దలకు ఫిర్యాదు చేయడానికి వెళ్తుండగా వెంటాడి, స్థలంలో అడుగుపెడితే చంపేస్తామని బహిరంగంగా బెదిరించారని పేర్కొంటూ చర్యలు తీసుకోవాలని కోరారు.

**రీసర్వేలో మాయమైన భూమి:**

ఏలూరు జిల్లా ముదినేపల్లి గ్రామానికి చెందిన కొల్లి స్వరూప రాణి తన భర్త, తన పేరిట గల భూములకు రిజిస్టర్డ్ దస్తావేజులు ఉండి, క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తున్నప్పటికీ, గత జగన్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూ హక్కు రీసర్వేలో రికార్డులు తారుమారు చేసి తమ భూమిలో కొంత భాగం తగ్గించి చూపారని ఫిర్యాదు చేశారు. దీనిపై స్థానిక రెవెన్యూ అధికారులను ప్రశ్నించినా సరైన సమాధానం రాలేదని, చర్యలు తీసుకోవాలని కోరారు.

**సొంత స్థలం నిషేధిత జాబితాలో:**

ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన మేకా ఉమామహేశ్వరి తాను 2004లోనే చట్టబద్ధంగా కొనుగోలు చేసి, నాటి నుంచి తన ఆధీనంలో ఉన్న ఇళ్ల స్థలాన్ని గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ అధికారులు ఎలాంటి విచారణ లేకుండా నిషేధిత భూముల జాబితాలో, అలాగే అసైన్డ్ భూముల జాబితాలో చేర్చడంతో తనకు హక్కులు లేకుండా పోయాయని ఫిర్యాదు చేస్తూ, సమస్య పరిష్కరించాలని కోరారు.

**కొడుకుల చేతిలో వృద్ధాప్యంలో వేధింపులు:**

తిరుపతి జిల్లా చిట్వేలి మండలం గరుగుపల్లి గ్రామానికి చెందిన దుగ్గినేని యానాదయ్య నాయుడు, వృద్ధాప్యంలో కొడుకులు బాగా చూసుకుంటారన్న నమ్మకంతో 15 ఏళ్ల క్రితం తన భూమిని, ఇళ్లను స్టాంప్ పేపర్‌పై రాసి ఇచ్చానని, అయితే కాగితం చేతికి అందిన నాటి నుంచి ఇద్దరు కొడుకులు తనను ఇంటి నుంచి గెంటివేసి, అన్నం పెట్టకుండా, ఆసుపత్రి ఖర్చులు ఇవ్వకుండా హింసిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అధికారిక రెవెన్యూ రికార్డుల్లో భూమి తన పేరు మీదే ఉన్నప్పటికీ, కొడుకులు పాత స్టాంప్ పేపర్‌ను అడ్డం పెట్టుకుని రాజకీయ పలుకుబడితో తనను పొలంలోకి, ఇంట్లోకి రానివ్వడం లేదని, ఎదురుతిరిగితే చంపేస్తామని బెదిరిస్తున్నారని పేర్కొంటూ చర్యలు కోరారు.

**పశువుల షెడ్డు కూల్చివేత -అధికారుల అండదండలు:**

అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం జె.వి.పాలెం గ్రామానికి చెందిన వజ్రపు లక్ష్మి, 2020లో చట్టబద్ధంగా కొనుగోలు చేసిన స్థలంలో నిర్మించిన పశువుల షెడ్డును, పాత కక్షల కారణంగా గ్రామ మాజీ సర్పంచ్ తన అనుచరులతో కలిసి దాడికి దిగి, తమపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టించే కుట్రతో బయటి వ్యక్తులను తీసుకొచ్చారని ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీఓ, పోలీసు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది అండదండలతో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా జేసీబీతో షెడ్డును నేలమట్టం చేశారని, తమ మొబైల్ ఫోన్లు లాక్కొని దాడులు చేశారని పేర్కొంటూ, పలుమార్లు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని చర్యలు కోరారు.

**దారి మూసివేత వివాదం:**

అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం గుండ్లచెరువు గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ గఫూర్, తన పిత్రార్జిత భూమికి వెళ్లే దారిని కొందరు వ్యక్తులు అడ్డుకుంటున్నారని, తహశీల్దార్ అధికారికంగా ప్రత్యామ్నాయ దారి చూపించినప్పటికీ, ఆ దారిని కూడా "తమకు పట్టా ఉంది" అంటూ మూసివేశారని ఫిర్యాదు చేస్తూ, తహశీల్దార్ ఉత్తర్వులను ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**బంధువు కుట్రతో పేరు మార్పు:**

విజయనగరం జిల్లా గరివిడి మండలం అర్ధమూరు గ్రామానికి చెందిన అంకమ్మ, కుటుంబం ఉమ్మడిగా సాగు చేసుకుంటున్న డి-పట్టా భూములను, రికార్డులు సరిచేస్తానని నమ్మించిన తమ బంధువు దొంగచాటుగా తన భార్య పేరిట మార్పించి మోసం చేశారని, అదనంగా మరికొంత కొండ పోరంబోకు భూమిని కూడా అక్రమంగా తన పేరిట చేయించుకున్నారని ఫిర్యాదు చేస్తూ, పలుమార్లు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని చర్యలు కోరారు.

**మ్యుటేషన్‌లో రెవెన్యూ అవినీతి:**

తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం చిట్యాల గ్రామానికి చెందిన గద్దె వెంకటకృష్ణారావు, తన కుమారుడి పేరిట గల భూమికి మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేయగా, స్థానిక రెవెన్యూ అధికారులు లంచాలకు ఆశపడి ఆన్‌లైన్ రికార్డులను తారుమారు చేశారని, కుటుంబంలో జరిగిన మరణాలు, కోర్టు వివాదాలను ఆసరాగా చేసుకుని అక్రమాలకు పాల్పడ్డారని ఫిర్యాదు చేస్తూ చర్యలు కోరారు.

**కుమార్తె అదృశ్యం -ఆరు నెలలుగా ఆచూకీ లేదు:**

ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన రంగారావు, ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్న తన కుమార్తె గత డిసెంబర్ 17 నుంచి కనిపించకుండా పోయిందని, భర్త అవినాష్ ఆమెను మానసికంగా వేధిస్తూ వచ్చాడని ఫిర్యాదు చేశారు. అవినాష్ పోలీసులకు ఇచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం, తన పరిచయస్తుడైన ఒక వ్యక్తి బెంగళూరులో పని కోసమని తీసుకెళ్లి, డబ్బు విషయంలో గొడవ జరిగిన తర్వాతే కుమార్తె కనిపించకుండా పోయిందని తెలిపారని పేర్కొన్నారు. దీనిపై నూజివీడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఆరు నెలలుగా ఫోన్ ట్రాకింగ్ తప్ప ఎలాంటి పురోగతి లేదని, డబ్బు గొడవ నేపథ్యంలో కుమార్తెకు అపాయం జరిగి ఉండవచ్చన్న అనుమానంతో ఆచూకీ కనుగొనాలని కోరారు.

# ఈజ్ ఆఫ్ సాక్షి అబద్ధాల బిజినెస్

- నీతి ఆయోగ్ నివేదికలో వైసీపీకి భంగపాటు..
- ఏపీ 8వ స్థానానికి పడిపోవడం.. జగన్ వైఫల్య పాలనే కారణం
- నీతి ఆయోగ్ సర్టిఫికెట్‌తో వైసీపీ బండారం బట్టబయలు
- సాక్షి అజ్ఞానానికి వక్రీకరణ కథనమే నిలువెత్తు నిదర్శనం..
- పరీక్ష రాసింది, ఫెయిల్ అయ్యింది వైసీపీనే.. నెపం కూటమిపైనా?
- తుగ్లక్ పాలనతో పెట్టుబడులను తరిమేసిన బండారం మీదేకదా..
- 2019-24నాటి చీకటి రోజులు ముగిసిపోయాయి..
- ఏపీ పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం భరోసా
- ఏపీ బయో డైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్




మంగళగిరి (చైతన్య రథం): నీతి ఆయోగ్ నిన్న విడుదల చేసిన 'కాంపిటీటివ్‌నెస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీ ఇండెక్స్' నివేదికపై వైఎస్సార్ కాంగ్రెస్ అనుకూల పత్రిక సాక్షి ప్రచురించిన కథనం వారి అజ్ఞానానికి, రాజకీయ కక్ష సాధింపు ధోరణికి నిదర్శనంగా నిలిచిందని ఏపీ బయో డైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్ విమర్శించారు. "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో నాడు నెంబర్-1... నేడు నెంబర్-8" అనే శీర్షికతో ప్రజలను తప్పుదోవ పట్టించేలా కథనం ప్రచురించడం అత్యంత బాధ్యతారాహిత్యమని అన్నారు. కనీస అవగాహన లేకుండా, వాస్తవాలు తెలుసుకోకుండా ఇలా రాయడం చూస్తే నవ్వాలో, బాధపడాలో అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీతి ఆయోగ్ విడుదల చేసిన నివేదిక పాత 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ర్యాంకింగ్స్ కాదు. ఇది పూర్తిగా కొత్త విధానంలో రూపొందించిన 'కాంపిటీటివ్‌నెస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీ ఇండెక్స్' అని, దీనిలో పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక వసతులు, పాలన, విధానాల అమలువంటి అనేక అంశాలను సమగ్రంగా పరిశీలించి రాష్ట్రాలకు ర్యాంకులు కేటాయించారని వివరించారు. ఒక నివేదికను మరో నివేదికతో పోల్చి ప్రజలను మభ్యపెట్టడం సాక్షి పత్రికకే సాధ్యమని ఎద్దేవా చేశారు. పేర్లు వేరైనా, ప్రమాణాలు వేరైనా, కాలపరిమితి వేరైనా అన్నింటినీ కలిపేసి రాజకీయ ప్రచారం చేయడం జర్నలిజం కాదని స్పష్టం చేశారు. సాక్షి ఎడిటర్లకు, సబ్ ఎడిటర్లకు కనీస సమాచారం ఉందో లేదో తెలియదు కానీ, వారు పదే పదే గొంతు చించుకుంటున్న 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అనే కాన్సెప్ట్‌ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి వచ్చే సెప్టెంబర్ నాటికి ఐదేళ్లు పూర్తవుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఆ పద్ధతిని పక్కన పెడితే, వీరు మాత్రం ఇంకా 2021, 2022, 2023, 2024ల్లో తామే నెంబర్ వన్ అంటూ పగటి కలలు కంటున్నారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' స్క్రాప్ అయిన తర్వాత కేంద్ర అంతర్గత వర్తక విభాగం కేవలం స్థానిక వ్యాపారాల కోసం 'బిజినెస్ రిఫార్మ్స్ యాక్షన్ ప్లాన్' అనే చిన్న ఇండెక్స్ తెచ్చింది తప్ప, పాత విధానం ఎప్పుడో కనుమరుగైంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాకముందు, 2024 నవంబర్ ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్‌కు ఒక కీలక బాధ్యత అప్పగించింది. దేశంలో పెట్టుబడులకు ఏ రాష్ట్రాలు అనుకూలంగా ఉన్నాయో తెలుసుకోవడానికి ఒక సమగ్ర నివేదిక తయారు చేయాలని కోరింది. దీనికోసం నీతి ఆయోగ్ ప్రఖ్యాతి గాంచిన 'నీల్సన్' సర్వే ఏజెన్సీ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న కంపెనీల ఓనర్లు, సీఈఓలు, ఫైనాన్స్ హెడ్‌లను ఇంటర్వ్యూ చేసింది. ఈ సర్వే దేని ఆధారంగా జరిగింది? 2024 వరకు అంటే... గత ఐదేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, పారిశ్రామిక విధానాలు, జగన్ మోహన్‌రెడ్డి పాలనను బేస్ చేసుకుని డేటాను సేకరించారు. ఆ ఐదేళ్ల తుగ్లక్ పాలన, బరితెగించిన వేధింపులు, పరిశ్రమల పారిపోవడం వల్లే... ఎప్పుడూ దేశంలోనే మొదటిస్థానంలో ఉండే ఆంధ్రప్రదేశ్, మొట్టమొదటిసారిగా ఎనిమిదో స్థానానికి దిగజారిపోయింది. ఈ ర్యాంకింగ్స్ చూపిస్తూ ఇది 'బాబు మార్క్' అంటూ బురదజల్లాలని సాక్షి చూస్తోంది. కానీ, ఒకటిన్నర సంవత్సరం పాటు డేటా సేకరించి, విశ్లేషించి ఇచ్చిన ఈ నివేదిక నిలువునా సాక్షి అబద్ధాలను చీల్చి చెండాడుతోంది. గత ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రానికి పెట్టుబడులు రాకపోగా, ఉన్న కంపెనీలు పారిపోవడం వల్లే ఏపీ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిని 8వ స్థానానికి పడిపోయింది. ఇప్పటికైనా సాక్షి యాజమాన్యం, ఎడిటర్లు తమ గుడ్డి రాజకీయ ప్రచారాన్ని పక్కన పెట్టి, వాస్తవాలను ఒప్పుకోవాలి. నిన్నటి నీతి ఆయోగ్ నివేదిక చంద్రబాబు నాయుడు పాలనకు తలవంపులు కాదు. గత ఐదేళ్ల జగన్ మోహన్‌రెడ్డి అట్టడుగు పాలనకు నిలువెత్తు నిదర్శనమని స్పష్టమవుతోంది.

## పరీక్ష రాసింది, ఫెయిల్ అయ్యింది వైసీపీ.. నెపం కూటమి ప్రభుత్వంపైనా?

నీతి ఆయోగ్ ఇప్పుడు ఇచ్చిన 8వ ర్యాంకు 2019 నుంచి 2024 వరకు (2025 మార్చినాటి ముగింపు లెక్కల ఆధారంగా) ఉన్న పరిస్థితులకు సంబంధించినది. అంటే ఐదేళ్లపాటు పరీక్ష రాసింది వైసీపీ ప్రభుత్వం. ఇప్పుడు రిజల్ట్ వచ్చి అందులో చిత్తుగా ఫెయిల్ అయ్యింది కూడా వైసీపీ ప్రభుత్వమే. పరీక్ష రాసిన వాళ్లు ఫెయిల్ అయితే, ఫలితాలు వచ్చిన రోజు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎలా బాధ్యత వహిస్తుంది? ఈ చిన్న లాజిక్ మిస్సైన సాక్షి చంకలు గుద్దుకోవడం హాస్యాస్పదం. ఈ ర్యాంకింగ్స్‌ను నీతి ఆయోగ్ ఏదో పత్రికల్లో వచ్చే వార్తలను చూసి ఇవ్వదు. కాగ్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియావంటి అత్యున్నత సంస్థలు పక్కాగా లెక్క తేల్చిన పాత డేటా ఆధారంగానే ఇస్తుంది. ఈ నివేదిక పూర్తిగా గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన ఆర్థిక అరాచకాలకు, అడ్డగోలు నిర్ణయాలకు, చేతకానితనానికి నిలువెత్తు సాక్ష్యం. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది జూన్ 2024లో. మేము పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టింది నవంబర్ 2024లో. కేవలం నాలుగు నెలల బడ్జెట్ పెట్టిన మా ప్రభుత్వానిది ఈ ర్యాంక్ అని ప్రజలను నమ్మించాలని చూస్తే, ప్రజలు మీ అంత బుర్రతక్కువ వాళ్లు కారు అని సాక్షి ఎడిటర్లు గుర్తుంచుకోవాలి. గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని, పెట్టుబడులు పోయాయని, వ్యవస్థలు నాశనం అయ్యాయని మేము ఎప్పటినుంచో చెబుతున్నాం. ఇప్పుడు భారతదేశంలోనే అత్యున్నత విధాన నిర్ణయక సంస్థ అయిన 'నీతి ఆయోగ్' కూడా తన నివేదిక ద్వారా అదే విషయాన్ని స్పష్టం చేసింది. ఒక రకంగా చెప్పాలంటే ఇది 2019-24 మధ్య జరిగిన వైసీపీ ఆర్థిక వినాశనానికి నీతి ఆయోగ్ చేసిన 'పోస్ట్‌మార్టం'. ఇప్పటికైనా సాక్షి పత్రిక, అందులో పనిచేసే వాళ్లు తమ అజ్ఞానాన్ని బయటపెట్టుకోకుండా, నీతి ఆయోగ్ నివేదిక ఏ సంవత్సరాల డేటా ఆధారంగా వచ్చిందో చదువుకుని వార్తలు రాస్తే మంచిది. తమ తప్పులను, వైఫల్యాలను కూటమి ప్రభుత్వంపై నెట్టేయాలని చూస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరు.

## నీతి ఆయోగ్ నివేదికలో జగన్ పాలనకు 100కి 4 మార్కులు.. అప్పుల కుప్పగా మారిన రాష్ట్రం

నీతి ఆయోగ్ విడుదల చేసిన 'ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీ ఇండెక్స్' నివేదికను చూసి చంకలు గుద్దుకుంటూ 'సాక్షి' పత్రిక వేసిన హెడ్డింగ్.. ఇప్పుడు వారి మెడకే చుట్టుకుంది. ఈ నివేదిక లోపలి పేజీల్లోకి వెళ్లి చూస్తే, గత ఐదేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు పరిపాలన ఎంత దరిద్రంగా సాగిందో, రాష్ట్రాన్ని ఎలా అప్పుల ఊబిలోకి నెట్టేసారో మార్కులతో సహా నీతి ఆయోగ్ బట్టబయలు చేసింది. తాము అధికారంలో లేని కాలానికి సంబంధించిన రిపోర్టును పట్టుకుని కూటమి ప్రభుత్వంపై బురదజల్లాలని చూసిన సాక్షి ఎడిటర్లూ.. ఈ మార్కుల లిస్ట్ చూసైనా కాస్త బుర్ర తెరిచి చావండని నీలాయపాలెం ధ్వజమెత్తారు. రాష్ట్ర ఆదాయం ఎంత? ఖర్చు ఎంత? ఏ రకంగా బడ్జెట్‌ను మేనేజ్ చేస్తున్నామనే 'ఆర్థిక క్రమశిక్షణ'లో వైఎస్సార్సీపీ ప్రభుత్వానికి నీతి ఆయోగ్ ఇచ్చిన మార్కులు 100కి కేవలం 9.9 మాత్రమే! అంటే 90 శాతం మార్కులు పోగొట్టుకుని, ఆర్థిక క్రమశిక్షణలో జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయ్యిందని దేశ అత్యున్నత సంస్థ తేల్చి చెప్పింది. అడ్డగోలుగా బటన్లు నొక్కడం తప్ప, ఆదాయ మార్గాలను పెంచడం చేతకాక రాష్ట్రాన్ని దివాళా తీయించారు. జగన్ మోహన్ రెడ్డీ, మీకంటూ సొంతంగా చాలా కంపెనీలు ఉన్నాయి కదా. ఆదాయాన్ని బట్టి అప్పులు ఎంత చేయాలో కనీస లాజిక్ మీకు తెలియదా? మీ అప్రతిష్టాత్మక ఆర్థిక మంత్రి బుగ్గన ఎప్పుడూ అమరావతివైపు రాకుండా హైదరాబాద్, అనంతపూర్‌లకే పరిమితమై ఏం మేనేజ్ చేశారు? మీ అప్పుల మేనేజ్‌మెంట్‌కు నీతి ఆయోగ్ 100కి కేవలం 4.2 మార్కులు ఇచ్చింది. ఇంతకంటే సిగ్గుచేటు ఇంకేమైనా ఉందా? రాష్ట్ర అప్పులు ఏకంగా జీఎస్‌డీపీలో 35 శాతానికి చేరిపోయాయని 15వ ఆర్థిక సంఘం హెచ్చరించిన విషయాన్ని నీతి ఆయోగ్ ఈ సందర్భంగా గుర్తు చేసింది. ఈ నివేదికలో మిగతా ఇండికేటర్లయిన మౌలికలో 68.4 శాతం, మానవ-సహజ వనరులులో 61.2 శాతం మార్కులు వచ్చాయి. 2014-19 మధ్య చంద్రబాబు నాయుడు వేసిన బలమైన పునాదులు, మానవ వనరులపై పెట్టిన శ్రద్ధవల్లే ఆ మాత్రం మార్కులైనా వచ్చాయి. కానీ, జగన్ మోహన్ రెడ్డి తీసుకొచ్చిన ఆర్థిక అరాచకత్వం, అప్పుల స్థిరత్వం లేకపోవడం అనే రెండు సబ్జెక్టులవల్ల మొత్తం రాష్ట్ర ర్యాంకే 8వ స్థానానికి పడిపోయింది. స్కూల్లో ఒక పాప అన్ని సబ్జెక్టుల్లో బాగా పాసై.. లెక్కల్లోనూ, సోషల్‌లోనూ 4 మార్కులు తెచ్చుకుని ఫెయిల్ అయిన చందంగా ఉంది వైసీపీ ఐదేళ్ల ప్రగతి ప్రస్థానం. గత ఐదేళ్లలో రాష్ట్ర అప్పులు 9.74 లక్షల కోట్ల రూపాయలకు చేరాయని మేము అధికారికంగా 'ఆర్థిక శ్వేతపత్రం' విడుదల చేస్తే, అప్పట్లో సాక్షి పత్రిక, వైసీపీ నాయకులు అది అబద్ధమంటూ రంగురంగుల కథలు చెప్పారు. 'అప్పు చేసి పప్పు కూడు' తింటూ, అప్పులను దాచడానికి ఎన్ని దొంగ లెక్కలు చూపించినా.. చివరికి ఇవాళ నీతి ఆయోగ్ రూపంలో అసలు నిజం బయటపడింది. ఇప్పటికైనా సాక్షి పత్రిక చంకలు గుద్దుకోవడం మానేసి, 100కి 4 మార్కులు తెచ్చుకున్న మీ 'సార్' వైఫల్యాలను ఒప్పుకోవాలి. ఈ నివేదిక కూటమి ప్రభుత్వానికి సంబంధించినది కాదు, 2019-24 మధ్య వైఎస్సార్సీపీ చేసిన ఆర్థిక వినాశనానికి నిలువెత్తు సాక్ష్యమని రాష్ట్ర ప్రజలందరికీ అర్థమైపోయింది. మీ తప్పుడు కలరింగులను నమ్మడానికి ప్రజలు మీ అంత బుర్రతక్కువ వాళ్ళు కారు అంటూ నీలాయపాలెం ధ్వజమెత్తారు.

గత టీడీపీ ప్రభుత్వానికి, జగన్ ఐదేళ్ల విధ్వంసకర పాలనకు ఉన్న తేడాను కాగ్, ఆర్‌బీఐ లెక్కల ఆధారంగా నీతి ఆయోగ్ ఇచ్చిన అధికారిక డేటాతో సహా నిరూపిస్తున్నాం. టీడీపీ (2014-19): మేము రాష్ట్ర అభివృద్ధి కోసం ఆర్‌బీఐ ద్వారా తెచ్చిన అప్పు రూ.1,83,000 కోట్లు. వైఎస్సార్సీపీ (2019-24) ప్రభుత్వం ఆర్‌బీఐ నుంచే తెచ్చిన అప్పు ఏకంగా రూ.4,38,000 కోట్లు. మాకంటే రూ.2,54,000 కోట్లు కేవలం ఆర్‌బీఐ నుంచే అదనంగా అప్పు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితులవల్ల డైరెక్ట్‌గా అప్పులు ఇవ్వదని గ్రహించి, ఏపీ స్టేట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లాంటి 'షాడో' సంస్థలను సృష్టించారు. రోజువారీ మద్యం అమ్మకాల ఆదాయాన్ని, ప్రభుత్వ ఆస్తులను అసెంబ్లీకి తెలియకుండా, ఆమోదం లేకుండా దొడ్డిదారిన కుదవపెట్టారు. టీడీపీ (2014-19)లో కార్పొరేషన్ల ద్వారా తెచ్చిన అప్పు కేవలం రూ.47 కోట్లు. వైఎస్సార్సీపీ (2019-24)లో కార్పొరేషన్ల ఆస్తులు తెగనమ్మి తెచ్చిన అప్పు రూ.2,48,000 కోట్లు. మాకంటే రూ.2,01,000 కోట్లు దొడ్డిదారిన అదనంగా అప్పు తెచ్చి ఖజానాలో వేసుకుని ఇష్టం వచ్చినట్టు వాడుకున్నారు. పైకి బటన్లు నొక్కుతున్నామని డబ్బా కొట్టుకుంటూ, లోపల ప్రభుత్వ బిల్లులు చెల్లించకుండా ఎగనామం పెట్టారు. టీడీపీ (2014-19)లో ప్రభుత్వం నుంచి వెళ్లేటప్పుడు సివిల్ సప్లైస్, కాంట్రాక్టర్లకు పెట్టిన బాకీ రూ.26,000 కోట్లు. వైఎస్సార్సీపీ (2019-24)లో ఉద్యోగుల డీఏ బకాయిలు, రిటైర్డ్ ఉద్యోగుల గ్రాట్యుటీ, చిన్న వెండర్లు, పెయింటర్లు, చివరకు రూ.5,300 కోట్ల ఫీజ్ రీయింబర్స్‌మెంట్ సహా వీరు పెట్టిన బాకీ రూ.2,87,000 కోట్లు. టీడీపీ (2014-19) మొత్తం ఖర్చు: రూ.2,57,000 కోట్లు (రాష్ట్రంలో మౌలిక వనరులు, సంక్షేమం సమపాళ్లలో చేసాం). వైఎస్సార్సీపీ (2019-24) మొత్తం ఖర్చు: రూ.9,74,000 కోట్లు. ఐదేళ్ల పాలన మాదీ, ఐదేళ్ల పాలన మీదీ.. మరి మాకంటే రూ.7,57,000 కోట్లు ఎక్కడ ఎక్కువ ఖర్చు పెట్టారు? ఏ మందులో పోశారు? ఏ లిక్కర్‌లో పోశారు? ఏ సిమెంట్‌లో పెట్టారు? ఈ రూ.7.5 లక్షల కోట్లు ఎక్కడికి పోయాయో జగన్‌రెడ్డి సమాధానం చెప్పాలి. ఇంత ఘోరంగా రాష్ట్రాన్ని లూటీ చేశారు కాబట్టే, ప్రధానికి నేరుగా రిపోర్ట్ చేసే దేశ అత్యున్నత సంస్థ 'నీతి ఆయోగ్' మీ ముఖాన మార్కుల లిస్ట్ కొట్టింది. ఆర్థిక క్రమశిక్షణ 100కి కేవలం 9.9 మార్కులు.

(తరువాయి 15లో..)

# విజయవాడలో రూ.3.02 కోట్లతో రహదారుల అభివృద్ధి

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు శంకుస్థాపన
- పేవర్ బ్లాక్ ఫుట్‌పాత్‌లు, హాట్‌మిక్స్ రోడ్లతో నగర రూపు మార్పు
- దుమ్ము కాలుష్యం తగ్గించే వర్టికల్ గార్డెన్స్, గ్రీనరీ ప్రణాళిక

విజయవాడ (చైతన్య రథం): విజయవాడ నగర ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే కాకుండా వాయు కాలుష్యం తగ్గించేందుకు విజయవాడ నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భారతీనగర్, గురునానక్ కాలనీలో చేపట్టనున్న రూ.3.02 కోట్ల విలువైన ఎండ్ టు ఎండ్ రహదారి అభివృద్ధి పనులకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. 15వ ఆర్థిక సంఘం ఎయిర్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం నిధులతో చేపట్టనున్న పనుల్లో భాగంగా 4వ డివిజన్‌లోని భారతీనగర్ మెయిన్ రోడ్డులో హాట్‌మిక్స్ బీటీ రోడ్డు, పేవర్ బ్లాకుల నిర్మాణ పనులను రూ.1.10 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్నారని తెలిపారు. 650 మీటర్ల పొడవు, 14 మీటర్ల వెడల్పుతో రహదారిని అభివృద్ధి చేయడంతో పాటు సాధ్యమైనచోట్ల ఇరువైపులా 1.20 మీటర్ల వెడల్పుతో పేవర్ బ్లాక్ ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేయనున్నారు. అలాగే 10వ డివిజన్‌లో గురునానక్ కాలనీ రోడ్డు నుంచి పంటకాలువ రోడ్డు వరకు ఉన్న ఫన్‌టైమ్స్ రోడ్డులో మిగిలిన వెడల్పునకు సీసీ రోడ్డు, పేవర్ బ్లాకుల నిర్మాణ పనులను రూ.1.92 కోట్ల వ్యయంతో 690 మీటర్ల పొడవున చేపట్టనున్నారని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా నాణ్యమైన మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న ఈ అభివృద్ధి పనుల ద్వారా విజయవాడ



నగరంలో వాయు కాలుష్యం తగ్గుముఖం పడుతుందని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థలతో సమన్వయం చేసుకుంటూ నగరాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ, విజయవాడ నగర అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య సౌకర్యాలు, ఆధునిక మౌలిక వసతులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగర అభివృద్ధిలో ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని, నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా రహదారుల నాణ్యత మెరుగుపడటంతో పాటు పాదచారుల భద్రత పెరుగుతుందని, దుమ్ము కాలుష్యం తగ్గి నగర వాయు నాణ్యత మెరుగుపడుతుందని అన్నారు. రవాణా సౌలభ్యం, డ్రైనేజీ వ్యవస్థ, ప్రజల ప్రయాణ భద్రత మరింత మెరుగవుతాయని, నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

ఈ సందర్భంగా తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ, విజయవాడ నగరంలో చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపడుతున్నారని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతంగా పూర్తి చేసి మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ప్రజల సూచనలు, సహకారంతో నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ, విజయవాడ నగరంలో వాయు కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఎండ్ టు ఎండ్ రహదారుల నిర్మాణంతో పాటుగా వర్టికల్ గార్డెన్స్, ఎవెన్యూ ప్లాంటేషన్, రోడ్ల మధ్య డివైడర్లలో గ్రీనరీ అభివృద్ధి, పచ్చదనం పెంపు, ప్రధాన కూడళ్లలో ఫౌంటెన్స్ వంటి కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నామని చెప్పారు. వీటి ద్వారా దుమ్ము కాలుష్యం తగ్గడమే కాకుండా నగర వాయు నాణ్యత మెరుగుపడి, ప్రజలకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ సుస్థిర అభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ కుమ్మరి శాలివాహన వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్, విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ ఇంజినీర్ పి. సత్యకుమారి, పర్యవేక్షణ ఇంజనీర్లు చంద్రశేఖర్, దుష్యంత్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఇన్‌చార్జ్) రామారావు, డీఈలు, ఏఈలు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఈజ్ ఆఫ్ సాక్షి అబద్ధాల బిజినెస్

(14వ పేజీ తరువాయి.. )

అప్పుల స్థిరత్వంలో 100కి కేవలం 4.2 మార్కులు. మేము అప్పట్లో అప్పులు ఘోరమైపోతున్నాయి.. రాష్ట్రం నాశనమైపోతుందని మొత్తుకుంటే నమ్మలేదు. ఈరోజు నీతి ఆయోగ్ ఇచ్చిన రిపోర్ట్ మా ఆరోపణలకు పూర్తి అఫీషియల్ స్టాంప్ వేసింది. అప్పు చేసి పప్పుకూడు తింటూ రాష్ట్రాన్ని 8వ స్థానానికి దిగజార్చిన వైసీపీ పాపాన్ని, కేవలం నాలుగు నెలల క్రితమే వచ్చిన కూటమి ప్రభుత్వంపై నెట్టాలని చూస్తే ప్రజలు నమ్మరు. సాక్షి ఎడిటర్లారా.. సిగ్గు ఎగ్గు లేకుండా ఇలాంటి దొంగ కథనాలు వేయడం ఆపి, మీ 'సార్' తెచ్చుకున్న 4 మార్కుల ప్రోగ్రెస్ కార్డ్ చూసుకుని సిగ్గుపడండి.

## తుగ్లక్ పాలనతో పెట్టుబడులను తరిమేసిన వైసీపీ బండారం ఇదే

నీతి ఆయోగ్ నివేదికపై తప్పుడు వార్తలతో బురదజల్లాలని చూసిన 'సాక్షి' పత్రిక ఎడిటర్ వర్ధెల్లి మురళి అజ్ఞానం చూస్తుంటే.. అసలు ఆయన పేపర్ నడుపుతున్నారా? లేక గాడిదలు కాస్తున్నారా? అని అడగాలనిపిస్తోంది. ఐదేళ్ల క్రితమే రద్దయిన 'ఈజ్ ఆఫ్ దూయింగ్ బిజినెస్' పేరుతో తాటికాయంత హెడ్డింగులు పెట్టే ముందు.. ఆ రిపోర్టు లోపల ఏముందో, అది ఏయే సంవత్సరాలకు సంబంధించినదో చదివే కనీస బుద్ధి లేదా? ఇది 2019-24 మధ్య మీరు చేసిన తుగ్లక్ పాలన, ఏకపక్ష నిర్ణయాలకు నీతి ఆయోగ్ ఇచ్చిన తిరుగులేని తీర్పు. మీ అడ్డగోలు విధానాల వల్ల గవర్నమెంట్ పాలసీలో వైఎస్సార్సీపీకి నీతి ఆయోగ్ 100కి కేవలం 41 మార్కులు మాత్రమే ఇచ్చింది. ఈ సిగ్గుచేటు మార్కులు చూసుకుని మీరు చంకలు గుద్దుకుంటున్నారా? గత వైసీపీ ఐదేళ్ల పాలనలో పారిశ్రామికవేత్తలను ఎలా వేధించి తరిమేశారో, దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ ప్రతిష్టను ఎలా గంగలో కలిపారో కొన్ని సజీవ సాక్ష్యాలు ఇవే.

రాయలసీమకు చెందిన అమరరాజా సంస్థ అధినేత జయదేవ్ గల్లాను మీ వైసీపీ ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిలాంటి వాళ్లు వేధించి, దండంపెట్టి రాష్ట్రం నుంచి తరిమేసింది నిజం కాదా? నిన్ననే ఐటీ మంత్రి నారా లోకేష్.. జయదేవ్ గల్లాతో మాట్లాడుతూ.. "రాష్ట్రం వదిలి మీరు హైదరాబాద్ వెళ్లాల్సి రావడం, అక్కడ రూ.12,000 కోట్లతో బ్రహ్మాండమైన బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్స్ ప్లాంట్ పెట్టడం చూసి మాకు బాధేసింది" అని ఆవేదన వ్యక్తం చేశారు. వేల ఉద్యోగాలను పొరుగు రాష్ట్రానికి పారదోలినందుకు జగన్ మోహన్ రెడ్డి సిగ్గుపడాలి. ఇప్పుడు లోకేష్ ఆ సంస్థకు మళ్లీ సాదరంగా ద్వారాలు తెరిచి ఏపీకి ఆహ్వానిస్తున్నారు. గ్రీన్ ఎనర్జీ పేరుతో కర్నూలులో సోలార్ ప్లాంట్ పెట్టిన అంతర్జాతీయ సంస్థ 'సాఫ్ట్ బ్యాంక్'తో కుదుర్చుకున్న పీపీఏలను మీ కమిషన్ల కక్కుర్తి కోసం రద్దు చేస్తామంటూ అడ్డగోలుగా వ్యవహరించారు. దీనిపై సాఫ్ట్ బ్యాంక్ యాజమాన్యం జపాన్ ప్రభుత్వానికి ఫిర్యాదు చేయగా, జపాన్ ప్రభుత్వం నేరుగా భారత ప్రభుత్వానికి కంప్లైంట్ చేసింది. ఢిల్లీ నుంచి గట్టిగా మొట్టికాయలు వేస్తే కానీ మీ అప్పటి ఐఏఎస్ ఆఫీసర్ శామ్యూల్ వచ్చి "మేము రద్దు చేయడం లేదు" అంటూ నంగనంగిగా ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టలేదా? అంతర్జాతీయ వేదికలపై ఏపీ పరువు తీసినందుకే మీకు పాలసీలో 41 మార్కులు వచ్చాయి. గ్రౌండ్‌లో పెట్టుబడిదారులు అడిగినప్పుడు సరైన పాలసీలు ఇవ్వడం చేతకాక, ఈరోజు ఒక రాజధాని, రేపు మూడు రాజధానులు అంటూ డ్రామాలు ఆడారు. రాజధాని అమరావతిని నాశనం చేసి, ఇప్పుడు కొత్తగా 'మావిగన్' అంటూ సీఆర్డీయే పరిధిలో వింత ప్రయోగాలు చేయడానికి చూస్తున్నారు. అసలు మావిగన్ ఎక్కడుందో, దాని కథేంటో మీకైనా తెలుసా? ఇటువంటి తుగ్లక్ నిర్ణయాల వల్లే పెట్టుబడిదారులు ఏపీ పేరు చెబితేనే పారిపోయారు. 2016లో చంద్రబాబు నాయుడు ఈజ్ ఆఫ్ దూయింగ్ బిజినెస్ తెచ్చినప్పటి నుంచి ఆంధ్రప్రదేశ్ ఎప్పుడూ 1 లేదా 2వ స్థానంలోనే ఉంటూ వచ్చింది. ఆ వ్యవస్థను 2021లో కేంద్రం రద్దు చేసేవరకు ఏపీ టాప్‌లోనే ఉంది. కానీ మీ ఐదేళ్ల పాలనలో నీతి ఆయోగ్ రిపోర్టులో మీకు వచ్చిన మార్కులు.. అప్పుల స్థిరత్వంలో 100కి కేవలం 4 మార్కులు, ఆర్థిక క్రమశిక్షణలో 100కి కేవలం 9 మార్కులు, గవర్నమెంట్ పాలసీలో 100కి కేవలం 41 మార్కులు. మీరు చేసిన ఈ ఆర్థిక, పారిశ్రామిక పోస్ట్‌మార్టం రిపోర్టును పట్టుకుని, ఇప్పుడు వచ్చిన కూటమి ప్రభుత్వంపై నెట్టాలని చూస్తారా? వర్ధెల్లి మురళీ, ఇప్పటికైనా మీ పచ్చకామెర్ల కళ్లకు లోకమంతా పచ్చగా కనిపించడం ఆపి, నీతి ఆయోగ్ సైట్‌లోకి వెళ్లి పూర్తి నివేదిక చదవండి. మేము అధికారంలోకి వచ్చి పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టి కేవలం నాలుగు నెలలే అయింది. ఈ నీతి ఆయోగ్ ఇండెక్స్ మళ్లీ 2028లో విడుదలవుతుంది. అప్పుడు మా పాలనకు వచ్చే ర్యాంకును చూపిస్తాం. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల్లో మళ్లీ నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టి తీరుతామని సవాల్ విసురుతున్నాం. చర్చకు ఎవరొచ్చినా సిద్ధం.. 'ఏనీ ప్లేస్.. ఏనీ టైమ్!

## 2019-24 నాటి చీకటి రోజులు గడిచిపోయాయి..
## ఏపీ పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం భరోసా

వైసీపీ ఐదేళ్ల తుగ్లక్ పాలనలో రాష్ట్రానికి పట్టిన శని, ఆ పార్టీ తెచ్చిన ఆర్థిక చీకటి రోజులు పూర్తిగా గడిచిపోయాయి. నీతి ఆయోగ్ నివేదికలో వైసీపీకి వచ్చిన సిగ్గుచేటు మార్కులను చూసైనా సాక్షి పత్రిక బురద రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. 100కి కేవలం 9 మార్కులు తెచ్చుకుని ఆర్థిక క్రమశిక్షణను గంగలో కలిపిన వైసీపీ వైఫల్యాలను కడిగిపారేస్తూ.. ఆంధ్రప్రదేశ్ అభ్యున్నతికి, పారిశ్రామిక పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. పెట్టుబడిదారుల నమ్మకాన్ని నిలబెడుతూ, రాష్ట్రాన్ని మళ్లీ దేశంలోనే అగ్రగామిగా నిలబెడతామని మేము స్పష్టమైన హామీ ఇస్తున్నాం. వైసీపీ పాలనలో ఆర్థిక క్రమశిక్షణకు 9 మార్కులు వస్తే.. దాన్ని 90 మార్కులకు పెంచే శక్తి, యుక్తి కేవలం చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వానికే ఉంది. అది గతంలో మేము నిరూపించాం. ఈసారీ నిరూపించి చూపిస్తాం. జగన్ మోహన్ రెడ్డి చేసిన అడ్డగోలు అప్పుల భారాన్ని క్రమంగా తగ్గిస్తూ, రాష్ట్రాన్ని అప్పుల ఊబి నుండి బయటపడేసే బాధ్యతను మా ప్రభుత్వం భుజాన వేసుకుంది. పరిశ్రమలను తరిమేయడమే కాకుండా, రావాల్సిన వేల కోట్ల పారిశ్రామిక రాయితీలను వైసీపీ ప్రభుత్వం బకాయి పెట్టి వెళ్లిపోయింది. మీరు కొంప ముంచి పోయిన అన్ని బకాయిలను కేవలం రెండేళ్లలోనే పూర్తిగా తీర్చడం ఏ ప్రభుత్వానికైనా సాధ్యం కాదు. అయినా సరే, మా ప్రభుత్వం బాధ్యతాయుతంగా ఒక్కొక్కటిగా ఆ పారిశ్రామిక రాయితీల బకాయిలను క్లియర్ చేస్తూ పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని నింపుతోంది. గత ప్రభుత్వంలో ఒక ప్రాంతాన్ని నిర్వీర్యం చేసి, మరో ప్రాంతంలో డ్రామాలు ఆడే పక్షపాత వైఖరి ఉండేది. కానీ మా కూటమి ప్రభుత్వం అన్ని ప్రాంతాలనూ సమానత్వంతో అభివృద్ధి చేస్తోంది. అమరావతి, విశాఖపట్నం ఇండస్ట్రియల్ కారిడార్లను పూర్తిస్థాయిలో వేగవంతం చేస్తున్నాం.

శ్రీసిటీని మరింత బ్రహ్మాండంగా ముందుకు తీసుకెళ్తున్నాం. రాయలసీమతో పాటు రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రాంతాన్నీ వదలకుండా సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నాం. 2014-19 మధ్యలోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి చంద్రబాబు నాయుడు అత్యంత బలమైన పునాది వేశారు. కానీ ఆ పునాది మీద కనీసం నాలుగు గోడలు కూడా కట్టుకోవడం చేతకాని దద్దమ్మలుగా వైసీపీ ఐదేళ్ల పాలన సాగింది. కేవలం అప్పులు తెచ్చి అడ్డగోలుగా ఖర్చు పెట్టే పాత పద్ధతిని పూర్తిగా మార్చేస్తున్నాం. ప్రతి డిపార్ట్‌మెంట్‌లో ఏం జరుగుతోంది? రాష్ట్రానికి ఎంత ఆదాయం వస్తోంది? ఎంత ఖర్చు పెడుతున్నాం? అనేది నిరంతరం పర్యవేక్షిస్తూ, పూర్తిస్థాయిలో నిమగ్నమైన ముఖ్యమంత్రిని ఈరోజు రాష్ట్ర ప్రజలు చూస్తున్నారు. కేవలం నీతి ఆయోగ్ ర్యాంకుల కోసం మాత్రమే కాదు.. మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభ్యున్నతికి, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడం కోసమే మా ప్రభుత్వం పగలు రేయి శ్రమిస్తోంది. వైసీపీ సృష్టించిన ఆర్థిక వినాశనం నుంచి ఆంధ్రప్రదేశ్ త్వరగతిన కోలుకుని, రాబోయే రోజుల్లో దేశంలోనే ఒకటి నుంచి మూడు అత్యుత్తమ స్థానాల్లో నిలబడటం ఖాయం. మా ప్రభుత్వం హయాంలో ఏపీ ఎప్పుడూ వెలుగులీనుతూనే ఉంటుందని రాష్ట్ర ప్రజలందరికీ, పెట్టుబడిదారులకు మరొక్కసారి హామీ ఇస్తున్నాం అని ఏపీ బయో డైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

చైతన్యరథం

# రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖకు 2 జాతీయస్థాయి అవార్డులు

### అధికారులకు మంత్రి సత్యకుమార్ అభినందనలు



అమరావతి (చైతన్య రథం): ఆయుష్మాన్ భారత్ సేవలలో రాష్ట్రానికి అవార్డులు సాధించిన అధికారులను వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు. న్యూఢిల్లీలో శుక్ర, శనివారాల్లో ఆయుష్మాన్ భారత్‌పై జరిగిన రెండు రోజుల సమీక్షా సమావేశం 4వ 'చింతన్ శివిర్'లో ఆంధ్రప్రదేశ్‌కు రెండు అవార్డులను జాతీయ ఆరోగ్య మిషన్ ప్రకటించింది. 70 సంవత్సరాల పైబడిన వృద్ధుల ఆరోగ్య భద్రతకు ఉద్దేశించిన ఆయుష్మాన్ వయో వందన కార్డులను ప్రతి లక్షమందికిగాను అత్యధిక కార్డులు నమోదు చేసినందుకు పెద్ద రాష్ట్రాల కేటగిరిలో తొలి స్థానం అవార్డును ప్రకటించారు. ఇలా నమోదైన 70 సంవత్సరాల పైబడిన వయోవృద్ధులకు ప్రత్యేకంగా ఐదు లక్షల రూపాయల ఆరోగ్య భీమా సౌకర్యం ఉచితంగా లభిస్తుంది. ఇప్పటికే దాదాపుగా 13 లక్షలమందికి పైగా 70 సంవత్సరాల పైబడిన వృద్ధుల నమోదు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా జరిగింది. ట్రస్ట్ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ఉన్నటువంటి 70 సంవత్సరాల పైబడిన వృద్ధులలో ప్రతి లక్షమందికిగాను 36 వేలకు పైగా నమోదు జరిగాయి. అదేవిధంగా పెద్ద రాష్ట్రాల విభాగంలో ప్రతి లక్ష జనాభాకు అత్యధిక ఆరోగ్య రికార్డులను అనుసంధానించినందుకు గాను ఆంధ్రప్రదేశ్ ఏబీడీఎం (ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్) అవార్డు లభించింది. ఈ మేరకు అధికారులను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు.

# కోవిడ్ కేసుల్లో ఒమిక్రాన్ ఆర్ఎఫ్5 వేరియంట్ గుర్తింపు

- పూణే ల్యాబ్‌లో 4 నమూనాల పరీక్షలు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి
- ఆందోళన అక్కర్లేదు.. అప్రమత్తత చాలు
- డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణువర్ధన్ వెల్లడి

అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్‌లో కోవిడ్ పాజిటివ్ నమూనాల జీనోమ్ సీక్వెన్సింగ్ పరీక్షల్లో ఒమిక్రాన్ ఆర్ఎఫ్5 వేరియంట్‌ను గుర్తించారు. ఇది కరోనా వైరస్‌లోని ఒమిక్రాన్ వేరియంట్‌కు చెందిన ఒక ఉపవంశం. ప్రపంచవ్యాప్తంగా గుర్తించిన అనేక ఒమిక్రాన్ ఉపవంశాల్లో ఆర్ఎఫ్ 5 కూడా ఒకటి. కడప జిల్లాలో నమోదైన కోవిడ్ పాజిటివ్ కేసుల్లో 4 నమూనాలను వైద్య ఆరోగ్యశాఖ పూణేలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపింది. వాటి ఫలితాలు ఇప్పుడు అందాయి. ఈమేరకు వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులతో సెల్‌ఫోన్ ద్వారా మాట్లాడారు. పూణేనుంచి అందిన ఫలితాలు, రాష్ట్రంలోని తాజా పరిస్థితులపై చర్చించిన అనంతరం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ వేరియంట్‌ను సాధారణ జీనోమిక్ పర్యవేక్షణలో భాగంగా పరిశీలిస్తోంది. ఒమిక్రాన్ ఆర్ఎఫ్ 5ఎన్‌యు సార్స్ సీవోవీ2గా కూడా పర్యవేక్షిస్తోందని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణువర్ధన్ తెలియజేశారు. సింగపూర్‌తో పాటు ఆగ్నేయాసియా లోని కొన్ని దేశాల్లో ఈ కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. అయితే, ప్రస్తుతం అందుబాటులో ఉన్న శాస్త్రీయ ఆధారాల ప్రకారం ఇతర ఒమిక్రాన్ వేరియంట్లతో పోలిస్తే ఇది ప్రమాదకరమని ఎలాంటి ఆధారాలు లేవు. అందువల్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ విష్ణువర్ధన్ తెలిపారు.

**సన్నద్ధంగా ఉన్నాం.. మంత్రి**

రాష్ట్రంలో చెదురుముదురుగానే కేసులు ఉంటున్నాయని, పరిస్థితులకు తగ్గట్టుగా ఆసుపత్రులను పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉన్నాయని మంత్రి సత్యకుమార్ తెలిపారు. బోధన ఆస్పత్రుల్లో ప్రత్యేక వార్డులతో పడకలను సిద్ధం చేస్తున్నామని, కోవిడ్ కేసుల గుర్తింపునకు అవసరమైన కిట్లు, ఇతర మౌలిక సదుపాయాలను సమకూరుస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 16 కోవిడ్ కేసులు నమోదయ్యాయి.

# మహిళల రక్షణపై మాట్లాడటానికి సిగ్గుండాలి?

రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవని, మహిళలకు రక్షణ లేదని, ఇదేనా సుపరిపాలనా? ఇదేనా పోలీసింగ్ అంటూ పులివెందుల ఎమ్మెల్యే జగన్ రెడ్డి ప్రశ్నించడం చూస్తే దెయ్యాలు వేదాలు వల్లించినట్టుంది. శాంతి భద్రతలు, పోలీసింగ్, మహిళల రక్షణ పై తాను మాట్లాడితే ప్రజలు ఏమన్నా అనుకుంటారేమో అన్న ఇంగితం లేకుండా సిగ్గువిడిచి మాట్లాడటం జగన్ రెడ్డికే చెల్లింది. మహిళలకు రక్షణ లేదు, ఇదేనా సుపరిపాలన? అనే ప్రశ్న అడిగే ముందు, అదే ప్రశ్న గత పాలనకూ వర్తిస్తుంది అనే విషయాన్ని ప్రజలు పరిశీలిస్తారు. ఏ ప్రభుత్వ హయాంలోనైనా మహిళలపై దాడి జరిగిన తర్వాత ప్రభుత్వం ఎంత వేగంగా స్పందించింది? బాధితులకు న్యాయం అందిగేలా చట్టాన్ని ఎంత సమర్థంగా అమలు చేసింది? చూడాలి. ప్రతిపక్షం ప్రభుత్వాన్ని ప్రశ్నించడం సహజమే. అదే సమయంలో తాము అధికారంలో ఉన్నప్పుడు తాము తీసుకున్న చర్యల గురించి కూడా సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉంటుంది. ప్రజల జ్ఞాపకశక్తి చిన్నది కాదు. కావున గతంలో జరిగిన ఘటనలు, వాటిపై వచ్చిన విమర్శలు, బాధిత కుటుంబాల ఆవేదన ఇవన్నీ ప్రజా చర్చల్లో భాగంగానే ఉంటాయి. తాలిబన్లను తలపించిన జగన్ రాజ్యంలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది. శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి. విషంలో పుట్టిన పురుగుకి విషమే ఆహారం అయినట్లు అరాచకుడికి అధికారం ఇస్తే అరాచకంతోనే రాజ్యమేలిన జగన్ రెడ్డి సిగ్గు లేకుండా నేడు మహిళల రక్షణపై ప్రవచనాలు వల్లిస్తున్నారు. తన ఐదేళ్ల పాలన ఆంధ్రప్రదేశ్ మహిళలపై అత్యాచారాలకు, అఘాయిత్యాలకు అడ్డాగా మారింది. రాష్ట్రంలో మహిళలపై 52,587 నేరాలు జరిగాయి. 9 మంది బాలికలపై యాసిడ్ దాడులు నమోదు కాగా 32 మంది మహిళలపై సామూహిక అత్యాచారాలు, 3,372 మందిపై దాడులు 14,438 గ్యాంగ్ రేప్‌లు జరగడం అంటే జగన్ పాలనలో రాష్ట్రంలో మహిళల భద్రత ఏ విధంగా ఉందో జగన్ తెలుసుకుంటే మంచిది. ఐదేళ్ల జగన్ పాలనలో దుశ్శాసన సంతతి వికృత రూపం దాల్చి మహిళల జీవితాలు కొడగట్టిపోవడమే కాదు, మహిళల భద్రతా గాలిలో దీపాలుగా మారింది.

**కీచక సంతతి పీచమణిచే ప్రయత్నం జరిగిందా జగన్ రెడ్డీ?**

జగన్ పాలనలో మహిళల మానాభిమానాలకు రక్షణ లేదు. ఆయన పాలనలో మహిళల పట్ల మానవ మృగాలు మానవత్వం లేకుండా వ్యవహరించిన ఉదంతాలు లెక్కలేనన్ని. శీలహీన సంస్కృతికి పుట్టిన శిశువు వైసీపీ. మహిళలపై అఘాయిత్యాలు జరగని రోజంటూలేదు. మహిళలకు రక్షణ కరువైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అపఖ్యాతి మూటకట్టుకుంది. రెక్కాడితే కానీ డొక్కాడని బతుకు తెరువుకోసం బయటికి వచ్చిన మహిళలపై మానవ మృగాలు విరుచుకు పడిన పరిస్థితులను ప్రపంచం అంతా చూశారు. జగన్ పాలనలో ఆఫీసులకు వెళ్లిన మహిళలు, కూలి పనులకు వెళ్లిన పేద మహిళలు క్షేమంగా ఇంటికి వస్తారన్న నమ్మకం లేదు. గుడిలో, బడిలో, బంధుమిత్రుల ఒడిలో, ప్రభుత్వ ఆసుపత్రుల్లో, రైల్వే స్టేషన్లలో, చివరకు ఇంట్లో కూడా జగన్ హయాంలో మహిళలకు రక్షణ లేదు. పసి నలుసులు నుంచి ముసలివారి వరకు ఎవరికీ భద్రత లేని భయానక వాతావరణం నెలంది. పశువాంఛతో తెగబడిన కీచక సంతతి పీచమణిచే ప్రయత్నం జరగ లేదు జగన్ పాలనలో. గుంటూరులో మహిళపై జరిగిన దాడి ఘటనతో ప్రమేయం వున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తను పార్టీ నుంచి సస్పెండ్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేసి అత్యంత కఠినంగా వ్యవహరించింది.

**మహిళోద్ధరణ కోసమే జన్మించినట్లు బిల్డప్ ఇచ్చిన జగన్ రెడ్డి!**

జగన్ హయాంలో అత్యాచారాలు నిత్యకృత్యంగా జరిగినా అసలేం జరగలేదని జగన్ రెడ్డి బుకాయించడాన్ని ప్రజలంతా చూశారు. అత్యాచారాలు అలా అనుకోకుండా జరుగుతుంటా యని, పిల్లల పెంపకంలో తల్లుల లోపం వుందని అప్పటి మహిళా హోం మంత్రి అన్న మాటలు యావత్తు మహిళా లోకాన్ని కించపరిచాయి. మహిళలకు రక్షణ కల్పించాల్సిన తమ బాధ్యతను తల్లుల పెంపకం పై నెట్టి తప్పించుకున్న విషయాన్ని జగన్ రెడ్డి గుర్తుకు తెచ్చుకోవాలి. ఆయన జమానాలో మహిళలకు రక్షణ అన్నది ఒక ప్రధాన సమస్యగా మారినందుకు సిగ్గుపడాలి. అభివృద్ధి అడుగంటి మానభంగాల పర్వంలో ఆంధ్రప్రదేశ్ పరుగులు తీసింది తమరి పాలనలోనే. దిశ పోలీసు స్టేషన్లు, దిశ వాహనాలు, దిశ యాప్‌లు అంటూ చేసిన ఆర్భాటం ప్రచార్భాటం కోసం తప్ప అకృత్యాలను అడ్డుకునేందుకు! చిత్తశుద్ధితో చర్యలు చేపట్టలేదు. తాను మహిళోద్ధరణ కోసమే జన్మించినట్టు బిల్డప్ ఇచ్చారు జగన్ రెడ్డి. ఆ 'దిశ' బిల్లు అసలు చట్టరూపం దాల్చలేదంటే జగన్ చిత్తశుద్ధి ఏ పాటిదో అర్థం అయ్యింది. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే 20 రోజుల్లో దోషులను నిర్ధారించి శిక్షలు వేస్తామని అసెంబ్లీలో దప్పు కొట్టుకున్నారు. కానీ 'దిశ' బిల్లును కేంద్రానికి పంపిస్తే తిరుగు టపాలో వెనక్కి వచ్చింది. దిశా బిల్లు చట్టరూపం దాల్చకుండానే చట్టం చేసేసి దాని కింద శిక్షలు కూడా పడ్డాయని ఉదరగొట్టి మహిళలను మభ్యపెట్టిన నీచ చరిత్ర జగన్ రెడ్డిదే.

**అత్యాచారాలకు,అఘాయిత్యాలకు అడ్డాగా మారిన రాష్ట్రం!**

రాష్ట్రాన్ని క్యాసినోలు, పబ్‌లు, జూదాలు అర్ధనగ్న ప్రదర్శనలకు వేదికగా మార్చడంతో మహిళా లోకం సిగ్గుతో తలదించుకోవాల్సి వచ్చింది. ఆడబిడ్డలకు రక్షణగా నిలవాల్సిన వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రి నిందితులకు అండగా నిలిచారు. మహిళల రక్షణపై ప్రభుత్వం దృష్టిపెట్టని కారణంగా ఆంధ్రప్రదేశ్ మహిళలపై అత్యాచారాలకు, అఘాయి త్యాలకు అడ్డాగా మారి రాష్ట్రం నేరాంధ్రప్రదేశ్ అయింది. జగన్ మాటిమాటికీ నా అక్క, చెల్లెమ్మలు అంటూ మురిపించారు తప్ప మరి అక్కచెల్లెమ్మలపై నిత్యం జరిగిన అఘాయిత్యాలపై మాత్రం నోరు విప్పలేదు. మహిళలు, దళితులు, గిరిజనుల మీద అత్యాచారాలు, హత్యలు, దాడులు అరికట్టడంపై శ్రద్ధ పెట్టి లేదు. ఇంటా,బయట మహిళలకు భద్రత కల్పించడంలో జగన్ ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. కోనసీమ జిల్లాలో 12ఏళ్ల బాలికపై ఐదుగురు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. శ్రీకాకుళం జిల్లాలో 8ఏళ్ల బాలికపై అత్యాచారం చేశారు.

విజయవాడలో యువతిని 11 కత్తిపోట్లు పొడిచి చంపారు. తాడేపల్లిలో తన ఇంటి సమీపంలోని సీతానగరంలో యువతిపై అత్యాచారం జరిగితే కనీసం స్పందించని నీకు మహిళల రక్షణ పై మాట్లాడే అర్హత ఉన్నదా జగన్ రెడ్డి? అమరావతి ఉద్యమంలో మహిళా రైతులు అని చూడకుండా కేసులు పెట్టడం, పోలీసులతో గొడ్లను బాదినట్లు బాదించడం, మహిళలను జుట్టు పట్టి ఈడుస్తూ పోలీసు వాహనాల్లో కుక్కడం, బూటు కాళ్లతో తన్నించడం, చున్నీలతో మహిళల గొంతు బిగించడం, మెడలో మంగళ సూత్రాలు లాగేయడం, గోళ్లతో రక్కడం, పెయిడ్ ఆర్టిస్టులు అని చులకన చెయ్యడం, నోటితో చెప్పలేని, రాయలేని విధంగా పోలీసులు దుర్భాషలాడుతున్నా పట్టించుకోక పైశాచిక ఆనందం పొందిన జగన్‌రెడ్డికి మహిళల రక్షణ గురించి మాట్లాడే అర్హత ఉందా? అమరావతి మహిళలపై సాగిన దౌర్జన్యకాండ దేశంలో ఎక్కడన్నా జరిగిందా? మీకు మహిళల పట్ల చెత్త శుద్ధి తప్ప చిత్త శుద్ధి ఉందా? మహిళలపైకి దుశ్శాసనులను ఉసిగొల్పి మహిళల రక్తం కళ్ల చూసిన చరిత్ర మీది కాదా జగన్మోహన్ రెడ్డీ!

**ప్రజాస్వామ్యాన్ని, పౌరహక్కులను నుగ్గునుగ్గు చేసిన చరిత్ర జగన్‌దే!**

తాలిబన్లను తలపించిన జగన్ పాలనలో ఎస్సీ, ఎస్టీలపై ఇష్టానుసారంగా దాడులకు తెగబడి ఎస్సీలు 192, ఎస్టీలు 58 మంది హత్యకు గురయిన విషయం గురించి జగన్ గుర్తు తెచ్చుకోవాలి. మీ వేధింపులు తాళలేక అబ్దుల్ సలాం కుటుంబం మొత్తం రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నా ఘటన కంటే ఘోరమైనది రాష్ట్రంలో మరొకటి ఉందా జగన్‌రెడ్డీ! ఇన్ని సంఘటనలు జరిగితే ఏనాడైనా ఒక్క బాధిత మహిళ వద్దకైనా వెళ్లి కనీసం పరామర్శించావా? కనీసం ఒక్కసారైనా ఖండించావా జగన్ రెడ్డి. ఒక్కరిపైన అయినా చర్యలు తీసుకున్నారా? నరసరావుపేటలో వక్ఫ్ ఆస్తులను కాపాడాలని కోరిన ఇబ్రహీంను నడిరోడ్డుపై చంపింది మీ పాలనలో కాదా.

మీ వైసీపీ నాయకుడు కూతురు కంటే చదువులో ముందంజలో ఉందని పలమనేరులో బాగా చదివే మిస్బా అనే పదో తరగతి విద్యార్థినిని వేధించడంతో ఆత్మహత్య చేసుకుంది. తన సోదరిని ఎందుకు వేధిస్తున్నారని ప్రశ్నించినందుకు 10వ తరగతి విద్యార్థినిపై పట్టపగలు పెట్రోలు పోసి తగులబెట్టింది మర్చిపోయావా జగన్‌రెడ్డీ? నెల్లూరులో సామూహిక అత్యాచారం, ఏలూరులో యాసిడ్ దాడి, ప్రకాశం జిల్లాలో దళిత మహిళ హనుమాయమ్మను ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపడం, మాస్కులు అడిగిన డాక్టర్, దళితుడైన సుధాకర్‌ను నడిరోడ్డుపై పెడరెక్కలు విరిచి, రోడ్డుపై ఈడ్చుకెళ్లి చనిపోయేలా చెయ్యడం, ఇసుక అక్రమ రవాణాను ప్రశ్నించిన వరప్రసాద్ అనే యువకుడికి పోలీస్ స్టేషన్లోనే గుండుకొట్టించడం. అధికార పార్టీ ఎమ్మెల్సీ దళిత యువకుడిని చంపి డోర్ డెలివరీ... ఇవన్నీ చెయ్యడం మీ పాలనలో శాంతి భద్రతలు కాపాడడంలో భాగమా జగన్ రెడ్డి? దళితులపై, బీసీ, మైనార్టీలపై దాడులు చేసినా, మహిళలపై దురాగతాలకు పాల్పడినా, శిరోముండనాలు చేసినా చర్యలు లేవు. వారు బిక్కుబిక్కుమంటూ బతకాల్సిన పరిస్థితి. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ)ని వైసీపీ పీనల్ కోడ్‌గా మార్చి రాజ్యాంగాన్ని, దానిపై చేసిన ప్రమాణాన్ని కాలరాసి, ప్రజాస్వామ్యాన్ని, పౌరహక్కులను నుగ్గునుగ్గు చేసి తాత, తండ్రి వారసత్వ ఫ్యాక్షన్ రాజకీయాలతో నరహంతక పాలన చేసిన జగన్ రెడ్డికి రూల్ ఆఫ్ లా, మహిళల రక్షణపై మాట్లాడటానికి సిగ్గు అనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

- నీరుకొండ ప్రసాద్




# క్రీడల్లో కొత్త శకం

## చంద్రబాబు విజన్‌తో క్రీడా రంగంలో ఆంధ్రప్రదేశ్‌కు స్వర్ణయుగం

ఒక రాష్ట్ర అభివృద్ధిని కొలవాలంటే కేవలం రోడ్లు, భవనాలు, పరిశ్రమలు మాత్రమే కాదు... ఆ రాష్ట్ర యువత ఎంత బలంగా ఉందో, వారి ప్రతిభకు ప్రభుత్వం ఎంత విలువ ఇస్తోందో కూడా చూడాలి. ఎందుకంటే నేటి యువతే రేపటి దేశ భవిష్యత్తు. ఆ యువతను క్రీడలవైపు మళ్లించడం అంటే ఆరోగ్యవంతమైన సమాజాన్ని, క్రమశిక్షణ కలిగిన తరాన్ని, ప్రపంచ స్థాయిలో పోటీపడే భారతీయులను తయారు చేయడమే. గత కొన్నేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లో క్రీడా రంగం ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదనే అభిప్రాయం చాలా మందిలో ఉండేది. మైదానాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. క్రీడా అకాడమీలు మూతపడ్డాయి. ప్రతిభ ఉన్నా అవకాశాలు లేక వేలాది మంది యువకులు తమ కలలను మధ్యలోనే వదిలేశారు. క్రీడల్లో కెరీర్ అంటే అనిశ్చితి అనే భావన ఏర్పడింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో క్రీడలను కూడా రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగంగా గుర్తించి అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. గత రెండేళ్లలో జరిగిన మార్పులు చూస్తే ఇది కేవలం క్రీడల శాఖ పని మాత్రమే కాదు... భవిష్యత్ తరాన్ని తీర్చిదిద్దే విజన్ అని అర్థమవుతుంది.




### మౌలిక వసతుల విప్లవం... రాష్ట్రవ్యాప్తంగా స్పోర్ట్స్ మౌలిక సదుపాయాలు

క్రీడాకారుడు తయారవ్వాలంటే ముందు సరైన మైదానం కావాలి. సరైన కోర్టు కావాలి. నాణ్యమైన శిక్షణా కేంద్రాలు ఉండాలి. ఈ అవసరాన్ని గుర్తించిన ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధిని ప్రారంభించింది. విజయనగరంలోని విజీ స్టేడియాన్ని రూ.6 కోట్ల వ్యయంతో ఆధునిక మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంగా అభివృద్ధి చేసి ప్రారంభించారు. తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో రూ.5.77 కోట్లతో అత్యాధునిక ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను పూర్తి చేశారు. ఇది అక్కడితో ఆగలేదు. ఖేలో ఇండియా పథకం ద్వారా రాష్ట్రానికి రూ.75 కోట్ల నిధులు సాధించి ఐదు ప్రధాన క్రీడా కేంద్రాల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రూ.19 కోట్లతో 400 మీటర్ల సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్, ఆర్టిఫిషియల్ టర్ఫ్ ఫుట్‌బాల్ గ్రౌండ్, టెన్నిస్ కోర్టులు, బాస్కెట్‌బాల్ కోర్టులు, ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. కుప్పంలో రూ.14కోట్లతో మల్టీపర్పస్ ఇండోర్ బ్లాక్ నిర్మిస్తున్నారు. శ్రీకాకుళంలో రూ.14 కోట్లతో ఇండోర్ స్పోర్ట్స్ హాల్ నిర్మాణం కొనసాగుతోంది. రాజమహేంద్రవరంలో రూ.13.76 కోట్లతో ఆధునిక మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణంలో ఉంది. గుంటూరులోని బ్రహ్మానందరెడ్డి స్టేడియాన్ని కూడా ఆధునిక ఇండోర్ స్టేడియంగా తీర్చిదిద్దుతున్నారు. ఇవి కేవలం భవనాలు కాదు... వేలాది మంది యువ క్రీడాకారుల భవిష్యత్తుకు పునాది.

### గ్రామం నుంచే ఛాంపియన్లు... ప్రతి నియోజకవర్గంలో క్రీడా వికాసం

గతంలో పెద్ద పట్టణాల్లో మాత్రమే క్రీడా సదుపాయాలు ఉండేవి. గ్రామీణ యువతకు అవకాశాలు చాలా తక్కువ. ఈ పరిస్థితిని మార్చేందుకు రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో క్రీడా మౌలిక వసతులు కల్పించే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పటికే కోట్ల రూపాయల వ్యయంతో క్రీడా వికాస కేంద్రాలు ఏర్పాటు చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లోనే ప్రతిభను వెలికితీసే ప్రయత్నం జరుగుతోంది. డజన్ల కొద్దీ కేంద్రాలు పూర్తి కాగా మరెన్నో పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇది గ్రామీణ యువతకు గొప్ప అవకాశం.

### ఉద్యోగాల్లో 3శాతం రిజర్వేషన్

క్రీడల్లో రాణించినా ఉద్యోగ భద్రత లేక చాలా మంది మధ్యలోనే ఆటను వదిలేసేవారు. ఈ పరిస్థితిని మారుస్తూ క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్‌ను 2 నుంచి 3 శాతానికి పెంచడం చారిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. దీనివల్ల వందలాది మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అవకాశం పొందారు. మెగా డీఎస్సీ ద్వారా కూడా క్రీడాకారులకు ప్రత్యేక అవకాశాలు కల్పించడం వల్ల ఎన్నో కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురించాయి. క్రీడ అంటే కేవలం పతకం కాదు... జీవితానికి భరోసా కూడా అని ప్రభుత్వం నిరూపించింది.

### పతకం సాధిస్తే ప్రభుత్వం వెన్నంటే...

క్రీడల్లో విజయం సాధించడం అంత సులభం కాదు. సంవత్సరాల తరబడి కఠిన సాధన చేయాలి. కుటుంబం కూడా ఎన్నో త్యాగాలు చేయాలి. అలాంటి క్రీడాకారుల కృషిని గుర్తిస్తూ ప్రభుత్వం జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పతకాలు సాధించిన వారికి కోట్ల రూపాయల నగదు ప్రోత్సాహకాలు అందించింది. వందలాది మంది క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా ప్రభుత్వం ఒక స్పష్టమైన సందేశం ఇచ్చింది. “మీరు ఆడండి... మీ వెనుక ప్రభుత్వం ఉంటుంది.”

### మళ్లీ తెరుచుకున్న క్రీడా అకాడమీలు

గతంలో మూతపడిన క్రీడా అకాడమీలు మళ్లీ ప్రారంభమయ్యాయి. విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి కేంద్రాల్లో శిక్షణ ప్రారంభమైంది. 13కు పైగా క్రీడా విభాగాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను తయారు చేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పతకాలు సాధించే లక్ష్యంతో శిక్షణ అందిస్తున్నారు.

### వేసవి శిబిరాలతో లక్షలాది యువతకు కొత్త అవకాశం

ప్రతి వేసవిలో రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో స్పోర్ట్స్ కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. వేలాది మంది పిల్లలు, యువత పాల్గొని నాణ్యమైన శిక్షణ పొందుతున్నారు. గతంలో సెలవులు అంటే ఇంట్లో గడిపే పరిస్థితి ఉండేది. ఇప్పుడు వేసవి అంటే క్రీడా శిబిరాలు... కోచ్‌ల శిక్షణ... కొత్త కలలు.

### జాతీయ స్థాయి టోర్నమెంట్లకు ఆతిథ్యం

రాష్ట్రంలో గత రెండేళ్లలో అనేక ప్రతిష్టాత్మక టోర్నమెంట్లు నిర్వహించడం మరో విశేషం. అమరావతి ఛాంపియన్‌షిప్, రాష్ట్ర స్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీలు, బీచ్ వాలీబాల్, బీచ్ కబడ్డీ, వివిధ జాతీయ పోటీలను విజయవంతంగా నిర్వహించడం వల్ల క్రీడా పటంలో ఆంధ్రప్రదేశ్ మరోసారి ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. గ్రామీణ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు లీగ్ క్రీడలు నిర్వహిస్తూ చెస్, సైక్లింగ్, అథ్లెటిక్స్, టెన్నిస్, బాక్సింగ్, ఫుట్‌బాల్, వాటర్ స్పోర్ట్స్ వంటి అనేక క్రీడలకు ప్రోత్సాహం అందిస్తున్నారు.

### భవిష్యత్తు లక్ష్యం... ఒలింపిక్స్ వైపు అడుగులు

ఇప్పటి అభివృద్ధి ఇక్కడితో ఆగడం లేదు. అమరావతిలో ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ సిటీ, హై-పర్‌ఫార్మెన్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు ప్రారంభమయ్యాయి. తిరుపతిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. విశాఖలో వాటర్ స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది.




పాఠశాల స్థాయి నుంచే ప్రతిభను గుర్తించి ఒలింపిక్స్‌కు సిద్ధం చేసే విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

### చంద్రబాబు విజన్... క్రీడల్లోనూ ఫలిస్తోంది

చంద్రబాబునాయుడు ఎప్పుడూ ఒక మాట చెబుతారు. “యువతే రాష్ట్ర భవిష్యత్తు.” అని. ఆ ఆలోచన ఇప్పుడు క్రీడా రంగంలో స్పష్టంగా కనిపిస్తోంది.

మౌలిక వసతులు...
అవకాశాలు...
ఉద్యోగ భరోసా...
నగదు ప్రోత్సాహకాలు...
అకాడమీలు...
జాతీయ స్థాయి పోటీలు...
ఒలింపిక్ లక్ష్యాలు...

ఇవన్నీ కలిసి చూస్తే క్రీడలను ఒక హాబీగా కాకుండా... ఒక కెరీర్‌గా, ఒక గౌరవప్రదమైన జీవన మార్గంగా మార్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

### రెండేళ్ల నమ్మకం... రేపటి స్వర్ణయుగానికి పునాది

గత రెండేళ్లలో జరిగిన మార్పులు ఒక విషయం స్పష్టంగా చెప్తున్నాయి. క్రీడా రంగాన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రతిభ కనుమరుగవుతుంది. ప్రోత్సహిస్తే ప్రపంచ ఛాంపియన్లు తయారవుతారు. ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న మార్పులు అదే దిశగా ఉన్నాయి. గ్రామీణ యువకుడి చేతిలో బ్యాట్, బంతి, రాకెట్, జావెలిన్, బాక్సింగ్ గ్లౌజ్ లేదా చెస్ బోర్డు కనిపిస్తే... అది కేవలం ఒక ఆట కాదు...
ఒక కుటుంబం కల, ఒక రాష్ట్రం ఆశ,
ఒక దేశం గర్వం.

“రెండేళ్ల నమ్మకం” కేవలం సంక్షేమం, అభివృద్ధిలోనే కాదు... క్రీడల్లో కూడా ఒక కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టిందని చెప్పడానికి ఈ రెండేళ్ల విజయాలే నిదర్శనం. రాబోయే మూడు సంవత్సరాల్లో ఈ ప్రయాణం మరింత వేగం అందుకుంటే జాతీయ స్థాయిలోనే కాదు, అంతర్జాతీయ వేదికలపై కూడా ఆంధ్రప్రదేశ్ యువత మరిన్ని పతకాలు సాధించి రాష్ట్ర గౌరవాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే రోజు ఎంతో దూరంలో లేదనే ఆశ ప్రతి యువకుడిలో కనిపిస్తోంది.



**శశికుమార్**
తెలుగుదేశం సైనికుడు



## పార్కుల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా పచ్చదనం పెంపొందించాలి

**●మియావాకి పార్కులను అభివృద్ధి చేసేలా ప్రణాళిక సిద్ధం చేయాలి**



విశాఖపట్నం (చైతన్యరథం): నగర వాసులు పచ్చదనం ఉండే పార్కుల్లో ఎక్కువ సమయాన్ని గడిపేందుకు ఆసక్తి చూపుతున్నారని, అందువల్ల వీఎంఆర్డీఏ పరిధిలోని అన్ని పార్కుల్లో వాకర్స్, సందర్శకులకు ఆహ్లాదాన్ని అందించేలా పచ్చదనం పెంపొందించాలని వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్ ఆదేశించారు. శనివారం ఉదయం వీఎంఆర్డీఏ కార్యాలయంలో అటవీశాఖ విభాగ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నగర పరిధిలో 50 పార్కులను అభివృద్ధి చేసి, పచ్చదనం పెంపొందించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎంవీపీకాలనీలో ఉన్న వీఎంఆర్డీఏ నర్సరీని ప్రైవేటు నర్సరీలతో పోటీ పడేలా అభివృద్ధి చేయాలని, నర్సరీ గురించి విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. నగర పరిధిలో తక్కువ స్థలంలో ఎక్కువ పచ్చదనం పెంపొందించి, అటవీ ప్రాంతంగా తీర్చిదిద్దే మియావాకీ పార్కులను సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ప్రధానంగా వీఎంఆర్డీఏకి చెందిన లేఅవుట్లలో పచ్చదనం పెంపొందించే ఏర్పాట్లు చేయాలన్నారు. భోగాపురం విమానాశ్రయానికి చేరుకునేందుకు వీఎంఆర్డీఏ అభివృద్ధి చేసిన ప్రధాన రహదారుల విభాగిని మధ్యలో పచ్చదనం పెంపొందించేలా ఏపుగా పెరిగే చెట్లను పెంచాలని, ఆకర్షణీయంగా కనిపించేలే చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మురళీకృష్ణ, డీఎఫ్ఓ ఎ.వి.రమణమూర్తి, ఎఫ్ ఆర్ ఓ శిరీష, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



పార్వతీపురం (చైతన్యరథం): పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన భద్రగిరి 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే శ్రీమతి తోయక జగదీశ్వరి శనివారం నాడు పరిశీలించారు. ఈ నెల 22వ తేదీన ఆసుపత్రి ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో భవనంలో చేపట్టాల్సిన పెండింగ్ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆసుపత్రి ప్రారంభానికి ముందే మిగిలిన అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో అవసరమైన అన్ని వైద్య సౌకర్యాలు, మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రోగులను తీసుకువచ్చే అంబులెన్స్‌లు, ఇతర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రహదారులు, పార్కింగ్ సదుపాయాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. గుమ్మలక్ష్మీపురం ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఈ 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట కురుపాం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్ పర్సన్ కద్రక కళావతి, అరకు పార్లమెంట్ సహాయ కార్యదర్శి తాడంగి రామారావు, మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్, సిహెచ్సి వైద్యులు తదితరులు ఉన్నారు.

## ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటించాలి : ఎమ్మెల్యే వెలగపూడి



విజయవాడ తూర్పు (చైతన్యరథం): స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు 17వ వార్డు పరిధిలోని రెండు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న పథకాల గురించి, ఇస్తున్న పౌష్టికాహారం, యోగక్షేమాల గురించి టీచర్లను, పిల్లలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల్లోని మౌలిక వసతులు, శుభ్రతను పరిశీలించారు. అనంతరం Bulk Waste Generator - BWG నిబంధనలపై అంగన్వాడీ టీచర్లు మరియు ఆయాలకు అవగాహన కల్పించారు. చెత్తను వేరుచేసి పడేయడం, స్వచ్ఛతను పాటించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కాళ్ళ శంకర్, గేదెల నాగరాజు, బైరెడ్డి పోతనరెడ్డి, రాము, మెరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ విధానంతో పారదర్శకంగా ఎరువుల పంపిణీ

**●అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం.. డిజిటల్ విధానంతో పారదర్శకంగా ఎరువుల పంపిణీ**

**●ఖరీఫ్‌కు సమృద్ధిగా ఎరువులు.. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు**

**●రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



కోటబొమ్మాళి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అన్నదాతలకు అండగా ఉండేందుకు, ఖరీఫ్‌లో ఎరువుల కొరత అన్నది రాకుండా ఉండేందుకు డిజిటల్ విధానాన్ని అందుకుని, బ్లాక్ మార్కెట్లకు ఎరువులు తరలి పోకుండా డిజిటల్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నేతృత్వంలో పారదర్శకతే ప్రాధాన్యమని భావిస్తూ నిరంతరం సంబంధిత ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. గతంలో మాదిరిగా కాకుండా ఎవ్వరికీ ఏ ఇబ్బంది లేకుండా Andhra Pradesh Agriculture Information Management System 2.0 (అపైమ్స్ 2.0) అనే డిజిటల్ విధానాన్ని తీసుకుని వచ్చి అర్హులయిన ప్రతి ఒక్కరికీ ఎరువులు పంపిణీ చేస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ముఖ్యంగా ప్రస్తుత ఖరీఫ్‌కు శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి 37 వేల టన్నులకు పైగా (37,707) యూరియా అవసరం కాగా సిద్ధంగా ఉన్నాయని, ఇప్పటికే (20,966 ) యూరియా జిల్లాకు చేరుకుందని అధికారులు స్పష్టం చేశారు.

### అర్హత అనుసరించి పంపిణీ

రైతుల భూ వివరాలు, పంట రకం, సాగు విస్తీర్ణాన్ని అనుసరించి శాస్త్రీయ సిఫారసుల మేరకే ఈ డిజిటల్ వ్యవస్థ ద్వారా ఎరువుల అర్హతను లెక్కించి పంపిణీ చేస్తున్నామని, ఒకవేళ ఎవ్వరైనా ఆన్లైన్లో నమోదు కాకపోతే ఆందోళన చెందాల్సిన పని లేదని భరోసా ఇచ్చారు. ఆన్లైన్లో నమోదు కాని వారి వివరాలను ప్రత్యేకంగా నమోదు చేసి ఎరువులు అందించేలా ప్రభుత్వం తగిన సదుపాయం కల్పించిందన్నారు. వీరి వివరాలు ప్రత్యేకంగా నమోదు చేస్తామన్నారు.

### నిరంతరం అధికారులతో సమీక్షలు

రాష్ట్రంలోని ప్రతి సాగుదారుడికీ సకాలంలో, పారదర్శకంగా ఎరువులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. Andhra Pradesh Agriculture Information Management System 2.0 (అపైమ్స్ 2.0) నూతన డిజిటల్ విధానాన్ని రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాలు, ప్రైవేటు ఎరువుల డీలర్లతో అనుసంధానించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా ఎరువుల కొరత లేకుండా అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీ ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ఈ అత్యాధునిక సాంకేతికత ద్వారా నిల్వలు, విక్రయాలను ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తుందని, దీనివల్ల బ్లాక్ మార్కెట్ నియంత్రణకు, అక్రమ మళ్లింపులకు పూర్తిగా అడ్డుకట్ట పడుతుందని మంత్రి భరోసా ఇచ్చారు.

### బ్లాక్ మార్కెట్టుపై కొరడా..పారదర్శకతకు ప్రాధాన్యం

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన 37,707 మెట్రిక్ టన్నుల యూరియాలో ఇప్పటికే 20,966 మెట్రిక్ టన్నులు చేరాయి. ఇప్పటివరకు 8,041 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేయగా, రైతు సేవా కేంద్రాల వద్ద మరో 5,105 మెట్రిక్ టన్నుల నిల్వలు అందుబాటులో ఉన్నాయి. 386 రైతు సేవా కేంద్రాలు, 36 సహకార సంఘాలు, 7 డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా పంపిణీ కొనసాగుతోంది. త్వరలో మరో 12,925 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు చేరనుండగా, మొత్తం అవసరాలను తీర్చేందుకు మిగిలిన 16,741 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కూడా దశలవారీగా అందుబాటులోకి రానుంది. జిల్లాకు ఇంకా రావలసిన మిగిలిన కోటాను కూడా త్వరితగతిన రప్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

## ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి : మంత్రి కొండపల్లి



విజయనగరం (చైతన్యరథం): ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. శ్రీకాకుళంలో నిర్వహించే 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమానికి తప్పక హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ డీఈవో రవిబాబు.. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ను శనివారం విజయనగరంలోని మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం, మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో దేశంలోనే ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మెరుగైన విద్యకు దిక్సూచిగా మారాలని చేసే ప్రయత్నంలో ఉపాధ్యాయులు, అధికారులు భాగస్వాములు కావాలని కోరారు. శ్రీకాకుళం జిల్లాలో పదో తరగతికి చెందిన 187 మంది, ఇంటర్మీడియట్కు చెందిన 37 మంది విద్యార్థులను షైనింగ్ స్టార్స్ ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ చంద్రభూషణ్, సన్యాసిరాజు పాల్గొన్నారు.

## నర్సీపట్నంలో ఘనంగా వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ ప్రారంభోత్సవం

**●అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం.. దశాబ్దాల డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం: చింతకాయల పద్మావతి**



నర్సీపట్నం (చైతన్యరథం): పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 నిధులతో లింగాపురం బ్రిడ్జి డంపింగ్ యార్డ్ వద్ద రూ.305 లక్షల వ్యయంతో నిర్మించిన తడి, పొడి వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఘనంగా ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుడివాడ నుంచి వర్చువల్ విధానంలో దీనిని ప్రారంభించగా, స్థానికంగా జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, శాసనసభ స్పీకర్ సతీమణి చింతకాయల పద్మావతి చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా చింతకాయల పద్మావతి మాట్లాడుతూ, నర్సీపట్నం మున్సిపాలిటీని గ్రేడ్-1గా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో 28 వార్డులు డంపింగ్ యార్డులుగా మారాయని ఆవేదన వ్యక్తం చేసిన ఆమె, కూటమి ప్రభుత్వం ఏర్పడగానే స్పీకర్ అయ్యన్నపాత్రుడి చొరవతో సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. జిందాల్ కంపెనీకి చెత్త ప్రాసెసింగ్ బాధ్యతలు అప్పగించామని, వీఎంఆర్డీఏ నుంచి రూ.4 కోట్ల 11 లక్షలు, స్వచ్ఛ ఆంధ్ర నుంచి రూ.3 కోట్ల 5 లక్షల నిధులు మంజూరు చేయించామని గుర్తు చేశారు. గత రెండేళ్లలో మౌలిక సదుపాయాల కోసం రూ.32 కోట్లు వెచ్చించామని, చెత్త సేకరణకు వాహనాలు, పుష్ కార్టులు సమకూర్చామని ఆమె వివరించారు. డంపింగ్ యార్డ్ వద్ద రిటైనింగ్ వాల్ లేకపోవడం వల్ల వర్షాకాలంలో ఉత్తరవాహిని నది కలుషితం అవుతోందని, వెంటనే వాల్ నిర్మించాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు చింతకాయల రాజేష్ ఈ సందర్భంగా కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ విజయకృష్ణన్, రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నర్సీపట్నం గ్రేడ్-1 అయినందుకు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆమె, ప్రజలంతా తడి, పొడి చెత్తను విభజించి పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాలని, పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి లాలం కాశీ నాయుడు, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ సూర్యచంద్ర, మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, ఆర్డీవో వి.వి. రమణ, తహశీల్దార్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తవలసలో 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర'... పాల్గొన్న ఎమ్మెల్యే కోళ్ల లలిత



కొత్తవలస (చైతన్యరథం): స్థానిక సబ్బవరం రోడ్డులోని నూకాలమ్మ అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతంలో 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర' కార్యక్రమం శనివారం అత్యంత ఉత్సాహంగా జరిగింది. పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గ శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే ఆరోగ్యకరమైన సమాజ స్థాపన సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర' లక్ష్య సాధనలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దాసరి కార్పొరేషన్ ఛైర్మన్ పొట్నూరి రత్నాజీ ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.

## కాకినాడ నగరంలో భారీ వర్షం... లోతట్టు ప్రాంతాలు జలమయం



కాకినాడ (చైతన్యరథం): కాకినాడ నగరంలో శనివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. సుమారు 4 గంటలపాటు కురిసిన వర్షానికి ప్రధాన రహదారులతోపాటు కాలనీ వీధులు, లోతట్టు ప్రాంతాలు జలమయయ్యాయి. ప్రధానంగా శాంతినగర్, కొత్తకాకినాడ కూడలి, కొత్తపేట మార్కెట్, గొడారిగుంట, వెంకట్నగర్, పెద్ద మార్కెట్ వీధి తదితర ప్రాంతాలన్నీ పూర్తిగా జలమయమయ్యాయి. మార్కెట్లో గంటల తరబడి వర్షం నీరు నిలిచిపోవడంతో వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాలువలు నిండిపోయి మురుగంతా రోడ్డుపైకి చేరింది. ఇక ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంతోపాటు వెనుక వైపు ప్లాట్ఫామ్ల వద్ద వర్షం నీరు నిలిచింది. బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు ఒకింత ఇబ్బందులకు గురయ్యారు.

## స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర సాధనకు చేయిచేయీ కలుపుదాం

●ఆదర్శ కార్యక్రమంగా స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర : ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి



రంపచోడవరం (చైతన్యరథం): ఆరోగ్యకర సమాజ స్థాపన సుస్థిరాభివృద్ధి సాధన దిశగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ ఛైర్ పర్సన్ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రంప చోడవరం అంబేడ్కర్ కూడలి వద్ద శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రలో భాగంగా స్వచ్ఛత దినోత్సవం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ సంయుక్త కలెక్టర్ ప్రశాంత్ కుమార్ల సౌజన్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమెకు అధికార యంత్రాంగం సాదర స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతీ పల్లెల్లోనూ పరిశుభ్రత పాటించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆరోగ్యకర సమాజంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. గృహ వినియోగదారులు, షాపు యజమానులు ఇలా వ్యర్థాలు బయట పాడేయ కుండా ఒక పద్ధతి ప్రకారం చెత్తను నిల్వచేయాలని అందులోనూ తడి, పొడి చెత్తలను వేర్వేరుగా నిల్వచేయాలన్నారు. అలాగే ఇంట్లో వ్యర్థాలను సైతం నేరుగా కొనుగోలు, వస్తు మార్పిడి ద్వారా సేకరిస్తు న్నట్లు పేర్కొన్నారు. తద్వారా మెరుగైన పద్ధతులు ద్వారా చెత్త ద్వారా సంపద కూడా సృష్టించే విధానాలు ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ ఇంటికీ వెళ్ళి చెత్తను వ్యర్థాలను సేకరించేందుకు వాహనాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఈ విధానాన్ని కనీసం పట్టించు కోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఆదర్శ విధానానికి మళ్లీ పుంజుకునేట్లు ప్రభుత్వ పరంగా చేస్తున్నట్లు పేర్కొన్నారు. కేవలం ఇది ఒక ప్రభుత్వం బాధ్యతగా కాకుండా ప్రతీ పౌరుడు, స్వచంద సంస్థలు నైతిక బాధ్యతగా వ్యవహ రించాలని కోరారు. అందరూ సమష్టిగా ఉంటూ స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రకు కంకణబద్దులుగా ఉండాలని కోరారు.

## సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, విద్యా సామగ్రి పంపిణీ

●పూల బొకేలకు బదులుగా విద్యార్థులకు ఉపయోగపడే నోట్‌బుక్స్ అందించాలన్న ఎంపీ సానా సతీష్ బాబు పిలుపుకు విశేష స్పందన



కాకినాడ (చైతన్యరథం): రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు ఇటీవల కాకినాడ పర్యటన సందర్భంగా తనను మర్యాదపూర్వకంగా కలిసేందుకు వచ్చే నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూల బొకేలకు బదులుగా పేద విద్యార్థులకు ఉపయోగపడే నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్స్, పరీక్షా ప్యాడ్స్ తీసుకురావాలని చేసిన వినూత్న పిలుపుకు విశేష స్పందన లభించింది. ఆ పిలుపుకు స్పందించిన ప్రజలు, నాయకులు, అభిమానులు అందించిన నోట్‌బుక్స్, ఇతర విద్యా సామగ్రిని సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో దశలవారీగా విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారు. గత వారం నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సుమారు రూ.50 వేల విలువ చేసే 3,000 నోట్‌బుక్స్‌తో పాటు పెన్నులు, పెన్సిల్స్, ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేయగా, నేడు కరప గురుకుల పాఠశాల విద్యార్థులకు మరో 1,000 నోట్‌బుక్స్, విద్యా సామాగ్రిను పంపిణీ చేశారు. అదేవిధంగా, విద్యార్థుల టీ-షర్టులు కొనుగోలు చేయడంతో పాటు ఇతర అత్యవసర అవసరాల కోసం రూ.10 వేలు ఆర్థిక సాయం కూడా ఫౌండేషన్ తరఫున ప్రకటించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ... "పూల బొకేలు క్షణికానందాన్ని మాత్రమే ఇస్తాయి.. కానీ ఒక నోట్‌బుక్ విద్యార్థి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుంది" అనే ఆలోచనతో ఎంపీ సానా సతీష్ బాబు ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. సమాజంలో విద్యకు ప్రాధాన్యత కల్పించే ఈ కార్యక్రమానికి ప్రజలు, నాయకులు, అభిమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన సమయంలో అండగా నిలవడం, విద్య, ఆరోగ్యం, సామాజిక సేవ రంగాల్లో మరిన్ని ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టి సమాజానికి మరింత సేవ చేయడమే సానా సతీష్ బాబు ఫౌండేషన్ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఛైర్మన్ తలాటం హరీష్, ఎంపీ కార్యాలయ ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు దేవు వెంకన్న, కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి నారాయ్య( తాతీలు) ఫౌండేషన్ సభ్యులు ముమ్మిడి వెంకటేశ్వరరావు, ఎంపీ కార్యాలయ సిబ్బంది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.56 కోట్ల అమృత్ నీటి పథకానికి భూమి పూజ

●చింతలపూడి ప్రజల దాహార్తి తీరనుంది... శాశ్వత త్రాగునీటి పరిష్కారం

●15 ఏళ్లకు సరిపోయేలా చింతలపూడిలో కొత్త వాటర్ పథకం

●100 పడకల ఆసుపత్రి, నర్సింగ్ కళాశాలకు ఎమ్మెల్యే రోషన్ కుమార్ హామీ



చింతలపూడి (చైతన్యరథం): చింతలపూడి పట్టణంలో దీర్ఘకాలంగా ఉన్న త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. అమృత్ పథకం కింద రూ.56 కోట్ల వ్యయంతో చేపట్టనున్న త్రాగునీటి సరఫరా పథకానికి చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్ శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పట్టణంలోని అన్ని ప్రాంతాలకు నిరంతరాయంగా శుద్ధి చేసిన త్రాగునీటిని అందించేందుకు 5 రక్షిత నీటి ట్యాంకులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ముందుచూపుతో రాబోయే 15 సంవత్సరాల వరకు అవసరాలకు సరిపోయే విధంగా ఈ పథకాన్ని రూపొందించినట్లు చెప్పారు. ప్రతి ఇంటికి కుళాయి ద్వారా నాణ్యమైన నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, దీనితో పట్టణ ప్రజల దాహార్తి పూర్తిగా తీరుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మరికొన్ని అభివృద్ధి హామీలు ఇచ్చారు. చింతలపూడిలో త్వరలో 100 పడకల ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు, అదేవిధంగా నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. నియోజకవర్గ అభివృద్ధికి తాను అంకితమని, ప్రజల అవసరాలను గుర్తించి రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు రోషన్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమృత్ డైరెక్టర్ పాండురంగారావు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నిర్ణీత వ్యవధిలోగా సమస్యలు పరిష్కరించాలి

●అధికారులకు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు సూచన



మైలవరం (చైతన్యరథం): ప్రజల సమస్యలను నిర్ణీత వ్యవధిలోగా పరిష్కరించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు అధికారులను ఆదేశించారు. ప్రజాదర్బార్‌లో స్వీకరించిన అర్జీల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదన్నారు. జి.కొండూరులోని కమ్యూనిటీ హాల్‌లో శనివారం నిర్వహించిన 'ప్రజాదర్బార్' కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణప్రసాదు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, ప్రతి సమస్యను ఓపిగ్గా విన్నారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉండే పారదర్శక పాలన అందిస్తోందని, దానికి ప్రజాదర్బార్ కార్యక్రమమే నిదర్శనమని అన్నారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ, రైస్ కార్డులు, ఉపాధి, పెన్షన్లు, దివ్యాంగుల ధ్రువపత్రాలు, తాగునీటి పైప్‌లైన్లు, భూ సమస్యలు, రహదారుల అభివృద్ధి, రెవెన్యూ మరియు పోలీసు సేవలకు సంబంధించిన అనేక అర్జీలు అందినట్లు తెలిపారు. ప్రజాదర్బార్ వేదికపై అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసి జవాబుదారీతనంతో పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి




కొవ్వూరు (చైతన్యరథం): కొవ్వూరు పట్టణంలోని పీఎం.ఎం.ఎం.ఎం హై స్కూల్‌లో నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రమైన పరిసరాల ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకుని, స్వచ్ఛమైన సమాజ నిర్మాణానికి బాధ్యతాయుతంగా సహకరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం విజన్‌తో 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' విప్లవం

**●వినుకొండను చెత్త రహితంగా, సుందరంగా తీర్చిదిద్దుదాం**

**●ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి: ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు**



వినుకొండ (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆలోచనలు, ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా అమలవుతున్న 'స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో పెను మార్పులకు నాంది పలికిందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో ఆయనలో "స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణాంధ్ర" కార్యక్రమంపై తన అభిప్రాయాలు పంచుకున్నారు. ఇది కేవలం పారిశుద్ధ్య కార్యక్రమం మాత్రమే కాదని, రాష్ట్రాన్ని ఆర్థికంగా, పర్యావరణపరంగా బలోపేతం చేసే మహా యజ్ఞమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతతో రాష్ట్రంలో పేరుకుపోయిన చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా వ్యూహాత్మక చర్యలు చేపట్టారని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో తడి చెత్త, పొడి చెత్తను శాస్త్రీయంగా వేరు చేసి సేకరించే ప్రక్రియను వేగవంతం చేశామన్నారు. చెత్త నుంచి సంపద సృష్టించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ క్రమంలో విశాఖపట్నంలో విజయవంతంగా నడుస్తున్న నమూనాలోనే రాజమండ్రి, కర్నూలు, కడప, నెల్లూరు నగరాల్లో సుమారు రూ.1,254 కోట్ల వ్యయంతో వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి త్వరలోనే ప్రారంభం కానుందని చెప్పారు. రాబోయే మార్చి నెలాఖరు నాటికి రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, వంద శాతం గ్రామ పంచాయతీల్లో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ పూర్తిస్థాయిలో జరిగేలా స్వచ్ఛ రథాలను వినియోగిస్తున్నామని జీవీ ఆంజనేయులు వివరించారు. ఈ పారిశుద్ధ్య విప్లవం భూగర్భ జలాలను కలుషితం కాకుండా కాపాడటంతో పాటు ప్రజారోగ్యాన్ని మెరుగుపరుస్తుందని, సంపూర్ణ స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు బలమైన పునాది వేస్తుందని పేర్కొన్నారు. గత ఐదేళ్ల విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధునిక సాంకేతిక రంగాల్లో పెట్టుబడులను తీసుకురావడంతో పాటు, ప్రజలకు ఇచ్చిన సంక్షేమ హామీలను అమలు చేస్తూనే పర్యావరణ పరిరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చారని కొనియాడారు.

# రైతులకు న్యాయం జరిగేలా చర్యలు

**●అల్లూరుపాడులో రీ-సర్వేపై గ్రామసభ నిర్వహణ : ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్**



జగ్గయ్యపేట (చైతన్యరథం): వత్సవాయి మండలం, అల్లూరుపాడు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన రీ-సర్వే కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ గ్రామసభలో వత్సవాయి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, వత్సవాయి మండల తహసీల్దార్ జి.వెంకటేశ్వరావు, డిప్యూటీ తహసీల్దార్, రీ-సర్వే అధికారులు, మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ... అల్లూరుపాడు గ్రామం ఇనాం గ్రామంగా నమోదు చేయబడి ఉన్నందున, ప్రస్తుతం ప్రభుత్వం చేపడుతున్న రీ-సర్వే ప్రక్రియలో భూముల ధ్రువీకరణను పారదర్శకంగా నిర్వహించి, రైతులు వాస్తవంగా సాగు చేస్తున్న భూములకు చట్టబద్ధంగా రైతువారి పేర్లపై పట్టాలు మంజూరు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జి. వెంకటేశ్వరావు మాట్లాడుతూ... రీ-సర్వే ప్రక్రియలో రైతులు అధికారులకు పూర్తి సహకారం అందించాలని, అవసరమైన పత్రాలు మరియు ఆధారాలు సమర్పించి తమ భూముల వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు భూముల ధ్రువీకరణ పారదర్శకంగా నిర్వహించి, అర్హులైన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామస్థులు రీ-సర్వేకు సంబంధించిన సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకోగా, అధికారులు రీ-సర్వే విధానం, భూముల ధ్రువీకరణ ప్రక్రియ మరియు పట్టాల మంజూరు విధానంపై వివరించారు. గ్రామసభ విజయవంతంగా ముగియగా, రైతులు ప్రభుత్వ రీ-సర్వే కార్యక్రమానికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

# విజయవాడ విమానాశ్రయానికి మహర్దశ

**◆ఏటీసీ టవర్-కమ్-టెక్నికల్ బ్లాక్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు**



విజయవాడ (చైతన్యరథం): కృష్ణాజిల్లా (గన్నవరం ఎయిర్పోర్ట్) విజయవాడ విమానాశ్రయంలో కొత్తగా నిర్మించిన ఏటీసీ టవర్-కమ్-టెక్నికల్ బ్లాక్‌ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు ప్రారంభించారు ముఖ్యంగా విమానాశ్రయం యొక్క విమాన ట్రాఫిక్ నిర్వహణ సామర్థ్యాలను బలోపేతం చేయడానికి మరియు ఈ ప్రాంతం యొక్క పెరుగుతున్న కార్యాచరణ అవసరాలకు మద్దతు ఇవ్వడానికి ఈ అత్యాధునిక సదుపాయం అభివృద్ధిని ఏర్పాటు చేశారు. ఇప్పటికే ప్రాజెక్ట్ విజయవంతంగా పూర్తి చేసి సంబంధిత అధికారుల నుండి తప్పనిసరి అయిన అన్ని చట్టబద్ధమైన, కార్యాచరణ మరియు నియంత్రణ అనుమతులను పొందింది. ఈ సదుపాయం ఎయిర్ ట్రాఫిక్ సర్వీసెస్ కమ్యూనికేషన్, నావిగేషన్ మరియు సర్వైలెన్స్ విధులు, మరియు ఇతర అనుబంధ సాంకేతిక కార్యకలాపాలకు అవసరమైన ఆధునిక మౌలిక సదుపాయాలు మరియు అధునాతన కార్యాచరణ వ్యవస్థలతో కూడి ఉండనుంది విజయవాడ విమానాశ్రయంలో కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచడానికి, వివిధ సాంకేతిక సేవల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడానికి, మరియు విమాన రాకపోకల కార్యకలాపాలను సురక్షితంగా, సమర్థవంతంగా నిర్వహించడానికి ఒక పటిష్టమైన వేదికను అందించేందుకు కొత్త ఏటీసీ టవర్-కమ్-టెక్నికల్ బ్లాక్‌ను నేరుగా ఎంపీ చిన్నితో కలిసి కేంద్ర మంత్రి పరిశీలించారు.

# స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలి

**●స్వచ్ఛమైన విజయవాడ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి : ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు**



విజయవాడ (చైతన్యరథం): సెంట్రల్ నియోజకవర్గం 64వ, డివిజన్ BV సుబ్బారెడ్డి హైస్కూల్ నందు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర" కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల 3వ శనివారం నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకు పరిశుభ్రమైన పరిసరాలు అత్యంత అవసరమన్నారు, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నివాస ప్రాంతాల పరిశుభ్రత కోసం కోట్ల రూపాయలు వెచ్చిస్తూ, విజయవాడ నగర పాలక సంస్థ ద్వారా అవసరమైన అన్ని వనరులు, డంపర్ బిన్లు, వాహనాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచామని... పారిశుద్ధ్య కార్మికులు, మున్సిపల్ సిబ్బంది, డ్వాక్రా మహిళలు ప్రతిరోజూ తెల్లవారుజాము నుంచే ప్రజల ఆరోగ్యం కోసం ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్నారని, వారి సేవలు అభినందనీయమని, వర్షాకాలంలో దోమల వ్యాప్తి, లార్వా పెరుగుదలను అరికట్టేందుకు ప్రజలు తమ ఇళ్లలో, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని సూచించారు. చెత్తను శాస్త్రీయంగా నిర్వహించి, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తూ సంపద సృష్టించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, పరిశుభ్రత సాధనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

# రాము అద్భుతంగా పనిచేస్తున్నాడు... సీఎం చంద్రబాబు ప్రశంస

**● స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ గుడివాడ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**



గుడివాడ (చైతన్యరథం): గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం ప్రాంగణంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ గుడివాడలో భాగంగా నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమం శనివారం దిగ్విజయంగా జరిగింది. సభకు భారీ సంఖ్యలో ప్రజలు, కూటమి శ్రేణులు హాజరై హర్షం వ్యక్తం చేశారు. సభలో ముందుగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ "నేడు గుడివాడకు పండుగ రోజన్నారు. అభివృద్ధి ప్రదాత, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకునే చంద్రబాబు గుడివాడకు రావడం సంతోషకరం" అన్నారు. కూటమి ప్రభుత్వానికి అత్యంత కీలకమైన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని గుడివాడలో నిర్వహించడం గర్వకారణమన్నారు. సీఎం స్ఫూర్తితో స్వచ్ఛ గుడివాడ కోసం నడుం కట్టి పట్టణంలోని ప్రధాన ప్రాంతాలు, 94 చెత్త ప్రదేశాలను తొలగించి శుభ్రం చేశామని తెలిపారు. "ఇది నేను ఒక్కడినే సాధించిన ఘనత కాదనీ, అధికారులు, ప్రజలు అందరం కలిసి సాధించిన విజయం అని పేర్కొన్నారు. గుడివాడలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది అని రాము పేర్కొన్నారు. ప్రధాన సెంటర్‌లో ఏర్పాటు చేసిన 'ఐ లవ్ గుడివాడ' బోర్డు వద్ద సీఎంతో కలిసి ఫోటో దిగామని, సీఎం పలు సూచనలు చేసి ఆనందించారని చెప్పారు. 292 కోట్లతో గుడివాడ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ట్యాంకర్లు లేకుండా ఇంటింటికి నీళ్లు ఇస్తున్నామని వివరించారు. మున్సిపల్ దుకాణాల అద్దెను 30% నుంచి 7%కి తగ్గించడంతో వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. బటన్ నొక్కే సంస్కృతి లేదని, 1వ తేదీ కంటే ముందే ఇంటికి వెళ్లి పెన్షన్ అందిస్తున్నామని చెప్పారు. షాదిఖానా నిర్మాణం తన ప్రధాన విన్నపాల్లో ఒకటని సీఎంకు విజ్ఞప్తి చేశారు.

**అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ...** ఎమ్మెల్యే రాము అద్భుతంగా పనిచేస్తున్నారని అభినందించారు. "అమెరికా నుంచి వచ్చాడు, పని చేస్తాడా అనే అనుమానం ఉండేది, కానీ చాలా సమర్థంగా పనిచేస్తున్నాడు" అని కొనియాడారు. గుడివాడలో 90 ప్రదేశాల్లో చెత్త నిర్మూలించి మార్పు తెచ్చారని, రాము లాంటి నాయకుల స్ఫూర్తి అందరిలో ఉండాలని పిలుపునిచ్చారు. 57% ఓట్లతో రికార్డ్ మెజారిటీ ఇచ్చినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధి అంటే రోడ్లు వేయడం మాత్రమే కాదని, పర్యావరణాన్ని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. చెత్తతో ఉన్న ప్రాంతాలను 'ఐ లవ్ గుడివాడ'గా అభివృద్ధి చేశారని మెచ్చుకున్నారు. రానున్న రోజుల్లో గుడివాడలో 162 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతాయని ప్రకటించారు.




# కార్మికులకు 'తల్లికి వందనం' వర్తింపు నిర్ణయం హర్షణీయం : గొట్టుముక్కల

'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో హర్షణీయమన్న గొట్టుముక్కల

విజయవాడ (చైతన్యరథం): విజయవాడ 30వ డివిజన్‌లో జీవో నెంబర్ 15 ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చిత్ర పటాలకు పారిశుద్ధ్య కార్మికులు పాలాభిషేకం చేశారు. యువగళం పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేస్తూ పారిశుద్ధ్య కార్మికులకు అంగన్వాడీలకు రఘురామరాజు వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం చేసిన హౌస్ మ్యాపింగ్ సర్వే లో ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేయడం జరిగింది. దీని వలన ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా పోయాయి. మంత్రి నారా లోకేష్ చొరవతో పారిశుద్ధ్య కార్మికుల, అంగన్వాడీల దీర్ఘకాలిక డిమాండ్ నెరవేరడం సంతోషకరమని అన్నారు.

# పరిశుభ్రతకు రాయబారులుగా మారాలి

## యువతరానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపు



కోవూరు (చైతన్యరథం): కొడవలూరు మండలం వెంకన్నపురం గ్రామం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన 'స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణను పరిశుభ్రం చేసే కార్యక్రమంలో స్వయంగా పాల్గొని, సమీప గృహాల నుంచి ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని, ప్రజలందరూ భాగస్వాములవ్వాల్సిన ఉద్యమమని అన్నారు. పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థులకు తడి, పొడి చెత్త వేరు చేయడం, సేంద్రియ వ్యర్థాలతో కంపోస్టు తయారు చేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ఆహారాన్ని వృథా చేయకుండా ఉండటంపై అవగాహన కల్పించారు.

విద్యార్థులు, యువత పరిశుభ్రతకు రాయబారులుగా ముందుండి తమ కుటుంబాలు, గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. 'ప్రతి ఇల్లు, ప్రతి వీధి, ప్రతి గ్రామం' పరిశుభ్రంగా ఉండేలా అందరం కలిసి పనిచేద్దామని, మన వెంకన్నపురాన్ని ఆదర్శ పరిశుభ్ర గ్రామంగా తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా కలెక్టరు హిమాన్షు శుక్లా, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.




# చిన్నారులకు మెరుగైన సేవలు అందించండి

## అంగన్వాడీ కేంద్రాల్లో అధికారులు, సిబ్బందికి ఎమ్మెల్యే ఇంటూరి సూచన

కందుకూరు (చైతన్యరథం): అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు సేవలు అందించడంలో బాధ్యతగా ఉండాలని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. విద్యుత్ ఆదా చేయడంలో భాగంగా నియోజకవర్గంలోని 236 అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు, వంట పాత్రలను ఎమ్మెల్యే నాగేశ్వరరావు శనివారం పంపిణీ చేశారు. కందుకూరు సెక్టార్ పరిధిలోని వలేటివారిపాలెం మండలంలో 53 కేంద్రాలు, ఉలవపాడు సెక్టార్ పరిధిలోని మొత్తం 183 కేంద్రాలకు స్టౌలు అందించారు. కూటమి ప్రభుత్వం ఒక్కొక్క అంగన్వాడీ కేంద్రానికి సుమారు 7 వేల రూపాయల విలువ చేసే వస్తువులను అందిస్తోందని ఎమ్మెల్యే చెప్పారు. చిన్నారుల్లో పోషకాహార లోపం ఉండకూడదనే ఉద్దేశంతో అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తుందని నాగేశ్వరరావు చెప్పారు. నిధుల సద్వినియోగం జరిగేలా అధికారులు పనిచేయాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కందుకూరు సీడీపీఓ కే.ఉషారాణి, ఉలవపాడు సీడీపీఓ మాధవీలత, సూపర్వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల ఆకస్మిక తనిఖీ

## వసతులపై ఆరా తీసిన మంత్రి డోలా, దర్శి టీడీపీ ఇన్చార్జి గొట్టిపాటి



దర్శి (చైతన్యరథం): తూర్పు చౌటపాలెంలో అంగన్వాడీ కేంద్రాన్ని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి, దర్శి టిడిపి ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మీ శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీలో వసతులను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత తదితరాంశాలపై ఆరా తీశారు. విద్యార్థులతో వాంతులు, విరోచనాలు, జ్వరాలు రాకుండా ఆరోగ్యంగా ఉండేందుకు శుభ్రమైన ఆహారం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ స్వామి, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ సూచనలు చేశారు. వారికి అందిస్తున్న పౌష్టికాహారం తదితర విషయాలను ఆరా తీశారు. అంగన్వాడి పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దర్శి మండల ఎంపీడీఓ కల్పన, మాలకొండయ్య, రామాదేవి, పంచాయతీ సెక్రటరీ, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి నియోజకవర్గం లోని మండల, దర్శి టౌన్ టిడిపి అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, మోడీ ఆంజనేయులు, కూరపాటి శ్రీను, మేడగం వెంకటేశ్వర రెడ్డి, పుల్లలచెరువు సత్యనారాయణ, తూర్పు చౌటపాలెం టిడిపి నాయకులు నీటి సంగం డి.సి. అధ్యక్షులు కామినేని ఎలుగొండారెడ్డి, మాజీ సర్పంచ్ మారం శ్రీనివాసరెడ్డి, డీలర్ రామిరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు మారం రమణా రెడ్డి, మాజీ జడ్పీటీసీ మారం సుబ్బారెడ్డి పాపసాని ఆదిరెడ్డి, నాగిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ బండి దేవప్రసాద్, తిరుపాలు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# మార్పు కనిగిరి నుంచే రావాలి

## ఎమ్మెల్యే, ఒంగోలు టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ ముక్కు నరసింహారెడ్డి పిలుపు

కనిగిరి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర" కార్యక్రమంలో భాగంగా, నిర్వహించిన లిబల్క్ వేస్ట్ జనరేటర్ అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గౌరవ కనిగిరి శాసనసభ్యులు ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి. మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం. విజయసునీత పాల్గొన్నారు. సందర్భంగా మున్సిపల్ కార్యాలయం నుంచి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలి వరకు విద్యార్థులతో కలిసి భారీ అవగాహన ర్యాలీ నిర్వహించి, పరిసరాల పరిశుభ్రత, చెత్త వర్గీకరణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.





# చిన్నారుల భవిష్యత్తుకు పునాదులు అంగన్‌వాడీ కేంద్రాలు

పెనుకొండ (చైతన్యరథం): భావితరాల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్న అంగనవాడీ కార్యకర్తల సేవలు ఎంతో అభినందనీయమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత అన్నారు. పెనుకొండ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 459 అంగనవాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లను మంత్రి సవిత పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, విద్యాభివృద్ధిలో అంగనవాడీ కేంద్రాల పాత్ర కీలకమని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ప్రతి చిన్నారికి నాణ్యమైన భోజనం, సరైన శిక్షణ అందించాలని సూచించారు. అంగనవాడీ కార్యకర్తల సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గతంలో రూ.7,000గా ఉన్న గౌరవ వేతనాన్ని రూ.12,500కు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, 'తల్లికి వందనం' పథకం అమలు, అంగనవాడీ కార్యకర్త మరణిస్తే అంత్యక్రియల నిమిత్తం రూ.15 వేల ఆర్థిక సహాయం, గ్రాట్యుటీని రూ.50 వేల నుంచి రూ.1 లక్షకు పెంచడం వంటి సంక్షేమ చర్యలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. నియోజకవర్గంలోని అన్ని అంగనవాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, త్వరలో అన్ని కేంద్రాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి

## నిర్వాహకుల పనితీరుకు మంత్రి సవిత కితాబు

చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కొన్ని కేంద్రాల్లో సమస్యలు ఉన్నాయని తమ దృష్టికి వచ్చిందని, వాటిని వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందించడంతో పాటు వారి మానసిక, శారీరక వికాసానికి అవసరమైన శిక్షణ అందించాలని కార్యకర్తలకు సూచించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని మంత్రి సవిత హెచ్చరించారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వం, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగనవాడీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

10 బీసీ హాస్టళ్లకు 43 టీవీల పంపిణీ

నియోజకవర్గ అభివృద్ధికి కార్పొరేట్ సామాజిక బాధ్యత శ్రీజ నిధుల ద్వారా రూ.36 కోట్లతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మంత్రి సవిత తెలిపారు. అదే కార్యక్రమంలో భాగంగా ఖూస కంపెనీ ఆధ్వర్యంలో పెనుకొండ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 10 బీసీ హాస్టళ్లకు 43 ఇంచీల టెలివిజన్లను మంత్రి సవిత చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమం కోసం ముందుకు వచ్చిన కేఎస్‌హెచ్ కంపెనీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతతో విద్యా రంగానికి అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి రాజేంద్రనాథ్ రెడ్డి, ఖూస కంపెనీ ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రేడ్ టూ మునిసిపాలిటీగా పెనుకొండ

## మంత్రి సవితను సన్మానించిన మున్సిపల్ సిబ్బంది



పెనుకొండ (చైతన్యరథం): పెనుకొండ నగర పంచాయతీ గ్రేడ్-2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిన సందర్భంగా బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవితను పెనుకొండ మున్సిపాలిటీ అధికారులు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ పెనుకొండ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మున్సిపల్ సేవలను మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు కొనసాగుతాయని తెలిపారు. మున్సిపాలిటీని మరింతగా అభివృద్ధి చేయాలని మంత్రి సవిత తెలిపారు. అనంతరం, వివిధ కారణాలతో నగర పంచాయతీలో పనిచేస్తూ మృతి చెందిన కార్మికులు ఓబులేష్, రాము, నరసింహులు, ముత్యాలప్పల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సహాయ చెక్కులను మంత్రి సవితమ్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి, మంత్రి సవితమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ధర్మవరం పట్టణంలోని కొత్తపేట రైల్వే బాలుర పాఠశాలలో నిర్వహించిన "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో పాల్గొన్న తెదేపా ధర్మవరం నియోజకవర్గం ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్



# అనంతపురం ఎమ్మెల్యే, కలెక్టర్ భేటీ

అనంతపురం (చైతన్యరథం): నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి (కలెక్టర్) ఓ.ఆనంద్‌తో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ భేటీ అయ్యారు. శనివారం సాయంత్రం ఆయన కలెక్టరేట్‌కు వెళ్లారు. కలెక్టర్‌తో ప్రత్యేకంగా సమావేశమై నగరంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుద్ధ్యం, డంపింగ్ యార్డ్ వంటి అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఇప్పటికే జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు ఇంకా చేపట్టాల్సిన పనులకు సంబంధించిన నిధుల విషయం గురించి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కలెక్టర్ ఆనంద్ దృష్టికి తీసుకెళ్లారు. డంపింగ్ యార్డ్‌లో చెత్త వేగవంతంగా తరలించి వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌తో పాటు పార్కు నిర్మాణానికి టెండర్లు పిలిచే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వర్షాకాలం నేపథ్యంలో నడిమి వంక, మరువ వంక పరిసర ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యల గురించి కూడా చర్చించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రస్తావించిన అంశాలపై కలెక్టర్ ఆనంద్ సానుకూలంగా స్పందించారు. అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని కలెక్టర్ ఆనంద్‌హామీ ఇచ్చారు.

# పరిశుభ్రత ప్రజలందరి బాధ్యత



అనంతపురం (చైతన్యరథం): యల్లనూరు మండల కేంద్రంలో శనివారం "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, తదితరులు పాల్గొన్నారు. ఇందులో గ్రంథాలయం వద్ద మానవహారం నిర్వహించగా, స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేసి.. పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో అరిఫ్ కు చెందిన దుకాణం వద్ద గ్రీన్ షాప్‌ను కలెక్టర్, ఎమ్మెల్యే ప్రారంభించారు. అక్కడ ధరలను తెలుసుకున్నారు, ప్లాస్టిక్ గుజరీ షాపునకు వేస్తున్నామని షాపు యజమాని తెలిపారు. అనంతరం మండల పరిషత్ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల ఎన్రోల్మెంట్ గురించి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఆ తరువాత మండల పరిషత్ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని వీలయినంతవరకు తగ్గించాలని పిలుపునిచ్చారు. మనం తాగే నీరు, పీల్చే గాలి, తినే అన్నంలో నాణ్యత తగ్గిపోయిందని, అది నాణ్యతగా ఉండాలన్నారు. ఇళ్లతోపాటు ఇంటి బయట కూడా శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రతిరోజు ప్రతి మండలంలో స్వచ్ఛ రథం ఏర్పాటు చేశామని, దాని నుంచి చెత్త సేకరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇందులో భాగంగా ఇక్కడ గ్రీన్ షాపును ప్రారంభించడం జరిగిందన్నారు. సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ కుటుంబ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి నెల మూడవ శనివారం "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్లాస్టిక్ ని అన్ని చోట్లా నిషేధించాలని, వేస్ట్ మేనేజ్మెంట్ పాటించాలని, మన ఆరోగ్య పరిస్థితులను మెరుగుపరుచుకోవాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఎంతో బాధ్యతతో రాష్ట్ర ప్రజలు బాగుండాలని అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, అందులో భాగంగా ప్రతినెలా ఒక థీమ్ ప్రకారం ఈ కార్యక్రమాన్ని చేపడుతుండగా, ఈనెల "వరదలు - సిద్ధంగా ఉన్న ఆంధ్ర' థీమ్ తో ఈ కార్యక్రమం చేపట్టామని, ఇళ్లను శుభ్రంగా పెట్టుకోవడంతో పాటు ఇంటి చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవాలన్నారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు మారుతున్నాయని, వాటికనుగుణంగా మనం కూడా మారాలని, పర్యావరణాన్ని మనం కాపాడుకోవాలన్నారు. ప్రభుత్వంతో పాటు ప్రతి పౌరుడు బాధ్యతగా ప్లాస్టిక్ వాడకం నిషేధించడంలో పాల్గొనాలని, ఇందులో అందరూ భాగస్వామ్యం కావాలన్నారు. చిన్నపిల్లల స్థాయి నుంచి ప్లాస్టిక్ వాడకూడదనే దానిపై అవగాహన కల్పించాలని, పిల్లలు ప్లాస్టిక్ బాటిల్స్ వాడరాదని, స్టీల్ బాటిల్స్ వాడాలన్నారు. యల్లనూరు మండలంలో ఒక గ్రీన్ షాప్ ను గుర్తించామని, అక్కడ ప్లాస్టిక్ ను అందజేస్తే దానికి బదులుగా కూరగాయలు, సోపులు, అవసరమైన వస్తువులు తీసుకునే అవకాశం ఉంటుందని, ఆ కార్యక్రమాన్ని ఈరోజు మొదలు పెట్టామన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ బయట వేయరాదని, తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి చెత్త తరలించే సిబ్బందికి ఇవ్వాలని, దీనిపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మీ ఇల్లు ఎలా బాగుండాలో, అలాగే మీ పంచాయతీ బాగుండాలని, మండలం, నియోజకవర్గం బాగుండాలన్నారు. ప్రతి ఒక్కరూ రోజువారి చేసే పనుల్లో పరిశుభ్రతను బాధ్యతగా చేపట్టాలన్నారు.

# ప్రజలకు పచ్చదనం, పరిశుభ్రత కూడా ముఖ్యమే



రాప్తాడు (చైతన్యరథం): అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో పాటు పచ్చదనం పరిశుభ్రతను కూడా ప్రాధాన్యతగా తీసుకొని తమ ప్రభుత్వం పని చేస్తోందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఇందులో భాగంగా ప్రతి మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. రామగిరి మండలం కుంటిమద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు, పారిశుధ్య కార్మికులు, స్థానిక నాయకులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటి స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఇంకుడు గుంత తవ్వడానికి భూమి పూజ చేశారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయు విధానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆ తర్వాత పాఠశాల మొత్తం ఆమె పరిశీలించారు. వంటగది లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని ప్రధానోపాధ్యాయులు ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకెళ్లారు. వంటగది నిర్మాణానికి ఎంత మేర ఖర్చవుతుందని ఆరా తీశారు. వెంటనే ఆమె స్పందించి మండల పరిషత్ నుంచి మూడు లక్షల రూపాయలతో వంటగది నిర్మించాలని ఎంపీడీఓని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ పచ్చదనం పరిశుభ్రత పై పాఠశాల స్థాయి నుంచి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి విద్యార్థికి తడి, పొడి చెత్త వేరు చేయు విధానం గురించి తెలిస్తే వారి ఇళ్లలో కూడా చెబుతారన్నారు. పాఠశాల ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, భోజనం విషయంలో కూడా నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కను కాపాడే విధంగా విద్యార్థులకు బాధ్యతలు అప్పగించాలని ఎమ్మెల్యే సునీత సూచించారు.

### రూ.80లక్షలతో నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభం

### ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి మండలం పాపిరెడ్డి పల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆమె ప్రారంభించారు. గ్రామ సమీపాన వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం వద్ద 45లక్షల రూపాయల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన రోడ్డు వద్ద ఎమ్మెల్యే సునీతకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. పూల వర్షం కురిపిస్తూ పాదయాత్రతో రోడ్డు మార్గం మీదుగా ఆలయానికి వెళ్లారు. అక్కడ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి భజన కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులతో కలిసి భోంచేశారు. అనంతరం పాపిరెడ్డిపల్లి గ్రామంలో 35 లక్షల ఎన్ఆర్ఈజీఎస్, డిఎంఎఫ్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. గ్రామంలో ఎన్నో ఏళ్ల నుంచి సమస్యగా ఉన్న రోడ్లను నిర్మించినందుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు గ్రామంలో బిటి, సిసి రోడ్లతో పాటు ఆలయం వద్ద కూడా రోడ్డు నిర్మించినట్లు చెప్పారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ఈ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరిగింది.. ఇప్పుడు ఏం జరుగుతోందన్నది ప్రజలు గుర్తించాలని ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేశారు.

# అమెరికాలో ఆధ్యాత్మిక వైభవం

## సెయింట్ లూయిస్‌లో శాస్త్రోక్తంగా రుద్ర, అరుణ, రాజశ్యామల హోమాలు



**మిస్సోరి:** మిస్సోరిలోని ది హిందూ టెంపుల్ ఆఫ్ సెయింట్ లూయిస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవకుండాత్మక శతచండీ సహిత రుద్ర యాగంలో మూడో రోజు ఆధ్యాత్మిక వైభవం వెల్లివిరిసింది. వేదమంత్రాల మధ్య భక్తిశ్రద్ధలతో కొనసాగింది. యాగశాలలో ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన క్రతువుల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివశక్తుల అనుగ్రహాన్ని పొందారు. అమెరికాలో ఇంత వైభవంగా జరుగుతున్న ఈ మహా యాగం ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీకగా నిలుస్తోందని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. మూడో రోజు కార్యక్రమాలు గోమాత పూజతో ప్రారంభమయ్యాయి. అనంతరం రుత్వికులు వేదఘోషతో శాస్త్రోక్తంగా మహన్యాస పారాయణం చేశారు. అనంతరం పరమశివుని అనుగ్రహం, లోకక్షేమం, సర్వజన సుఖశాంతుల కోసం రుద్ర హోమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పూర్ణాహుతి సమర్పించారు. ఉదయం సూర్యనారాయణ స్వామి అనుగ్రహం, ఆరోగ్యం, ఆయురారోగ్యాలు, జీవనంలో సానుకూల శక్తి ప్రసాదం కోసం అరుణ హోమాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం చండీ హోమం జరిపించారు. జగన్మాత చండికాదేవి అనుగ్రహం, ధర్మ రక్షణ, శత్రు బాధల నివారణ, సర్వమంగళ సిద్ధి కోసం నిర్వహించిన ఈ హోమంలో మహిళలు, కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు విశేషంగా పాల్గొన్నారు. దేవీ మంత్రోచ్చారణలతో యాగశాల మార్మోగింది. విద్య, జ్ఞానం, వాక్పటిమ, కళలు, నాయకత్వ లక్షణాలు, ఐశ్వర్యం ప్రసాదించే రాజశ్యామలాదేవికి అంకితమైన హోమాన్ని రుత్వికులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. విద్యార్థులు, కళాకారులు, ఉద్యోగవేత్తలు, వ్యాపారవేత్తలు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ హోమంలో పాల్గొని ప్రత్యేక సంకల్పాలు చేశారు. రోజంతా నిర్వహించిన కార్యక్రమాల్లో స్వచ్ఛంద సేవకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదం అందించారు. ఈ నెల 19వ తేదీ వరకు కొనసాగే నవకుండాత్మక శతచండీ సహిత రుద్రయాగంలో ప్రతిరోజూ విశిష్ట పూజలు, హోమాలు, చండీ పారాయణం, రుద్రయాగం జరుపుతున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగవరపు రజనీకాంత్ తెలిపారు. ప్రవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కమిటీ ఉపాధ్యక్షుడు సాక్షి విజయ్, కార్యదర్శి జంగా కిషోర్, కోశాధికారి పుట్టగుంట మురళీ, స్టీరింగ్ కమిటీ సభ్యుడు బైరపునేని సురేంద్రనాథ్, మీడియా విభాగ సమన్వయకర్త రాజా సూరపనేని కోరారు.







# అమెరికా నేవీలో భారత యువనారి

**"వయసు కేవలం పదిహేడేళ్లు.. కానీ ఆమె ఇచ్చే ఒక్క కమాండ్‌కు 300 మంది అమెరికన్ నేవీ క్యాడెట్లు కదం తొక్కుతారు. ప్రతిరోజూ ఉదయం ఏడు గంటలకే స్కూల్ గ్రౌండ్‌లోకి అడుగుపెట్టి సైనిక క్రమశిక్షణతో క్యాడెట్లకు దిశానిర్దేశం చేస్తూ సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది భారత సంతతికి చెందిన రిద్ధి చౌహాన్. అసాధారణ నాయకత్వ పటిమ, క్రమశిక్షణతో అమెరికా నావికాదళ శిక్షణా విభాగంలో ఆమె అత్యున్నత బాధ్యతలను దక్కించుకుంది."**

**300 మంది క్యాడెట్లను నడిపిస్తున్న భారత సంతతి బాలిక రిద్ధి చౌహాన్**

**పదిహేడేళ్ల వయసులోనే బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్‌గా రికార్డు**

**అండర్ వాటర్ రోబోటిక్స్ నుంచి సైనిక క్రమశిక్షణ వరకు అగ్రగామి**

**న్యూయార్క్:** రిద్ధి చౌహాన్ తల్లిదండ్రులు దిలీప్ చౌహాన్, రుచిక. వీరి స్వస్థలం రాజస్థాన్‌లోని చారిత్రాత్మక నగరం జైపూర్. ఉద్యోగ రీత్యా ఈ కుటుంబం అమెరికా వలస వెళ్లి ప్రస్తుతం న్యూయార్క్‌లోని క్వీన్స్ ప్రాంతంలో స్థిరపడింది. రిద్ధి ప్రస్తుతం అక్కడ ప్రసిద్ధి చెందిన బెంజమిన్ ఎన్.కార్డోజో హైస్కూల్లో విద్యనభ్యసిస్తోంది. భారతీయ మూలాలు, సంస్కృతిని గుండెల్లో దాచుకుంటూనే అమెరికాలోని అత్యంత కఠినమైన రక్షణ రంగానికి సంబంధించిన విద్యార్థి విభాగంలో ఆమె తనదైన ముద్ర వేసింది.

### తొమ్మిదో తరగతిలోనే పడిన బీజం

రిద్ధి చౌహాన్ తొమ్మిదో తరగతి (ఫ్రెష్‌మన్ ఇయర్) చదువుతున్న సమయంలోనే పాఠశాలలోని ప్రతిష్టాత్మక 'ఎన్‌జేఆర్‌ఓటీసీ' (NJROTC - Naval Junior Reserve Officersμ Training Corps) ప్రోగ్రామ్‌లో చేరింది. ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడమే ధ్యేయంగా ఆమె ఈ కఠినమైన మార్గాన్ని ఎంచుకుంది. నాటి నుంచి నేటి వరకు అంకితభావం, నిరంతర శ్రమతో విద్యార్థి దశలోనే ఎన్నో కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి అందరి ప్రశంసలు అందుకుంది.

### అకడమిక్స్‌లో టాపర్.. రోబోటిక్స్‌లో దిట్ట!

రిద్ధి కేవలం సైనిక విన్యాసాలకే పరిమితం కాలేదు. సాంకేతిక, విద్యా రంగాల్లోనూ ప్రతిభ



కనబరిచింది.

**జాతీయ స్థాయి గుర్తింపు:** వరుసగా రెండేళ్లపాటు తన పాఠశాల బృందాన్ని అత్యంత ప్రతిష్టాత్మకమైన 'నేషనల్ లెవెల్ లీడర్‌షిప్ అండ్ అకాడమిక్ బోల్ సెకండ్ రౌండ్'కు చేర్చడంలో ఆమె కీలక పాత్ర పోషించింది.

**రోబోటిక్స్ ఆవిష్కరణ:** బెటాలియన్‌లోనే మొట్టమొదటిసారిగా రూపొందించిన 'సీపెర్చ్ అండర్ వాటర్ రోబో' (SeaPerch Underwater Robot) ప్రాజెక్టు తయారీలో అత్యంత కీలక పాత్ర పోషించి శాస్త్ర సాంకేతిక రంగాలపై తనకున్న పట్టును నిరూపించుకుంది.

**బహుముఖ ప్రజ్ఞ:** అకడమిక్ కమాండర్, స్టైమ్ కమాండర్, ప్లటూన్ లీడర్ వంటి విభిన్న బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించి లీడర్‌షిప్‌నకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది.

క్యాడెట్ల కఠిన క్రమశిక్షణను, రోజువారీ శిక్షణా కార్యక్రమాలను పర్యవేక్షించే రిద్ధి చౌహాన్ భవిష్యత్తుపై స్పష్టమైన లక్ష్యంతో ఉంది. భవిష్యత్తులో అమెరికా ప్రధాన నావికాదళంలో నేరుగా 'కమాండింగ్ ఆఫీసర్' కావడమే తన అంతిమ ధ్యేయమని ఆమె ధీమాగా చెప్తోంది.

ఇప్పటికే ఆ దిశగా బలమైన అడుగులు వేస్తూ ఎంతో ప్రతిష్టాత్మకమైన 'యూఎస్ నేవల్ అకాడమీ ప్రిపరేటరీ స్కూల్' (US Naval Academy Preparatory School) లో అడ్మిషన్ సైతం సాధించింది. తాజాగా ఆమెను బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్‌గా రక్షణ విభాగం నియమించింది. ఇందులో భాగంగానే ప్రస్తుతం ఆమె 300 మంది అమెరికన్ నేవీ క్యాడెట్ల శిక్షణా కార్యక్రమాలకు సర్వ సైన్యాధ్యక్షురాలిగా వ్యవహరిస్తూ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎంతో మంది ఆడపిల్లలకు, ముఖ్యంగా భారతీయ యువతకు రోల్ మోడల్‌గా నిలుస్తోంది. రిద్ధి సాధించిన ఈ అద్భుత విజయాలపై అటు అమెరికాలోని ప్రవాస భారతీయులు, ఇటు స్వదేశంలోని జైపూర్‌వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





# ఫలించిన తొలి ప్రైవేట్ అంతరిక్ష ప్రయోగం

## సక్సెస్ సాధించిన హైదరాబాద్ స్కైరూట్ ఎయిరోస్పేస్ బృందానికి ప్రధాని మోదీ అభినందనలు





భారత తొలి ప్రైవేటు అంతరిక్ష ప్రయోగం 'విక్రమ్-1' విజయవంతం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రయోగం విజయవంతమైన వెంటనే హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ బృందంతో ఫోన్‌లో మాట్లాడి, వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు మోదీ. ఈ ప్రయోగాన్ని తాను ప్రత్యక్షంగా వీక్షించినట్టు చెప్పిన ఆయన.. ఈ ఘనత దేశానికి గొప్ప విజయమని అభివర్ణించారు. భారత అంతరిక్ష ప్రయాణంలో ఇదో కీలక మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు. 'ప్రయోగాన్ని నేను ప్రత్యక్షంగా వీక్షించాను. దీని వెనుక ఎందరో యువ ఇంజినీర్ల శ్రమ దాగుంది. మొత్తం బృందానికి నా హృదయపూర్వక అభినందనలు. ఇది ఆరంభం మాత్రమే. ఈ ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి' అని స్కైరూట్ టీమ్‌ను ప్రోత్సహించారు మోదీ. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల బృందం త్వరలో తనను కలవాలని ఫోన్ ద్వారా ఆహ్వానించారు.





# లిఫ్ట్‌లో చిక్కుకున్న కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్

## సురక్షితంగా బయటకు తెచ్చిన రెస్క్యూ టీం

కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కేరళం రాజధాని తిరువనంతపురంలోని ఓ ప్రైవేట్ హోటల్ లిఫ్ట్‌లో కొంతసేపు చిక్కుకుపోయారు. లిఫ్ట్ అకస్మాత్తుగా ఆగిపోవడంతో ఆయనతో పాటు మరికొందరు అరగంట పాటు అందులోనే ఉండిపోయారు. సమాచారం అందుకున్న కేరళం ఫైర్ అండ్ రెస్క్యూ సర్వీసెస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని అందరినీ సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదు. శశి థరూర్ తిరువనంతపురంలోని రోటరీ క్లబ్ ఆఫ్ త్రివేంద్రం ఈస్ట్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు శుక్రవారం సాయంత్రం ఓ ప్రైవేట్ హోటల్‌కు వెళ్లారు. ఆరో అంతస్తుకు వెళ్లేందుకు లిఫ్ట్ ఎక్కిన కొద్ది సేపటికే అది మధ్యలో నిలిచిపోయింది. ఆయనతో పాటు మొత్తం ఏడుగురు లిఫ్ట్‌లో చిక్కుకుపోయారు. హోటల్ సిబ్బంది మొదట లిఫ్ట్‌ను తెరవడానికి ప్రయత్నించినా సాధ్యపడలేదు. దీంతో వారు ఫైర్ అండ్ రెస్క్యూ సర్వీసెస్‌కు సమాచారం అందించారు.

# పాము సాయంతో భర్తను చంపిన కసాయి భార్య



వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ భార్య తన భర్తను హత్య చేసింది. ప్రియుడితో కలిసి.. పాము సాయంతో భర్త ప్రాణాలు తీసింది. ఈ సంఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మీరట్‌కు చెందిన అతుల్ పన్వర్, దామిని భార్యాభర్తలు. అతుల్ స్థానికంగా ఓ ప్రైవేట్ స్కూల్ నడుపుతున్నాడు. ఆ స్కూల్‌లో డ్రైవర్‌గా పని చేసే తుషార్ అనే వ్యక్తితో దామిని వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలోనే అతుల్ అడ్డు తొలగించుకోవాలని, అతడి పేరు మీద ఉన్న 20 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ డబ్బులు సొంతం చేసుకోవాలని దామిని, తుషార్ భావించారు.

అతుల్‌ను మర్డర్ చేయటం కోసం ఓ పక్కా ప్లాన్ సిద్ధం చేశారు. ఇందుకోసం పాములు పట్టే వారి సాయం తీసుకున్నారు. ప్లాన్‌లో భాగంగా.. దామిని పాలలో నిద్ర మాత్రలు కలిపి భర్త అతుల్‌కు ఇచ్చింది. అతుల్ ఆ పాలు తాగి స్పృహకోల్పోయాడు. అతుల్ స్పృహకోల్పోయాడని ధ్రువీకరించుకున్నాక తుషార్‌కు దామిని ఫోన్ చేసింది. తుషార్ పాములు పట్టే ఇద్దరు వ్యక్తులను అతుల్ ఇంటి దగ్గరకు తీసుకువచ్చాడు. పాములు పట్టే వ్యక్తులు ఓ పామును అతుల్ ఉన్న బెడ్‌పై వదిలారు. ఆ పాము అతుల్‌ను కాటేసింది. కొన్ని నిమిషాలకే అతడు చనిపోయాడు. అతుల్ పాము కాటు కారణంగానే చనిపోయాడని కుటుంబసభ్యులను, పోలీసులను దామిని నమ్మించే ప్రయత్నం చేసింది. అయితే, పోలీసులకు ఆమెపై అనుమానం వచ్చింది. దామినితో పాటు తుషార్‌ను కూడా అదుపులోకి తీసుకుని విచారించారు. వారి మొబైల్ ఫోన్‌లను తనిఖీ చేయగా.. అందులో పాముల ఫోటోలు, పాములు పట్టే వారితో మాట్లాడిన కాల్ డేటా లభించాయి. దీంతో పోలీసులు దామిని, తుషార్‌లతో పాటు వీరికి సహకరించిన పాములు పట్టే ఇద్దరినీ కూడా అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

# పట్టాలెక్కిన తొలి హైడ్రోజన్ రైలు

## రైలు అభివృద్ధిలో హైదరాబాద్ సంస్థ కీలకపాత్ర

దేశ రైల్వే చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలైంది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన తొలి హైడ్రోజన్ రైలును ఇక్కడ హరియాణాలోని జింద్ రైల్వేస్టేషన్‌లో ప్రధాని నరేంద్ర మోదీ జెండా ఊపి ప్రారంభించారు. గడిచిన పన్నెండేళ్లలో భారతీయరైల్వే గణనీయంగా అభివృద్ధి చెందిందని ఈ రైలును ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ గుర్తుచేశారు. తాము చేపట్టిన 'భారత్‌లోనే తయారీ (మేకిన్ ఇండియా)' కార్యక్రమం విజయవంతమైందనడానికి ఈ రైలే ఒక నిదర్శనం అని.. ఇది ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన హైడ్రోజన్ ట్రైన్ అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన పశ్చిమాసియాలో నెలకొన్న అస్థిర పరిస్థితులు, యుద్ధం గురించి కూడా ప్రస్తావించారు. హోర్ముజ్ జలసంధి గుండా భారత్‌కు పెద్ద ఎత్తున ముడిచమురు, గ్యాస్, ఎరువులు సరఫరా అవుతాయని.. కానీ 3-4 నెలలుగా ఆ మార్గం యుద్ధక్షేత్రంగా మారిందని.. దానివల్ల చమురు సంక్షోభం ఏర్పడినప్పటికీ భారత రైల్వేగానీ, దేశ అభివృద్ధి వాహనంగానీ ఆగలేదని వ్యాఖ్యానించారు. "2014కు ముందు ఇవే పరిస్థితులు ఏర్పడి ఉంటే భారతీయ రైల్వే కార్యకలాపాలు పూర్తిగా స్తంభించి పోయేవి. ఎందుకంటే అప్పట్లో దేశంలోని రైళ్లలో అత్యధికం డీజిల్‌తోనే నడిచేవి. అలాంటి డీజి ల్ సరఫరా నిలిచిపోతే.. ఆ రైళ్లు ఎలా నడుస్తాయి? దీనివల్ల దేశం చాలా పెద్ద సంక్షోభంలో చిక్కుకునేది. కానీ.. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. ఇక్కడున్నది మోదీ. చాలా ముందుగానే ఆలోచించి సమస్యలకు పరిష్కారమార్గాలను ముందే గుర్తిస్తాడు" అన్నారు. హైడ్రోజన్ రైలును ప్రారంభించిన అనంతరం ఆయన రూ.14,700 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఇక.. దేశీయంగానే ఈ రైలును అభివృద్ధి చేయాలని దేశ నాయకత్వం తీసుకున్న సాహసోపేత నిర్ణయం కారణంగానే ఇంతటి భారీ సాంకేతిక మైలురాయిని అందుకోవడం సాధ్యమైందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. ప్రస్తుతానికి జింద్ నుంచి సోనిపత్‌కు 89 కిలోమీటర్ల దూరం ప్రయాణించే ఈ రైలు మధ్యలో 12స్టేషన్లలో ఆగుతుంది. సోనీపత్ ఢిల్లీ సెక్షన్ల మధ్య (44కిలోమీటర్లు) ఈ రైలు ప్రయాణానికి సంబంధించి పరీక్షలు జరుగుతున్నాయని.. అవి పూర్తయితే జింద్ నుంచి ఢిల్లీ దాకా ఈ రైలు నడుస్తుందని ఆ యన వివరించారు. శనివారం నుంచి ఈ రైలు సేవ లు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. ఈ రైలు.. సాధారణ రైళ్లలా కాకుండా.. మెట్రో రైలులా 10 బోగీలతో ఒకే సెట్ (టెన్ కార్ హైడ్రోజన్ ఫ్యూయెల్ ట్రెయిన్ సెట్)గా ఉంటుంది. వీటిలో రెండు (రైలుకు ఇరువైపులా ఉండే) డ్రైవింగ్ పవర్ కార్లు కాగా.. మిగతా ఎనిమిదీ ప్యాసింజర్ కోచ్‌లు. రెండు డ్రైవింగ్ పవర్‌కార్లూ కలిసి ఏకంగా 3200హెచ్‌పీ శక్తిని విడుదల చేస్తాయి. జర్మనీ, జపాన్, ఫ్రాన్స్, చైనా వంటి దేశాల్లో ఉన్న హైడ్రోజన్ రైళ్లలో 2 నుంచి 4 కోచ్‌లు మాత్రమే ఉంటాయి. ఆ రకంగా చూస్తే.. మోదీ ప్రారంభించింది ప్రపంచంలోనే అత్యంత పొడవైన హైడ్రోజన్ పవర్డ్ ప్యాసింజర్ రైలు.

### హైదరాబాద్ సంస్థ కీలకపాత్ర

మేకిన్ ఇండియాలో భాగంగా ఈ హైడ్రోజన్ రైలును పూర్తిగా దేశీయంగా అభివృద్ధి చేశారు. రైలు కోచ్‌లను చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలో తయారుచేశారు. తయారైన రైళ్లు మన ట్రాక్‌లపై సురక్షితంగా నడవగలవా? లేదా? అనే పరీక్షలను ఇండియన్ రైల్వే పరిశోధనల విభాగమైన ఆర్డీఎస్వో చేసింది. ఇక.. ఈ రైలు నిర్మాణంలో అత్యంత కీలకమైన 'హైడ్రోజన్-టు ఎలక్ట్రిక్' కన్వర్షన్ సాంకేతికతను మన హైదరాబాద్‌కు చెందిన 'మేధా సర్వో డ్రైవ్స్' సంస్థ అందించడం విశేషం. హైడ్రోజన్‌ను వాడుకుని విద్యుత్తును ఉత్పత్తి చేసి, రైలు చక్రాలను తిప్పే మోటార్లకు అందించే పూర్తి వ్యవస్థను ఈ సంస్థే అనుసంధానించింది.



# సీజేపీ అధినేత అభిజీత్‌పై దాడి

## సిరా లాంటి ద్రవంతో విరుచుకుపడిన ఆగంతక మహిళ

కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై సిరా లాంటి ద్రవంతో ఓ మహిళ దాడి చేసింది. జంతర్ మంతర్ వద్ద దీప్కే తన మద్దతుదారులతో సమావేశం నిర్వహించి ప్రసంగిస్తుండగా ఈ ఘటన జరిగింది. గుర్తుతెలియని మహిళ వారి సమావేశంలోకి ప్రవేశించి అతనిపై దాడికి పాల్పడింది. దీంతో దీప్కే మద్దతుదారులు మహిళ వైపు ఒక్కసారిగా దూసుకెళ్లడంతో జంతర్ మంతర్ వద్ద కాసేపు గందరగోళం నెలకొంది. అయితే, మహిళ ఎవరు? దాడి వెనుక ఉన్న ఉద్దేశం ఏంటనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. సోనమ్ వాంగ్ చుక్ దీక్ష భగ్నం తర్వాత తాను కూడా నిరశనకు దిగుతానని దీప్కే ప్రకటించిన కాసేపటికే అతనిపై ఈ దాడి జరిగింది. ఘటన అనంతరం ఎక్స్ వేదికగా దీప్కే స్పందించారు. దాడికి సంబంధించిన వీడియోను పోస్టు చేస్తూ 'నీలం నా రంగు... జై భీమ్!' అని ఆయన పేర్కొన్నారు. కాగా, శనివారం సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు. 21వ రోజుకు చేరుకున్న నిరశన దీక్షను ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. ఆయన ఆరోగ్యం క్షీణించడంతో ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

విద్యార్థుల ప్రశ్నపత్రాల లీక్ ఘటనలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సీజేపీ ఆధ్వర్యంలో వాంగ్‌చుక్ నిరసనకు దిగిన విషయం తెలిసిందే. జూన్ 28 నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేపట్టడంతో ఆయన దాదాపు 9.5 కిలోల బరువు తగ్గారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి దీక్షను భగ్నం చేశారు. ఈ ఘటన అనంతరం గంటల వ్యవధిలోనే అభిజీత్ దీప్కేపై మహిళ దాడి చేసింది.

చైతన్యరథం

# ఈ ఏడాది హెచ్-1బీ .. రెండో లాటరీ లేదు!




హెచ్-1బీ వీసాలకు సంబంధించి అమెరికా పౌరసత్వం, వలస సేవల విభాగం తాజాగా కీలక ప్రకటన చేసింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రెండో లాటరీ ఉండదని పేర్కొంది. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను నిర్దేశించిన 85 వేల వీసా స్లాట్లకు తగినన్ని పిటిషన్లు వచ్చాయని ప్రకటించింది. లాటరీలో ఎంపికైన వారి పూర్తి స్థాయి పిటిషన్లను సమర్పించేందుకు ఆయా సంస్థలకు ఇచ్చిన (జూన్ 30, 2026 నాటికే) గడువు ముగిసిందని తెలిపింది. దీంతో ఈ ఏడాది రెండోసారి లాటరీ నిర్వహించే అవకాశం లేదని తెలుస్తోంది.

అమెరికా కంపెనీలు విదేశీ వృత్తి నిపుణులను నియమించుకునేందుకు ఏటా 85 వేల హెచ్-1బీ వీసాలు జారీ చేస్తుంది. ఇందులో 65 వేల వీసాలు రెగ్యులర్, మాస్టర్ క్యాప్ కింద 20 వేల వీసాలను ఇస్తుంది. హెచ్-1బీ వీసాలకు సంబంధించి 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ 2.11లక్షల రిజిస్ట్రేషన్లు వచ్చినట్లు యూఎస్సీఐఎస్ ఇటీవల వెల్లడించింది. గత ఏడాది 3.43లక్షల రిజిస్ట్రేషన్లు రాగా.. ఈసారి వాటి సంఖ్య 38.5శాతం తగ్గినట్లు పేర్కొంది. ఇక వీసాకు ఎంపికైన ఉద్యోగుల కాలపరిమితి అక్టోబర్ 1, 2026 నుంచి మొదలవుతుంది.

**కొత్త విధానంలో లాటరీ..?**

హెచ్-1బీ వీసాలను లాటరీ విధానంలో ర్యాండమ్గా ఎంపిక చేస్తుండగా.. డిపార్ట్మెంట్ ఆఫ్ హోమ్ల్యాండ్ సెక్యూరిటీ ఈసారి కొన్ని మార్పులు చేసింది. అత్యధిక వేతనాలు, ఉన్నత నైపుణ్యాలు ఉన్న ఉద్యోగులకు (లెవల్ 4) వీసా పొందే అవకాశాలు ఎక్కువగా ఉండేలా కొత్త విధానాన్ని రూపొందించారు. తక్కువ వేతనం లేదా ఎంట్రీ లెవల్ ఉద్యోగులకు ఎంపిక ప్రక్రియలో తక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఎంపిక వివరాలను త్వరలో ప్రకటిస్తామని అధికారులు వెల్లడించారు.

# హార్ముజ్‌లో సీ మైన్లను ఢీకొని పేలిన రెండు చమురు నౌకలు



హార్ముజ్ జలసంధిలో సీ మైన్లను ఢీకొట్టి రెండు చమురు ట్యాంకర్లు పేలిపోయాయని ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. అయితే అమెరికా సెంట్రల్ కమాండ్ ఆ ప్రకటనను ఖండించింది. ఇరాన్ చేస్తున్న ప్రచారం పూర్తిగా అసత్యమని, హార్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలు కొనసాగుతున్నాయని అమెరికా స్పష్టం చేసింది.

హార్ముజ్‌లో మందుపాతరలు ఉన్న ప్రాంతం మీదుగా వెళ్లిన రెండు చమురు ట్యాంకర్లు పేలిపోయాయి. అలాగే ఈ జలమార్గం గుండా వెళ్లేందుకు ప్రయత్నించిన నాలుగు నౌకలను అడ్డుకున్నామని శనివారం ఐఆర్‌జీసీ ప్రకటించింది. అమెరికా నిఘా సంస్థలు ఇచ్చిన సమాచారంతో ఈ నౌకల సదరు మార్గం మీదుగా ప్రయాణించాయి. అలాగే ఈ జలమార్గం మీదుగా వెళ్లేందుకు ప్రయత్నించిన మరో నాలుగు నౌకలను అడ్డుకున్నామని వెల్లడించింది. ఐఆర్‌జీసీ ప్రకటనను అమెరికా సెంట్రల్ కమాండ్ ఖండించింది. ఇలాంటి తప్పుడు సమాచారం ద్వారా భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించింది.

కాగా, మరోవైపు ఏడో రోజు కూడా ఇరాన్‌పై అమెరికా దాడులను కొనసాగించింది. అమెరికా దాడులకు ఇరాన్ కూడా ప్రతిస్పందిస్తోంది. యూఎస్ స్థావరాల లక్ష్యంగా ప్రతీకార దాడుల్ని కొనసాగించింది. కువైట్, జోర్డాన్ పైకి క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. ఇదే తరహాలో దాడులు మరో రెండు, మూడు రోజులు కొనసాగితే తాము పూర్తి స్థాయి యుద్ధానికి దిగుతామని ఇరాన్ హెచ్చరించింది. 'మేం దీటుగా స్పందిస్తాం. ఏ సరిహద్దు కూడా సురక్షితంగా ఉండదని ఇరాన్ వార్నింగ్ ఇచ్చింది. తమ విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తే.. ఎర్రసముద్రంలోని బాబ్ అల్ మాండెబ్ జలసంధిని మూసివేసేందుకు సిద్ధంగా ఉండాలని హూతీ రెబెల్స్‌ను ఇరాన్ కోరింది.

**ఒప్పందానికి ఇక చెల్లుచీటీ**

అమెరికాతో కుదిరిన శాంతి ఒప్పందాన్ని పక్కనపెట్టేస్తున్నామని ఇరాన్ తాజాగా ప్రకటించింది. అందులో పేర్కొన్న హామీలకు ఇకపై కట్టుబడి ఉండబోమని స్పష్టం చేసింది. శాంతి ఒప్పందాన్ని మొదట ఉల్లంఘించింది అమెరికాయేనని ఇరాన్ ఇప్పటికే పలుమార్లు ఆరోపించింది.

ఇరాన్‌తో కుదిరిన అవగాహన ఒప్పందం ప్రభావశీలంగా లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొన్ని రోజుల క్రితమే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఆ కథ ముగిసినట్టేనని అనుకుంటున్నాను. వాళ్లతో వ్యవహారం ఇక నా వల్ల కాదు. వాళ్లు చెత్త మనుషులు. వాళ్లతో మాటలు అంటే సమయం వృథా చేసుకోవడమే' అని ట్రంప్ ఇటీవల ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## కాంగో అడవుల్లో కొత్తరకం కోతి



డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో అడవుల్లో కొత్తరకం జాతికి చెందిన కోతి కనిపించింది. ఒళ్లంతా నల్ల రంగు వెంట్రుకలు, పెదవులు మాత్రం గులాబీ-నారింజ రంగులో ఉన్నట్లు జీవ శాస్త్రవేత్త జూనియర్ అంబొకో తెలిపారు. స్థానికంగా 'లిక్వెలి' అని పిలిచే ఈ కోతి చిత్రాన్ని కాంగోలోని లోమామి జాతీయ పార్కులో చెట్టుపై దాగుండగా గుర్తించి ఫొటోలు తీశారు. గతంలో వీటిని గుర్తించినట్లు వార్తలు వచ్చినా, చిత్రాలు దొరకలేదు. కాంగో, అమెరికా, జర్మనీల పరిశోధన బృందం ఈ కోతికి 'కొలొబస్ కాంగోఎన్సిస్' అనే లాటిన్ పేరు పెట్టింది.

## ఉక్రెయిన్ డ్రోన్ దాడులు

**రష్యాలో 11 మంది మృతి**

రష్యాపై మరోసారి ఉక్రెయిన్ విరుచుకుపడింది. శనివారం తెల్లవారుజామున ఉక్రెయిన్ చేపట్టిన డ్రోన్ దాడుల్లో ఏడుగురు మృతిచెందారు. మరో 51 మంది గాయపడ్డారు. గోదాములు, చమురు నిల్వ కేంద్రం, ఓ నివాస భవనంపై ఈ దాడులు జరిగాయి. పలు ప్రాంతాల్లో వందల సంఖ్యలో డ్రోన్లను తమ వైమానిక రక్షణ వ్యవస్థ అడ్డుకుందని రష్యా అధికారులు తెలిపారు.

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ మాట్లాడుతూ.. మాస్కో, టాంబోవ్ ప్రాంతాల్లోని రెండు కీలక లాజిస్టిక్ కేంద్రాలపై దాడులు చేపట్టినట్టు తెలిపారు. డ్రోన్లు, నావిగేషన్ పరికరాల తయారీకి ఆంక్షలు ఎదుర్కొంటున్న విడిభాగాలను సరఫరా చేసేందుకు ఈ కేంద్రాలను ఉపయోగిస్తున్నారు. ఓ చమురు కేంద్రంపై కూడా దాడి చేశామని టెలిగ్రామ్‌లో పేర్కొన్నారు. అజోవ్ సముద్రం, రష్యా ఆక్రమణలో ఉన్న ప్రాంతాల్లో కూడా ప్రత్యేక ఆపరేషన్ దళాలు లక్ష్యాలపై దాడులు చేశాయని చెప్పారు.

రష్యా అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రష్యాలో అతిపెద్ద ఆన్‌లైన్ రిటైల్ సంస్థ వైల్డ్‌బెరీస్‌కు చెందిన రెండు భారీ గోదాములపై దాడులు జరిగాయి. ఉక్రెయిన్ సరిహద్దు నుంచి దాదాపు 360 కిలోమీటర్ల దూరంలో ఉన్న టాంబోవ్ ప్రాంతంలోని కోటోవెస్క్, మాస్కోకు తూర్పున దాదాపు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎలెక్ట్రోస్టాల్లో ఇవి ఉన్నాయి. ఉక్రెయిన్ డ్రోన్ దాడి తర్వాత ఒక చమురు నిల్వ కేంద్రానికి మంటలు అంటుకున్నాయని, అక్కడ మరో ఇద్దరు గాయపడ్డారని తెలిపారు. ముందు జాగ్రత్తగా సమీపంలోని ప్రసూతి ఆసుపత్రి ఓ నివాస భవనాన్ని ఖాళీ చేయించారు.

రష్యా రక్షణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. 19 రష్యా ప్రాంతాలు, క్రిమియా, అజోవ్ సముద్రం, నల్ల సముద్రం ప్రాంతాలపై వచ్చిన 379 ఉక్రెయిన్ డ్రోన్లను రాత్రి సమయంలో వైమానిక రక్షణ వ్యవస్థ అడ్డుకుంది. ఈ దాడుల్లో గోదాములు, చమురు నిల్వ కేంద్రం వంటి కీలక ప్రాంతాలు దెబ్బతిన్నాయి. వ్లాదిమిర్‌ని ఓ నివాస భవనంలో అగ్నిప్రమాదం జరిగింది. రష్యా సైనిక సరఫరాలకు అనుబంధంగా ఉన్న కేంద్రాలనే లక్ష్యంగా చేసుకున్నామని ఉక్రెయిన్ తెలిపింది.

# రక్తానికి రక్తం.. ఇరాన్‌లో భారీ పోస్టర్లు




అమెరికా, ఇరాన్ దేశాల మధ్య దౌత్యపరమైన వైరం మరోసారి పతాక స్థాయికి చేరింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్ నగర నడిబొడ్డున అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఆయన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని ఏర్పాటు చేసిన భారీ బ్యానర్లు తీవ్ర కలకలం రేపుతున్నాయి. అమెరికా జాతీయ జెండాతో కప్పబడిన శవపేటికల పైన ట్రంప్ కుటుంబ సభ్యుల చిత్రాలను ముద్రించిన ఈ బ్యానర్ ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచుతోంది.

రగులుతున్న వైట్ హౌస్ బ్యాక్‌డ్రాప్‌తో రూపొందించిన ఈ వివాదాస్పద హోర్డింగ్‌లో డోనాల్డ్ ట్రంప్‌తో పాటు ఆయన భార్య మెలానియా ట్రంప్, అలాగే ఐదుగురు పిల్లలు ఇవాంకా, డాన్ జూనియర్, ఎరిక్, టిఫానీ, బారన్ ట్రంప్‌ల ఫొటోలు ఉన్నాయి. దీనిపై పర్షియన్ భాషలో 'రక్తానికి రక్తం' అని హెచ్చరిస్తూ రాశారు. ఇరాన్ బహిరంగంగా అమెరికా అధ్యక్షుడిని ఇలా బోర్డుల ద్వారా హెచ్చరించడం ఇది రెండోసారి. ఇంతకుముందు టెహ్రాన్‌లోని ఎంగెలాబ్ స్క్వేర్‌లో ట్రంప్ శవపేటికలో పడుకున్నట్లు ఉన్న మరో హోర్డింగ్‌ను కూడా ప్రదర్శించారు. అందులో ట్రంప్ జుట్టు చెదిరిపోయి, నల్లటి శవపేటికలో ఉన్నట్లు చిత్రీకరించారు.

ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) అనుబంధ సంస్థ అయిన 'ఔజ్ ఆర్ట్స్ అండ్ మీడియా ఆర్గనైజేషన్' ఈ భారీ హోర్డింగులను డిజైన్ చేసింది. గత కొంతకాలంగా అమెరికా-ఇజ్రాయెల్ కూటమి దళాలతో ఘర్షణలు జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరాన్ తన సైద్ధాంతిక, రాజకీయ సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు టెహ్రాన్‌లోని ప్రధాన కూడళ్లను, రద్దీ ప్రాంతాలను ఇలాంటి యుద్ధ స్మారక ప్రచార వేదికలుగా వాడుకుంటోంది. ఈ తాజా పరిణామం పశ్చిమాసియాలో మరింత అలజడికి దారితీసేలా కనిపిస్తోందని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ట్రంప్‌ను చంపితే 10 మిలియన్ డాలర్లు!

డొనాల్డ్ ట్రంప్‌ను చంపిన వారికి 10 మిలియన్ డాలర్ల మొత్తాన్ని ఇస్తామని ఇరాన్ మద్దతుతో నడుస్తున్న ఇరాకీ మిలీషియా గ్రూపులు ప్రకటించాయి. ఈ మేరకు పోస్టర్లు వెలిశాయి. ఈ ప్రకటన ఇప్పటికే రగులుతున్న యుద్ధ జ్వాలలకు మరింత ఆజ్యం పోసింది. ఈ 10 మిలియన్ డాలర్ల మొత్తాన్ని తమ సభ్యులు, మద్దతుదారుల నుండి సేకరించిన విరాళాల ద్వారా సమకూర్చినట్లు 'ఇస్లామిక్ రెసిస్టెన్స్ ఇన్ ఇరాక్' (ఐఆర్ఐ) తెలిపింది.



ఇటీవల వైట్ హౌస్‌లో ఇరాక్ ప్రధాన మంత్రి అలీ అల్-జైదీతో జరిగిన సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ... 2020లో ఇరాన్ అగ్ర సైనిక కమాండర్ మేజర్ జనరల్ ఖాసీం సులేమానీ, ఇరాకీ మిలీషియా నాయకుడు అబూ మహదీ అల్-ముహందిస్‌లను చంపడంలో తన పాత్రను బహిరంగంగా ప్రస్తావించారు. దీనికి ప్రతిచర్యగా ఐఆర్ఐ ఈ ప్రకటన చేసింది. ఇరాక్, సిరియా, గల్ఫ్ ప్రాంతంలోని ఇతర చోట్ల ఉన్న అమెరికా దళాలు, దౌత్య కార్యాలయాలు, మిత్రదేశాలపై వందలాది డ్రోన్, రాకెట్, క్షిపణి దాడులకు ఈ గ్రూపులే కారణమని అమెరికా ఆరోపిస్తోంది. ప్రస్తుత అమెరికా-ఇరాన్ ఘర్షణల నేపథ్యంలో, ఇరాన్ సరిహద్దుల వెలుపల తన సైనిక ఒత్తిడిని కొనసాగించడానికి టెహ్రాన్‌కు ఈ మిలీషియాలు ప్రధాన ఆయుధాలుగా మారాయి.

# గెలిచి సిరీస్ పట్టేస్తారా?

**- నేడు ఇంగ్లాండ్‌తో మూడో వన్‌డే**

**- ప్రస్తుతానికి 1-1తో సమంగా సిరీస్**

**- మరోసారి 'హిట్‌మ్యాన్'ను చూస్తామా..**

**- రోహిత్‌పైనే అందరి కళ్లూ..**



భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య హోరాహోరీగా సాగుతున్న మూడు మ్యాచుల వన్డే సిరీస్ తుది దశకు చేరుకుంది. సిరీస్ విజేత ఎవరో తేల్చే మూడో, చివరి వన్డేకు క్రికెట్ మక్కాగా పేరొందిన లండన్‌లోని చారిత్రాత్మక 'లార్డ్స్' మైదానం వేదికగా నిలవనుంది. ఇప్పటికే బర్మింగ్‌హామ్‌లో జరిగిన తొలి వన్డేలో భారత్ ఘనవిజయం సాధించగా, కార్డిఫ్‌లో జరిగిన రెండో వన్డేలో ఇంగ్లండ్ పుంజుకుని విజయం సాధించింది. దీంతో ప్రస్తుతం సిరీస్ 1-1తో సమం కావడంతో, ఆదివారం లార్డ్స్ వేదికగా జరగనున్న మ్యాచ్ ఇరు జట్లకు కీలకంగా మారింది. ఇంగ్లాండ్ జట్టుతో టీ20 సిరీస్ ను చేజార్చుకున్న టీమిండియా.. వన్డే సిరీస్‌ను ఎలాగైనా చేజిక్కించుకోవాలనే పట్టుదలతో ఉంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో అందరి కళ్లూ భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మపైనే ఉన్నాయి. గత రెండు మ్యాచ్లో వరుసగా 11, 26 స్కోర్లకే వెనుదిరిగి నిరాశపరిచిన హిట్‌మ్యాన్.. బ్యాటింగ్‌కు అనుకూలించే లార్డ్స్ పిచ్‌పై చెలరేగి భారత్‌కు విజయాన్ని అందించాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

రోహిత్ కెప్టెన్‌గా ఉన్నప్పుడు పవర్ ప్లేలో పరుగుల వరద పారించాడు. ఇప్పుడు కూడా ఆ విధంగానే మేటి ఇన్నింగ్స్ ఆడాలని అభిమానులు ఆశిస్తున్నారు. అంతేకాకుండా లార్డ్స్ వన్డే రోహిత్‌కు చివరిదని.. తర్వాత రిటైర్మెంట్ ప్రకటిస్తాడనే ప్రచారం జరుగుతోంది. దీనిని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఖండించినప్పటికీ మ్యాచ్ జరిగాక ఏదైనా సంచలన ప్రకటన రావొచ్చని అభిమానులు ఆందోళన చెందుతున్నారు. దీంతో లార్డ్స్ వన్డేకు క్రేజ్ మరింత పెరిగింది.

బ్యాటింగ్‌లో ఆకట్టుకుంటున్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మూడో వన్డేలో ఎలా ఆడతాడో చూడాలి. గత మ్యాచ్‌లో 65 పరుగులు చేసిన కోహ్లి బ్యాట్ నుంచి ఈ సారి శతకం రావాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. మిడిల్ ఆర్డర్లో శ్రేయస్ అయ్యర్ నిలకడగా రాణిస్తున్నాడు.

లార్డ్స్ మైదానంలో టీమిండియా వన్డే ట్రాక్ రికార్డు పరిశీలిస్తే మిశ్రమంగా ఉంది. ఇక్కడ భారత్ ఇప్పటివరకు ఆడిన 9 వన్డే మ్యాచ్‌ల్లో కేవలం 3 మ్యాచ్‌ల్లో మాత్రమే విజయం సాధించగా 5 మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూసింది. మరో మ్యాచ్ టైగా ముగిసింది. ఈ చరిత్రాత్మక వేదికపై ప్రతికూల రికార్డు ఉన్నప్పటికీ ప్రస్తుత ఫామ్ దృష్ట్యా గిల్ సేన సిరీస్ కైవసం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది.

1983 ప్రపంచకప్ చారిత్రాత్మక విజయం, 2002 నాట్‌వెస్ట్ సిరీస్ వంటి చిరస్మరణీయ విజయాలను భారత్.. ఈ లార్డ్స్ గడ్డపైనే సాధించింది. ఈ నేపథ్యంలో భారత జట్టు అదే ఉత్సాహంతో బరిలోకి దిగనుంది. మరి ఈ ప్రతిష్ఠాత్మక పోరులో టీమిండియా పాత రికార్డులను తిరగరాసి సిరీస్ ట్రోఫీని ముద్దాడాలని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

### అతడిని తొందరగా అవుట్ చేయాలి

ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ కోచ్ అభిషేక్ నాయర్ ఒక స్పోర్ట్స్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కీలక సూచనలు చేశాడు. జో రూట్‌ను ఎంత త్వరగా అవుట్ చేశామన్న అంశం మీదే భారత జట్టు విజయం ఆధారపడి ఉంటుందన్నాడు. ఈ క్రమంలో భారత తుదిజట్టులో పలు మార్పులు సూచించాడు. జో రూట్‌ను వీలైనంత త్వరగా అవుట్ చేయాలి. అతడి కోసం ప్రత్యేక ప్రణాళికలు అవసరం. కాబట్టి కుల్దీప్ యాదవ్‌ను తుదిజట్టులోకి తీసుకున్నా ఆశ్చర్యం లేదు. లేదంటే.. శివం దూబే స్థానంలో ప్రిన్స్ యాదవ్ ను ఆడించవచ్చు" అని అభిషేక్ నాయర్ పేర్కొన్నాడు.

### అయ్యర్ నాలుగు.. రాహుల్ ఐదో స్థానంలో

ఇక తాను ఎంపిక చేసుకున్న తుదిజట్టులో అభిషేక్ నాయర్ ఇద్దరు వికెట్ కీపర్ బ్యాటర్లు కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్లకు చోటిచ్చాడు. అయితే, శ్రేయస్ అయ్యర్ రెగ్యులర్‌గా వచ్చే నాలుగో స్థానంలోనే రావాలని... రెండో వన్డేలో మాదిరి ఇషాన్ కోసం అతడిని డిమోట్ చేయవద్దన్నాడు. అదే విధంగా కేఎల్ రాహుల్‌ను ఐదో స్థానంలో ఆడించి.. ఇషాన్‌ను ఆరో నంబర్ బ్యాటర్‌గా పంపాలని అభిషేక్ నాయర్ సూచించాడు. కాగా అనారోగ్యం కారణంగా కేఎల్ రాహుల్ రెండో వన్డేకు దూరంకాగా ఇషాన్ కిషన్ తుదిజట్టులోకి వచ్చాడు. నాలుగో స్థానంలో బరిలోకి దిగిన ఇషాన్.. ఎనిమిది బంతులు ఎదుర్కొని కేవలం ఒకే ఒక్క పరుగు చేసి నిష్క్రమించాడు. శ్రేయస్ అయ్యర్ ఐదో స్థానంలో వచ్చి అర్ధ శతకం బాదాడు.

### వాషింగ్టన్ సుందర్ అవుట్

ఇంగ్లాండ్‌తో మూడో వన్డేకు ముందు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కీలక ప్రకటన చేసింది. ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ ఈ మ్యాచ్‌కు దూరమైనట్లు తెలిపింది. అతడి స్థానంలో హర్ష్ దూబేను ఎంపిక చేసినట్లు శనివారం ప్రకటించింది. తొలి వన్డేలో టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (80)తో కలిసి ఆల్‌రౌండర్లు అక్షర్ పటేల్ (52), వాషింగ్టన్ సుందర్ (57) జట్టును గెలిపించారు. ఇద్దరూ అజేయ అర్ధ శతకాలతో రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ మ్యాచ్లో సుందర్ సిక్సర్ బాది విజయ లాంఛనం పూర్తి చేశాడు. అయితే, రెండో వన్డేలో మాత్రం బ్యాటింగ్ పరంగా అక్షర్ (1) తో పాటు సుందర్ (2) కూడా పూర్తిగా విఫలమయ్యాడు. ఈ మ్యాచ్‌లో టీమిండియా ఓటమిపాలైంది. ఇక ఈ మ్యాచ్ సందర్భంగా సుందర్ చీలమండకు గాయమైంది. ఈ నేపథ్యంలోనే అతడి స్థానంలో యువ స్పిన్ బౌలింగ్ ఆల్రౌండర్ హర్ష్ దూబేను బీసీసీఐ ఎంపిక చేసింది.

## జపాన్ ఓపెన్ సెమీస్‌లో సింధు



*తెలుగు తేజం పీవీ సింధు చరిత్ర సృష్టించింది. తొలిసారి జపాన్ ఓపెన్ సూపర్ 750 టోర్నీలో ఫైనల్‌కు చేరిన భారత మహిళా షట్లర్గా రికార్డు నమోదు చేసింది. సెమీస్ లో సింధు 21-19, 15-10 తేడాతో చైనాకు చెందిన చెన్ యుఫీయ్‌పై విజయం సాధించింది. రెండో సెట్లో సింధు ఆధిక్యంలో ఉండగానే.. యుఫీయ్ రిటైర్డ్ హర్ట్ గా వెనుదిరిగింది. దీంతో సింధు ఫైనల్లో అడుగు పెట్టింది. రెండేళ్ల తర్వాత ఓ ఫైనల్‌కు చేరడం సింధుకు ఇదే తొలిసారి. చివరిసారి 2024లో సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టోర్నీ విజేతగా సింధు నిలిచింది.*

### యమగుచితో ఫైనల్ పోరు

*జపాన్ ఓపెన్ ఫైనల్లో అకనె యమగుచితో పీవీ సింధు తలపడనుంది. సెమీస్‌లో 9-21, 21-16, 21-14 తేడాతో పుత్రి కుసుమ వర్ధానిపై జపాన్‌కు చెందిన యమగుచి విజయం సాధించి ఫైనల్కు వచ్చింది. ఆదివారం టైటిల్ పోరు జరగనుంది. ఇందులోనూ గెలిస్తే జపాన్ ఓపెన్‌ను సొంతం చేసుకున్న తొలి భారత మహిళా షట్లర్‌గా సింధు అవతరించనుంది.*

## ఫిఫా ఫైనల్ టిక్కెట్ ధర రూ.27 లక్షలు!




ఫిఫా ప్రపంచ కప్ 2026 టోర్నీ తుది దశకు చేరుకుంది. ఆదివారం స్పెయిన్, అర్జెంటీనా మధ్య తుది పోరు జరగనుంది. న్యూయార్క్‌లోని ప్రముఖ 'మెట్‌లైఫ్ స్టేడియం' వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌ను చూసేందుకు ఫుట్ బాల్ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇది ఇలా ఉంటే.. ఇప్పటికే పలు రికార్డులు సృష్టించిన ఫిఫా ప్రపంచ కప్ 2026 మరో రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ఫైనల్ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్ ధర ఏకంగా రూ.27 లక్షలు పలికింది. ఇది ఫిఫా ప్రపంచ కప్ చరిత్రలోనే అత్యధిక ధర కావడం విశేషం.

ఓ స్పోర్ట్స్ మీడియా నివేదిక ప్రకారం.. ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌కు సంబంధించిన అత్యున్నత శ్రేణి (హాస్పిటాలిటీ) టికెట్ ధర ఏకంగా రూ. 27 లక్షలు పలుకుతోంది. ఈ ప్రీమియం హాస్పిటాలిటీ ప్యాకేజీలు కేవలం మ్యాచ్ వీక్షణకే పరిమితం కావు. విదేశీ వీఐపీలు, కార్పొరేట్ దిగ్గజాలను ఆకర్షించేలా స్టేడియంలో ప్రత్యేక విలాసవంతమైన లాంజ్‌లు, ఫైన్ డైనింగ్, విభిన్న లగ్జరీ సేవలను ఫిఫా అందిస్తోంది. అయితే, ఇది కేవలం వీఐపీ ప్యాకేజీ ధర మాత్రమేనని, సామాన్య అభిమానుల కోసం అందుబాటులో ఉండే సాధారణ మ్యాచ్ టికెట్ల ధరలు దీనికంటే చాలా తక్కువగా ఉంటాయని నిర్వాహకులు స్పష్టం చేశారు.

ఇక ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ టికెట్ కనిష్ట ధర 6,943 డాలర్లు (సుమారు రూ.6 లక్షలు)గా ఉంది. యావరేజ్ టికెట్ ధర 11,327 డాలర్లు (సుమారు రూ. 10 లక్షలు)గా ఉంది. అర్జెంటీనా, ఇంగ్లండ్ మధ్య జరిగిన రెండో సెమీఫైనల్ మ్యాచ్ టికెట్ కనిష్ట ధర 7,200 డాలర్లు ( సుమారు రూ.6.93 లక్షలు)గా ఉంది. సెమీస్ తో పోలిస్తే ఫైనల్ మ్యాచ్ టికెట్ కనిష్ట ధర 93 వేలు తక్కువగా ఉండడం గమనార్హం. మొత్తం మీద ఈసారి ప్రపంచవ్యాప్తంగానూ ఫిఫా ప్రపంచకప్ వీక్షకుల సంఖ్య భారీగా పెరిగింది.

## మెస్సీ అద్భుత ఆటగాడు: ట్రంప్



అర్జెంటీనా ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ లియోనెల్ మెస్సీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసల వర్షం కురిపించారు. అదే సమయంలో ఇంగ్లాండ్ జట్టు మేనేజర్ థామస్ టచెల్‌ను విమర్శించారు. సెమీస్ లో ఇంగ్లాండ్‌పై అర్జెంటీనా విజయం సాధించి ఫైనల్‌కు చేరిన సంగతి తెలిసిందే. టైటిల్ పోరులో స్పెయిన్ - అర్జెంటీనా తలపడనున్నాయి. ప్రపంచ కప్ ఫైనల్‌కు తాను హాజరవుతానంటూ ఇప్పటికే ట్రంప్ వెల్లడించారు. ఈ క్రమంలో మెస్సీ ఆటతీరు అద్భుతంగా ఉందని.. ఇంగ్లాండ్ మేనేజర్ టచెల్ నిర్ణయాలు సరిగా లేవంటూ వ్యాఖ్యానించారు.

"నాకూ క్రీడల గురించి తెలుసు. అందులోనూ సాకర్‌పై అవగాహన ఉంది. మెస్సీ ఆటను చూశాక అద్భుతం అనిపించింది. ఇంగ్లాండ్ -అర్జెంటీనా మ్యాచ్‌లో ఎవరూ గమనించని ఓ విషయాన్ని మీకు చెబుతా. ఆ మ్యాచ్లో మెస్సీ అకస్మాత్తుగా కుడివైపునకు వచ్చి నిలబడ్డాడు. అతడు ఇచ్చిన పాస్‌ను నేను చూశా. కుడి వైపు నుంచి బంతిని పాస్ చేయడానికి సిద్ధమైనప్పుడు మరొక ప్లేయర్ కాచుకుని ఉండి.. దానిని గోల్ గా మలిచారు. ఇక్కడే అర్జెంటీనా విజయం.. ఇంగ్లాండ్ ఓటమి ఖరారు అయింది. అందుకే, మెస్సీ గొప్ప ప్లేయర్. ఇలాంటి ఆటగాళ్లు పుట్టుకతోనే ఏదో అదనపు లక్షణాన్ని కలిగి ఉంటారు. రొనాల్డో కూడా ఆ కోవకు చెందిన ప్లేయరే. చాలా ఏళ్లుగా రొనాల్డో నాకు తెలుసు" అని ట్రంప్ వెల్లడించారు.

### టచెల్ నిర్ణయాలపై..

ఇంగ్లాండ్ లోనూ ఓ అద్భుతమైన ప్లేయర్ ఉన్నాడు. అతడితో కలిసి నేను గోల్ఫ్ కూడా ఆడా. అతడే హ్యారీ కేన్. మంచి ఆటగాడు. కానీ, అతడిని వినియోగించుకోవడంలో ఇంగ్లాండ్ తప్పులు చేసింది. కేన్‌తో మరీ డిఫెన్సివ్‌గా ఆడించడమే ఇంగ్లాండ్ మేనేజర్ టచెల్ చేసిన అతిపెద్ద పొరపాటు. దూకుడుగా ఆడి ఉంటే ఫలితం వేరేగా ఉండేది" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

చైతన్య రథం సినిమా
ఆదివారం 19 జూలై 2026 X

# సత్తా చాటిన తెలుగు సినిమా




72వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రకటన వెలువడింది. మరోసారి తెలుగు సినిమా జాతీయ స్థాయిలో తన సత్తాను చాటింది. ఈసారి తెలుగు సినిమాలకు వివిధ కేటగిరిల్లో మొత్తం తొమ్మిది అవార్డులు లభించాయి. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'కమిటీ కుర్రోళ్ళు' ఎంపికైంది. ఉత్తమ మేకప్ విభాగంలోనూ అవార్డు వరించింది. కొత్త నటులతో దర్శకుడు యదు వంశీ రూపొందించి ఈ చిత్రానికి నిహారిక కొణిదెల నిర్మాతగా వ్యవహరించారు.. బాక్సాఫీస్‌తో పాటు ఓటీటీలోనూ అదరగొట్టిన ఈ మూవీ ఇప్పుడు ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ అవార్డుల్లో జాతీయ సమైక్యత. మతసామరస్యం, అణగారిన వర్గాల సామాజిక అభ్యున్నతికి ఉద్దేశించిన చిత్రంగా వివిధ విభాగాల్లో మెరిసింది.

ఇక నాగ్ అశ్విన్ విజువల్ వండర్ 'కల్కి 2898 ఏడీ' రెండు కేటగిరీల్లో అవార్డులను దక్కించుకుంది. అద్భుతమైన సెట్స్, విజువల్స్ అలరించినందుకు ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ అవార్డుతో పాటు, ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా జాతీయ అవార్డును సొంతం చేసుకుంది. 'ఎంత గొప్పగా ఆడావు అన్నది ముఖ్యం కాదు.. ఎప్పుడు ఆపావన్నదే ముఖ్యం, 'ఒక్క రోజులో ఒక అరగంట నాకు నచ్చినట్టు గడవలేదు.

దానికి జీవితాంతం ఏడుస్తూ కూర్చోలేను కదా' వంటి సంభాషణలతో అలరించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. ఇలాంటి అద్భుతమైన సంభాషణలను రాసి జీవిత సత్యాలెన్నో చెప్పిన దర్శకుడు వెంకీ అట్లూరి ఉత్తమ రచయితగా (సంభాషణలు) జాతీయ అవార్డు దక్కింది.

మాస్‌నే కాదు, భారతీయ బాక్సాఫీస్‌ను ఓ ఊపు ఊపేసిన చిత్రం 'పుష్ప2'.. ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఈ మూవీని ఆద్యంతం అలరించేలా తీర్చిదిద్దిన దర్శకుడు సుకుమార్ ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత (ఒరిజినల్) కేటగిరిలో అవార్డుకు ఎంపిక కాగా, ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్‌గా పాలి నూర్, సీతల్ శర్మలకు అవార్డు దక్కింది. చిన్న చిత్రం కాదు.. ప్రతి ఒక్కరి మనుసుల్ని హత్తుకునేంత పెద్ద చిత్రమనించింది. '35- చిన్న కథ కాదు'. ఇప్పుడు జాతీయ అవార్డుల్లో ఉత్తమ బాలల చిత్రంతో పాటు, ఉత్తమ బాల నటుడిగా అరుణ్ దేవ్ పోతుల అవార్డుకు ఎంపికయ్యారు.



## ఉత్తమ నటులు మమ్ముట్టి, కార్తీక్ ఆర్యన్

- ఉత్తమ నటి యామీ గౌతమి
- ఉత్తమ దర్శకుడు రాజ్‌కుమార్ పెరియాసామి
- ఉత్తమ చిత్రం ఆర్టికల్ 370
- ఉత్తమ ప్రజాదరణ చిత్రం: కల్కి 2898 ఏడీ
- ఉత్తమ బాలల చిత్రం: 35 చిన్న కథ కాదు
- 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రకటన

*72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్రం శనివారం ప్రకటించింది. 2024 సంవత్సరానికి గానూ మొత్తం 400లకు పైగా చిత్రాలు జ్యూరీ ముందుకు రాగా, వాటిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వాటిని ఎంపిక చేసినట్లు కమిటీ తెలిపింది. ఉత్తమ నటుడి అవార్డును ఇద్దరు పంచుకున్నారు. 'చందూ ఛాంపియన్', 'భ్రమయుగం'లో నటనకు గానూ కార్తిక్ ఆర్యన్, మమ్ముట్టిలను ఈ అవార్డు వరించింది. ఉత్తమ నటిగా యామి గౌతమ్ (ఆర్టికల్ 370) ఎంపికయ్యారు. ఉత్తమ దర్శకుడిగా రాజ్‌కుమార్ పెరియాసామి (అమరన్) ఎంపికయ్యారు. ఉత్తమ తెలుగు చిత్రంగా 'కమిటీ కుర్రోళ్లు' జాతీయ పురస్కారానికి ఎంపికైంది. అలాగే ఉత్తమ తమిళ చిత్రంగా 'రాయన్' నిలిచింది.*

### జాతీయ చలన చిత్ర అవార్డు విజేతలు వీళ్లే

*ఉత్తమ నటుడు: మమ్ముట్టి (భ్రమయుగం)*
*ఉత్తమ నటుడు: కార్తిక్ ఆర్యన్ (చందూ ఛాంపియన్)*
*ఉత్తమ నటి: యామి గౌతమ్ (ఆర్టికల్ 370: హిందీ)*
*ఉత్తమ చిత్రం: ఆర్టికల్ 370 (ఆదిత్య సుహాస్ జంబాలే)*
*ఉత్తమ దర్శకత్వం: అమరన్ (రాజ్‌కుమార్ పెరియసామి)*
*ఉత్తమ సహాయ నటి: మిథ్య (రూపశ్రీ వర్కాడే)*
*ఉత్తమ సహాయ నటి: సచన నమిదాస్ (మహారాజ)*
*ఉత్తమ సహాయ నటుడు: సంజయ్ మిశ్రా (భక్షక్)*
*ఉత్తమ బాలల చిత్రం: 35 చిన్న కథ కాదు (దర్శకుడు-నంద కిషోర్)*
*ఉత్తమ జాతీయ, విలువల చిత్రం: కెప్టెన్ మిల్లర్ (దర్శకుడు- అరుణ్ మాథేశ్వరన్)*
*ఉత్తమ ప్రజాదరణ చిత్రం: కల్కి 2898 ఏడీ (నాగ్ అశ్విన్)*
*ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు: రణ్ దీప్ హుడా (స్వాతంత్ర్య వీర్ సావర్కర్)*
*ఉత్తమ యాక్షన్: మహారాజ (అనలు అరసు, తమిళ్)*
*ఉత్తమ కొరియోగ్రఫీ: విజయ్ గంగూలీ (ఆజ్ కిరాత్ -స్త్రీ2)*
*ఉత్తమ గేయరచన: మనోజ్ ముంతాషిర్ (జానేదో-మైదాన్)*
*ఉత్తమ సంగీతం (నేపథ్యం): జీవీ ప్రకాశ్ కుమార్ (అమరన్)*
*ఉత్తమ సంగీతం (సాంగ్స్) శశ్వాంత్ సన్దేవ్ (ఆర్టికల్ 370)*
*ఉత్తమ మేకప్: పి. రవికుమార్ (కమిటీ కుర్రోళ్లు)*
*ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: దీపాలి నూర్, సీతల్ శర్మ (పుష్ప2)*
*ఉత్తమ ప్రొడక్షన్ డిజైనర్: నితిన్ జిహానీ చౌదరి (కల్కి 2898 ఏడీ)*
*ఉత్తమ ఎడిటింగ్: ఆర్ కలైవానన్ (అమరన్)*
*ఉత్తమ సౌండ్ డిజైన్: మానస్ చౌదరి (భూల్ భూలయ్య 3-హిందీ)*
*ఉత్తమ స్క్రీన్‌ప్లే (సంభాషణలు): వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్)*
*ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత (అడాప్టెడ్): యోగేశ్ దేశ్ పాండే (స్వరగంధర్వ సుదిర్ ఫాడ్కే)*
*ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత (ఒరిజినల్): సుకుమార్ (పుష్ప2)*
*ఉత్తమ సినిమాటోగ్రఫీ: షెహనాద్ జలాల్ (భ్రమయుగం)*
*ఉత్తమ గాయని: వైకోమ్ విజయలక్ష్మీ (ఏఆర్ఎం)*
*ఉత్తమ గాయకుడు: అభయ్ జోథ్ పూర్కర్ (గరాత్ గణపతి)*
*ఉత్తమ బాల నటులు: రిద్ధిమాన్ బెనర్జీ, తపోమయ్ దేవ్, గీతాశ్రీ చక్రవర్తి (ఆంకో కి కితిన్ -బెంగాలీ)*
*ఉత్తమ బాల నటుడు: అరుణ్ దేవ్ పోతుల (35 చిన్న కథ కాదు)*
*ఉత్తమ బాల నటుడు: అతిశ్ శెట్టి*
*స్పెషల్ మెన్షన్: మెయ్యజగన్- తమిళ్ (ఫిల్మ్ సౌండ్ మిక్స్ ఇంజినీర్: సురేన్ జి ) కెప్టెన్ మిల్లర్ (తమిళ్): ధనుష్*
*ఉత్తమ తెలుగు చిత్రం: కమిటీ కుర్రోళ్లు*
*ఉత్తమ తమిళ చిత్రం: రాయన్*
*ఉత్తమ మలయాళ చిత్రం: ఫెమించి ఫాతిమా*
*ఉత్తమ కన్నడ చిత్రం: మిథ్య*
*ఉత్తమ హిందీ చిత్రం: శ్రీకాంత్*



## ఆమిర్‌కు బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులు!

బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్ మరోసారి వార్తల్లో నిలిచారు. ఆమిర్‌కు సోషల్ మీడియా ద్వారా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరుతో ఓ బెదిరింపు సందేశం వచ్చినట్టు పలు మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ బెదిరింపు సందేశంలో ఆమిర్ ఖాన్ మూడో వివాహాన్ని ప్రస్తావిస్తూ తీవ్ర వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. అయితే, ఈ పోస్టులు, ఆడియోల ప్రామాణికతను ఇప్పటివరకు పోలీసులు ధ్రువీకరించలేదు.

అర్జు బిష్ణోయ్, టైసన్ బిష్ణోయ్ పేర్లతో విడుదలైన ఆ సోషల్ మీడియా పోస్టు, ఆడియోలో ఆమిర్ ఖాన్ మూడో వివాహాన్ని లవ్ జిహాద్‌గా అభివర్ణిస్తూ, అలాంటి చర్యలను సహించబోమని హెచ్చరించారు. ఆమిర్ తన చర్యలకు మూల్యం చెల్లించాల్సి ఉంటుందని కూడా ఆ సందేశంలో పేర్కొన్నట్లు సమాచారం. ఇటీవల గౌరీ స్ప్రాట్‌ను ఆమిర్ ఖాన్ వివాహం చేసుకోవడంతో కొందరు రాజకీయ నాయకులు, మతపరమైన సంస్థలు విమర్శలు గుప్పించాయి. మహారాష్ట్ర మంత్రి నితేశ్ రాణే కూడా ఈ వివాహంపై వ్యాఖ్యలు చేస్తూ.. 'లవ్ జిహాద్' అంశాన్ని ప్రస్తావించారు.

ఈ వివాదాలపై ఇప్పటికే ఆమిర్ ఖాన్ స్పందించారు. తన వివాహాల్లో మత మార్పిడి జరగలేదని స్పష్టం చేశారు. తన మాజీ భార్యలు రీనా దత్తా, కిరణ్ రావు, అలాగే ప్రస్తుత భార్య గౌరీ స్ప్రాట్ ఎవరూ తమ మతాన్ని మార్చుకోలేదని తెలిపారు. తమది అన్ని మతాలను గౌరవించే కుటుంబమని చెప్పారు. కాగా, తాజాగా ఆమిర్‌కు వచ్చిన ఈ బెదిరింపు వ్యవహారంపై అధికారిక పోలీసు ప్రకటన లేదా దర్యాప్తు వివరాలు వెలువడలేదు.

## 'ది ఒడిస్సీ': తొలిరోజు వసూళ్లు అదరహో!



ప్రపంచదేశాలతో పాటు, భారత్‌లోనూ సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూసిన క్రిస్టఫర్ నోలన్ దర్శకత్వంలో రూపొందిన ఫాంటసీ యాక్షన్ ఫిల్మ్ 'ది ఒడిస్సీ' తొలిరోజు అదిరిపోయే రేంజ్‌లో వసూళ్లు నమోదు చేసింది. శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'ది ఒడిస్సీ' తొలిరోజు భారత్‌లో రూ.20.76 కోట్లు వసూళ్లతో రికార్డు సృష్టించింది. ఇక ప్రపంచవ్యాప్తంగా ఈ మూవీ 50 మిలియన్ డాలర్లు (రూ.470 కోట్లకు పైగా) వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. హోమర్ రాసిన 'ది ఒడిస్సీ' ఇతిహాసం ఆధారంగా క్రిస్టఫర్ నోలన్ అద్భుత దృశ్య కావ్యంగా దీన్ని తీర్చిదిద్దారు మాట్ డామన్, టామ్ హాలెండ్, అన్నీ హథవే, రాబర్ట్ ప్యాటిన్సన్, జెండయా కీలక పాత్రల్లో నటించారు. సుమారు రూ.2వేల కోట్ల బడ్జెట్తో కేవలం 91 రోజుల్లో ఈ మూవీ షూటింగ్ పూర్తి చేయడం విశేషం. సినిమా మొత్తాన్ని ఐమ్యాక్స్ 70 వీవీ కెమెరాలతో తీయడం గమనార్హం. థియేట్రికల్ అనుభూతిని పంచే మూవీ కావడంతో సినీ ప్రేక్షకులు థియేటర్లకు క్యూ కడుతున్నారు. వీకెండ్ పూర్తయ్యే సరికి ఈ వసూళ్లు రెట్టింపు కావడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ట్రోజన్ యుద్ధం తర్వాత ఒడిస్సియస్ (మాట్ డామన్) తన రాజ్యం ఇథికాకు సముద్రమార్గం ద్వారా పయనమవుతాడు. పదిరోజుల్లో ఇథికాకు చేరుకోవాల్సిన ఒడిస్సియస్‌కు సముద్ర ప్రయాణంలో ఎలాంటి ఆపదలు వచ్చాయి? ఈ క్రమంలో ఎవరెవరిని ఎదుర్కొన్నాడు? గ్రీకు దేవతలు అతనిపై ఎందుకు కోపం చూపించారు? భార్య, బిడ్డలను కలుసుకోవడానికి ఒడిస్సియస్‌కు పదేళ్లు ఎందుకు పట్టింది? అన్నది తెలియాలంటే సినిమా చూడాల్సిందే!

## అందమైన ప్రేమకథ.. చెన్నై లవ్‌స్టోరీ




కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ జంటగా దర్శకుడు సాయి రాజేష్ స్వయంగా నిర్మించిన చిత్రం 'చైన్నై లవ్‌స్టోరీ'. రవి నంబూరి దర్శకుడు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జులై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శనివారం చిత్ర ట్రైలర్ విడుదలైంది. బలమైన భావోద్వేగాలతో నిండిన అందమైన ప్రేమకథగా దీన్ని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. 'ప్రతి ప్రేమ కథ ఒకేలా ఉంటే చరిత్రకు కూడా నచ్చదు', 'నమ్మనివాడికి ఈ కథ ఒక అబద్ధం.. నమ్మగలిగితే అదే అద్భుతం' వంటి సంభాషణలు అలరిస్తున్నాయి.